

14-1-72

50 పైసలు

ముగ్గుముచ్చట్లు -బాపు



పిన్ని రథం ముగ్గు వేసుకుంటూ వెళ్లింది బాబాయ్! రేపో ఎప్పుడో వస్తుంది!
ఏమిటే? నీకు ముగ్గువేయడం కూడా రాదా!!
ఒకళ్ల రథం మీదికి మరొకటి వెళ్లింది - అదీ గొడవ!

బాలర సమర్పించు శ్రీరమణా చిత్ర వారి

బుల్లెమ్మ బుల్లోడు

దర్శకత్వం. నాగాంజనేయులు

రచన రాజశ్రీ సంగీతం సత్యం, కెమెరా: ఆర్. మధు ఎడిటింగ్: అంకిరెడ్డి. ఆర్టు: సోమనాథ్

శ్రీ ఫిలింస్



పాఠకులకి, రచయిత(త్రు)లకెల్లరికీ మా సంక్రాంతి శుభాకాంక్షలు— సం॥

* *

సకాలానికి అందని కారణంగా ఈ వారం 'రాజధాని కబుర్లు' వెయ్యలేక పోతున్నాము.

* * *

ఉత్తరాలు

దీపావళి కథల పోటీలో రెండవ బహుమతి పొందిన వ్యాసరచయిత శ్రీ తిప్పావఝ్ఝల వెంకట్రామయ్యగారు పంపిన ఫోటో, వివరాలని ఈ క్రింద వేస్తున్నాము— సం.


"పేరు— తిప్పావఝ్ఝల వెంకట్రామయ్య. పుట్టిన తేది:— 12—3—1930. స్వస్థలం:— దగదర్తి (కోవూరు తాలూకా, నెల్లూరు జిల్లా). వృత్తి:— ఉపాధ్యాయ వృత్తి.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి బి. ఎ. బి. ఇడి. డిగ్రీలను పొందాను.

విద్యార్థిదశలో వ్యాస రచన వక్తృత్వ పోటీల్లో ఇచ్చిన బహుమతులు ఉన్నాయి. 'అందని పళ్ళు' అనే నా మొదటి కథను ఆంధ్ర పత్రిక వారపత్రిక బాలసాహితిలో ప్రచురించారు. తరువాత బంధు ప్రేమ, కలిసిన ధ్రువాలు, రోడ్డు రోలరు— ఇంజను అనే కథలు, కొన్ని గేయాలు పత్రిక వారపత్రికలో ప్రచురింప బడ్డాయి.

జాగృతి, ప్రభ వారపత్రికల్లో కొన్ని కథలు, గేయాలు ప్రచురితమయ్యాయి.

నాటకానుభవం ఉన్నది. రాయబారంలో కృష్ణుడు,



శ్రీ తిప్పావఝ్ఝల వెంకట్రామయ్య.

గయోపాఖ్యానంలో అర్జునుడు, అభిమాన పాత్రలు. (ఔత్సాహికంగా మాత్రమే!)

వివాహం విషయం చెప్పనక్కర లేదు గదా! పిల్లలు నియంత్రణ పరిమితికి రెండు రెట్లు మాత్రమే!

దీపావళి కథల పోటీ విజేతలకు నా అభినందనలు."

ముఖచిత్రం

ఈ వారంపత్రిక ముఖచిత్రం (వాణిశ్రీ) ఎంతో ఆకర్షణీయంగా ఉంది. 'గేమ్' అనేకథ ఎంతో బాగుంది. ఆ కథ చదువుతుంటే నాకు ఏడుపొచ్చేసినంత పనయింది.

గద్దె లక్ష్మణరావు (పెదనందిపాడు)

*

ఈ వారం (31—12—71) పత్రికకు శ్రీ గిరి సెట్టిగారి ముఖచిత్రం అందాన్నిచ్చింది.

ఉపగారి అప్పం భారతి, లక్ష్మీకాంతం, కోటేశ్వర రావు, (శ్రీకాకుళం)


మంచివాళ్ళకు శుభవార్త! మోసగాళ్ళకు హెచ్చరిక!
రవిచిత్ర ఫిలిమ్స్
సమర్పించు
మొనగాడొస్తున్నాడు
జాగ్రత్త
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత వై.వి.రావ్. దర్శకత్వం

సీరియల్

హరిమణా సోమేశ్వర్ గారి 'పిల్లలతో ప్రేమయాత్ర' వినోదకరంగాను, ఆహ్లాదకరంగాను సాగుతోంది. ముఖ్యంగా దేవస్థానాల్లో యాత్రికుల ఇక్కట్లను చక్కగా వివరించారు. కాంతారావు పాత్ర కొత్త తరహాగా ఉంటున్నది.

మహమ్మద్ నసూరుద్దీన్ (హైదరాబాదు)

* * *

కొత్తగా మొదలైన సీరియల్ 'గూడు చేరిన పక్షులు' చాలా బాగానే ఉందిగాని, వంటమనిషి సీతమ్మతో పాటు ప్రేమించిన ప్రసాద్‌గూడా 'అమ్మాయిగారు' అని సంబోధించుట ఏమాత్రము బాగా లేదు. అతను ఆమె క్రింద ఉద్యోగము చేసేవాడా?

—వైదేహి (బ్రాహ్మణపల్లి)

ఒకవారం విపరీతం

3—12—71 సంచికలోని బి. కమలాకరరావు ఉత్తరము చదివి దిగ్భ్రాంతుడనయ్యాను. నేరమును సమర్థించడములో ఆయనకు గల ప్రతిభ మెచ్చుకో తగ్గది. నేరము చేయుడముకన్నా నేరము సమర్థించుట మహానేరము. ఈ సందర్భములో నక్సలైట్లు తాము చేసిన పనిని సమర్థించుకొనుట గుర్తు వచ్చుచున్నది.

చైన్ లాగుడము వలన బండి ఆగకపోవుటకు గార్డుకు ఏటి సంబంధము లేదు. బండి ఆగనిచో అధికారులకు రిపోర్టు చేయాలి గాని గార్డుపై చేయిచేసికొనుట నేరము. చట్టరీత్యా దోషి శిక్షార్హుడు. ఈ సందర్భములో దోషిని విపరీతముగా పొగుడుట అనవసరం.

రైల్వే వారిని చూచిన అధికారపు స్వరముతో మాట్లాడి చేయిచేసికొనుట ఈ రోజులలో సరదా అయినది. ఎట్టి నేరస్తులను ఎన్నుకొనుటలో మహారాష్ట్ర నాయకులు జాగ్రత వహించవలెను. రైల్వే ఉద్యోగులకు దుండగుల బారినుండి రక్షణలేనిచో వారు తమ బాధ్యతలను నెరవేర్చలేరు.

సీహెచ్. రామమూర్తి (కోరాపుట్)

(పై ఉత్తరం 'సౌత్ ఈస్టర్న్ రైల్వేమెన్స్ యూనియన్ రి నం.3580, కోరాపుట్ బ్రాంచ్' అనే మాటలు కల లెటర్‌హెడ్‌మీద వచ్చింది. ఒక మూల 'సెక్రటరీ' అన్నమాట కూడా ఉంది. సం.)

రాజధాని కబురు

క్రిష్టమస్ పత్రికలోని రాజధాని కబుర్లు చదివాను. బి. నాగేశ్వరరావు గారన్న మాటల్లో నిజం లేకపోలేదు.

యుద్ధ సమయంలో ప్రభుత్వం రేట్లు పెరగకుండా (ఏదో చేయనున్నట్లు) 'అది చేస్తాం, ఇది చేస్తాం' అని చాటుకోవడం ఏమీ బాగా లేదు. చౌక బియ్యం డిపోల దగ్గర ఆకలి కడుపులు చేత్తో తడుముకుంటూ, స్త్రీలు— పురుషులు కొట్టుమిట్టాడే దుస్థితి మనం గమనించే విషయమే! ఇట్లాంటి సమయంలో మధ్య తరగతి వారినుండి, పేద ప్రజవరకు ప్రభుత్వం ఏదో ధరల సదుపులో ఉంచుతుందని ఎంతకాలం ప్రభుత్వ కార్యక్రమాల

ఉత్తరాలు

కొరకు ఎదురు చూడగలరు? ఇంతవరకు అట్లాంటి కార్యక్రమాలేవి చేపట్టినట్లు కూడా కన్పడడం లేదు.

పేదవారందరూ తమ సమయాన్ని 'క్యూ'ల దగ్గరే గడిపితే, వారు ఏ సమయంలో డబ్బు సంపాదనార్థం వెళ్లగలరు? ఈ ఒక్క విషయం ప్రభుత్వం కనీసం దృష్టిలో నుంచుకొని ఏ విషయంలోనైన త్వరితగతిని కార్యక్రమాల నాచరించటం జరిపితే 'ఆహార కొరత'ని అరికట్టగలమనటంలో సందేహం లేదు. రేట్లు పెరగకుండా ఉండాలన్నా, క్యూలు పెరగకుండా చెయ్యాలన్నా, ఎక్కువ ఆహారాన్ని ఎలు ప్రాంతాలలో ప్రభుత్వ సంస్థలే స్వయంగా దుకాణాల్ని తెరిపించి, నిర్ణీత ధరలకు ప్రజానీకానికి అందుబాటులో ఉండేటట్లు చేయగల్గితే, ప్రజ ఆశించేది కూడా ఇంకేముంటుంది?

ఎస్. వి. కమలాకరరావు, (విజయవాడ)

పాఠకులకి మనవి

31—12—71 ఆంధ్రసచిత్రవారపత్రికలో నేను వ్రాసిన 'గూడు చేరిన పక్షులు' సీరియల్ నవల 3 వ భాగంలో కృష్ణ, కమలకు బదులుగా సీత, రామం అని పొరపాటున వ్రాసినాను. పాఠకులు ఆ పొరపాటుని గమనించి మన్నించ గలరు.

—యర్రం చంద్రశేఖరం.



భారత అణుశక్తిసంఘం అధ్యక్షుడు, ప్రముఖ జ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ విక్రమ్ ఎ సారాభాయ్ డిసెంబరు 30 వ తేదీ ఉదయం తిరువనంతపురంలో మరణించారు.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 14-1-72

శ్రీ విరోధికృన్నామ సం. పుష్య మా॥ బహుళ త్రయో

సంపుటము: 60 సంచిక: 21

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు - 1

విడి ప్రతి వెల 50 పైసలు


విషయానుక్రమణిక

ముఖచిత్రం: 'సంక్రాంతి'
(చిత్రకారుడు: శ్రీ పి. వెంకటరావు)
రెండవ అట్ట పేజీలో:
ముగ్గు ముచ్చట్లు (కార్టూన్)
మధ్య పేజీలలో:
1972 కాలెండరు

కథలు:
ఆషాఢమాసం — 17
పరీక్ష — 32
వాన కురిసింది — 48

సీరియల్ నవల:
గూడుచేరిన పక్షులు — 24
పిల్లలతో ప్రేమయాత్ర — 40

వ్యాసాలు, శీర్షికలు, సినిమా:
ఉత్తరాలు — 2, ఉసేన్ కార్టూన్ — 5, భానుమతి రామకృష్ణలో ఇంటర్వ్యూ — 6, ఒక వారం విపరీతం — 8, ప్రశ్నావళి — 10, రెండు కోణం...—12, 1971 లో విడుదలైన తెలుగు చిత్రాలు — 14, [illegible] — 20, వివిధ ప్రాంతాలలో సంక్రాంతి పండుగలు — 22, సంక్రాంతి మహాలక్ష్మి (కవిత) — 33, వారఫలం — 38, సంక్రాంతి (గేయం) — 46, ఓనమః శివాయ — 50, ధర్మపథం — 54, సినిమా బొంబాట్ — 55, శారద ఇంటర్వ్యూ — 56, విధిని నమ్ముతారా? — 57, రామకృష్ణ ఇంటర్వ్యూ, సినిమా — 58, సినిమా డైరీ — 60, చంద్రకళ... ఇంటర్వ్యూ, అవీ, ఇవీ — 64.


మనదేశం చేతిలో- మంచి ముక్కలున్నాయి.
పాక్
భారత్
తాగుబోతు డ్రయివరు
భారత దేశంపై ద్వేషం
పాకిస్తాన్
పత్రికలు
న్యూస్‌ప్రింట్ తగ్గింపు
1972 లో శాంతి - భారతదేశం వాంఛ
స్నేహ
అన్ని దేశాలతోనూ
సం
బంధాలు
OOMMEN

పద్మశ్రీ భానుమతీ రామకృష్ణతో ఇంటర్వ్యూ



స్క్రిప్టు కార్యక్రమంలో నిమగ్నులయి వున్న శ్రీమతి భానుమతీ రామకృష్ణ.

'మీవంటి గొప్ప ఆర్టిస్టుని మరొకర్ని భారతదేశం మొత్తంలో నేను చూడలేదు!' అన్నారు ఒక ప్రముఖ హిందీ నిర్మాత— నటిగా పద్మశ్రీ భానుమతి ప్రజ్ఞను ప్రశంసిస్తూ.

ఆయన పేరు ప్రేమ్‌జీ, ఆయన చూసిన చిత్రం పేరు మట్టిలో మాణిక్యం అసాధారణమైన లలిత భూమికలో ఆ చిత్రంలో శ్రీమతి భానుమతి—ఆ పాత్రను తను తప్ప మరెవరూ అంత గొప్పగా పోషించలేరన్నంత నేర్పుతో పోషించిన సంగతి తెలుగువారందరికీ తెలిసినదే! పెక్కుమంది అగ్రశ్రేణి నటీనటులతో చిత్రాలు నిర్మించిన ప్రేమ్‌జీ వంటి అనుభవజ్ఞుడైన ఉత్తరాది నిర్మాత శ్రీమతి భానుమతి గురించి పైన పేర్కొన్న మాట అన్నారంటే—ఆమె తెలుగుదేశంలో పుట్టినందుకు మనమంతా గర్వించాలి! తెలుగు చలనచిత్ర కళామతల్లికి సేవ చేస్తూ, కళాకారిణిగా నిరంతరం కృషి చేస్తున్నందుకు మనమంతా అభినందించాలి!

బహుముఖ ప్రజ్ఞాశాలిని

శ్రీమతి భానుమతికి—సినిమారంగంలో 'మేడమ్ భానుమతి'గా ఒక ప్రత్యేకస్థానం ఉన్నట్లే, తెలుగు సారస్వత రంగంలోను పాఠకుల్లోనుకూడా 'భానుమతీ రామకృష్ణ'గా ఆమెకొక ప్రత్యేక స్థానం ఉన్నది. ఆమె ఏపని చేసినా ఒక ప్రత్యేకత స్పష్టంగా కానవస్తుంది. ఆ ప్రత్యేకతను ఆమె ఎపుడూ నిలుపుకొంటూనే వస్తున్నారు కథారచనలోను, నటనలోను మాత్రమేగాక, సంగీతంలోను, దర్శకత్వంలోను, సినిమా స్క్రిప్టు రచనలోనూ విశేషమైన నేర్పు గడించారు, ఆమె గురించి యిలా ఒక్కొక్కటిగా చెప్పటంకన్న— భానుమతి 'బహుముఖ ప్రజ్ఞాశాలిని!' అనటం సమంజసంగా ఉంటుంది

చాలాకాలం తర్వాత దర్శకత్వం

చాలాకాలం తర్వాత శ్రీమతి భానుమతి మళ్ళీ ఒక చిత్రానికి దర్శకత్వం నెరపుతున్నారు. అది వారి స్వంత చిత్రం. భరణీ పిక్చర్స్ పతాకంకింద నిర్మిస్తున్న 19 వ చిత్రం.

'దర్శకత్వం అనేది పెద్ద కష్టతరమైన పనికాదు నాకు నేను అందరి దర్శకులదగ్గరా పనిచేశాను ఆ శాఖలోని మెళకువలన్నీ తెలుసుకోగలిగాను మావారు యిపుడు పిక్చర్ తీసె మూడ్‌లో లేరు 'ఈ పిక్చర్ నువ్వే తియ్యమ'ని చెప్పారు. ఇది నేను డైరెక్టు చెయ్యకపోతె వారు చెయ్యటం కష్టం! ఎందుకంటే— కార్తిగా స్క్రిప్టుమీద వర్క్ చేసి, డైలాగుల దగ్గర్నుంచి అన్నీ చూసుకుని, సజ్జెక్టు బాగారావడానికి కృషిచేశాను సజ్జెక్టు చక్కగా పాలో అయ్యాను గనుక, ఈ చిత్రానికి నేనే దర్శకత్వం వహించడం మంచిదని నాకూ అనిపించింది మా సంస్థ యీ సంవత్సరంలో నిర్మించబోయే మరో చిత్రానికి మావారు దర్శకత్వం వహిస్తారు' అన్నారు భానుమతీ రామకృష్ణ— తాను చిత్రాన్ని డైరెక్టు చేయటానికిగల కారణం వివరిస్తూ

'అత్తగారి కథ'ల్లో నరసమ్మ ఇందులో ఉంది!

'నా అత్తగారి కథల్లో ఉండే నరసమ్మ పాత్రను యీ చిత్రంలోని ఒక పాత్రద్వారా ప్రవేశపెడుతున్నాను ఆ పాత్రను శ్రీమతి ఛాయాదేవికి యిచ్చాను. ఇందులోని అన్ని పాత్రలూ బాగావస్తున్నాయి కొత్తవాళ్ళు కొందర్ని యీ చిత్రంలో పరిచయం చేస్తున్నాను కథానాయిక వేషం 'పద్మిని' అనే కొత్తమ్మాయిచేత వేయించాను తెలుగు బాగా మాట్లాడుతుంది హైదరాబాద్‌కు చెందిన రాజలక్ష్మి అనే కొత్తమ్మాయికి కూడా ఒక ముఖ్యమైన వేషం యివ్వటం జరిగింది పాత్రలకు తగినవాళ్ళనే పెట్టాను. నా టెంపర్‌మెంటుకి తగ్గట్టుగా నా పాత్రను మలచుకున్నాను' అన్నారు భానుమతి

'ఈ చిత్రంలో ఇతివృత్తం ఎలాంటిది?'

'ఇది చాలా అద్భుతమైన కథ వ్యంగ్య ధోరణిలో సాగుతుంది. సంభాషణలు మట్టిలో మాణిక్యంలో వలెనే బాగావచ్చాయి.

కొన్ని నేను రాశాను మరికొన్ని నరసరాజు గారు రాశారు ఇదొక ప్రయోజనాత్మక చిత్రం స్త్రీకి వ్యక్తిత్వం ఉండాలంటూ, ఆమె ఉండవలసిన హద్దులూ — ఈ రోజున ఆడది ఎలా నడచుకోవాలో మొదలయిన అంశాలమీద యీ సబ్జక్ట్‌లో డీల్‌చేయటం జరిగింది ముప్పాతిక భాగం పూర్తి అయింది మార్చిలో విడుదలవుతుంది యీ చిత్రం సృజనాత్మక శక్తితో నా బాధ్యతను నేను నిర్వహిస్తున్నాను జయాపజయాలు దైవాధీనాలు!' అన్నారు, భానుమతి — నా ప్రశ్నకు సమాధానంగా.

'అంతా మనమంచికే!'

సంగీతం ఒక విశేషాకర్షణ!

'అంతా మన మంచికే!' అని పేరు పెట్టిన తమ 19వ చిత్రంలోని సంగీతం గురించి ఆమె ముచ్చటిస్తూ 'ఇందులో సంగీతం టాప్‌గా వుంటుంది ఈ తరం ప్రేక్షకుల అభిరుచినికూడా దృష్టిలో వుంచుకుని అన్నిరకాల సంగీతం నా చిత్రంలో జొప్పించాను ఇందులో 9 పాటలున్నాయి వాటిలో ఆరు పాటలు నేను పాడాను సంగీతం నేనే కంపోజ్ చేసుకుంటాను సంగీతంలో నాకున్న అభిరుచిని బట్టి, నా గొంతుకు తగినట్లుగా నేనే వరుసలు చేసుకున్నాను నాకుకో మ్యూజిక్ డైరెక్టర్‌గా సత్యం పనిచేస్తున్నారు' అన్నారు

ప్రిన్సిపల్ : బ్రేక్!

'ఇన్ని చిత్రాలకన్న ఎక్కువ నటించ కూడదనే ప్రిన్సిపల్ మొదట పరిశ్రమలో నాతోనే ఆరంభం అయింది నేను సంవత్సరానికి రెండు లేక నాలుగు చిత్రాలకు మించి నటించను సాధారణంగా రెండు చిత్రాల్లో నటిస్తాను అలాంటిది కోపం వచ్చి ఒకసంవత్సరం 55–56లో మాత్రం 18 పిక్చర్లలో పనిచేశాను అన్ని చిత్రాలు అంగీకరించటంవల్ల 'అన్నింటికీ న్యాయం చేకూర్చలేను అన్ని పిక్చర్స్ మళ్లీ ఎప్పుడూ ఒప్పుకో లేదు' అంటూ చెప్పారు భానుమతి ప్రిన్సిపల్ గురించిన సంభాషణ వచ్చినపుడు.

మంచి మార్గం

గడచిన సంవత్సరం పరిశ్రమకు మేలు చేసిందా, కీడు చేసిందా?' అని నేనడిగిన ఇంకొక ప్రశ్నకు సమాధానం యిస్తూ శ్రీమతి భానుమతీ రామకృష్ణ ఇలా అన్నారు '71 ఒక రకంగా పరిశ్రమకు చక్కని మార్గాన్ని చూపిందని చెప్పవచ్చును అదేమిటంటే — ఈ సంవత్సరం తెలుగు నవలల ఆధారంగా నిర్మించబడిన తాసిల్దారు గారి అమ్మాయి, ప్రేమనగర్ చిత్రాలు విజయవంతం అయ్యాయి సినిమాలకు మన మహిళలు కథలు రాయగలగటం — శుభ సూచకం ఇకపోతే — తీసిన చిత్రాలే మళ్లీ తియ్యటం, పాతపేర్లే తిరిగి పెట్టడం చూస్తే — మనం కొంత వెనక్కిపోతున్నామేమో అనిపిస్తోంది.

కొత్త సంవత్సరం కార్యక్రమం!

'కొత్త సంవత్సరంలో మీ కార్యక్రమం ఏమిటి?'

'నేను యీ సంవత్సరం మూడు చిత్రాల్లో నటిస్తున్నాను ఒకటి నా స్వీయ దర్శకత్వం వహించే చిత్రం రెండవది ప్రేమ్‌జీ నిర్మిస్తున్న హిందీ మట్టిలో మాణిక్యం మూడవది నటులు కృష్ణ ప్రభాకరరెడ్డిగార్లు సంయుక్తంగా నిర్మిస్తున్న 'పండంటి కాపురం' కృష్ణగారు ప్రభాకరరెడ్డిగారు వచ్చి నాకు కథచెప్పి — మీరు నటిస్తేనే యీ చిత్రం తీస్తామని చెప్పారు ఆ పాత్ర నాకు ఎంతగానో నచ్చింది నేను చేస్తున్నాను మంచి కేరక్టర్ అయితే ఎగిరి గంతేస్తాను. ఏ చిత్రంలో అయినా నటిస్తాను ఒక నిజమైన కళాకారిణికి అంతకన్న సంతోషం కలిగించేది ఏముంటుంది?' అన్నారు, నా చివరి ప్రశ్నకు సమాధానంగా — శ్రీమతి పద్మశ్రీ భానుమతీ రామకృష్ణ

— మోహన్‌కుమార్ ●



బ్రిటన్‌లోని రాయల్ అబ్జర్వేటరీకి డైరక్టర్ అయిన మొదటి మహిళ ప్రొఫెసర్ మార్గరెట్ బర్‌బిడ్జ్ ఈమె ప్రస్తుతం కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈమె తమ క్రొత్త పదవిని కొత్త సంవత్సరం ప్రారంభంలో స్వీకరిస్తారు. —(పి ఐ ఎస్)

ఒక వారం విపరీతం

ఫాలాక్షుడు

పాకిస్థాన్!

ఢాకాలో పాక్ సైన్యం, మన సైన్యానికి లొంగిపోయే ముందు ఎందుకైనా మంచిదని ఢాకాలోని మేధావుల నందర్నీ దొరికినమటుకు (280 మంది) నరికి చంపేశారట. వారు నరికి చంపిన వారిలో 9 మంది పత్రికా రచయితలు, కొంత మంది ప్రొఫెసర్లూ కూడా వున్నారట.

పాకిస్తాన్ సేనలు తూర్పు బెంగాలులోని మేధావులను మారణ హోమం చేసాయన్న విషయం తెలుసుకున్న ముక్తివాహిని మొన్న నలుగురు పాక్ సైనికులను వురి తీసిందట. కోపోద్రిక్తులైన ప్రజలు వారిని వీధుల వెంట వూరేగించి మరీ యీ ఘాతుకాన్ని చేస్తున్నారట. వారి వాత పడకుండా పాక్ సైన్యాన్ని (ఒప్పందం ప్రకారం) కాపాడడానికి భారతీయ సైనికులు నానాపాట్లూ పడుతున్నారట.

'ఇంజనీరు అవ్వాలని కలలు కన్నాను. కానీ బలవంతం వల్ల నేను పాక్ సైన్యంలో చేరవలసి వచ్చింది. తత్ఫలితంగా యిప్పుడు యుద్ధ ఖైదీగా వున్నాను. నా ఆశలన్నీ అడియాశలు అయిపోయాయి' అవటాని 17 ఏళ్ళ పాకిస్తాన్ విద్యార్థి ప్రస్తుత యుద్ధ ఖైదీ మసూద్ ఆలం విలపించాడట.

భరతరామికి చెందిన 60 ఏళ్ళ పెరియ అమ్మా యమ్మాళ్ తన యిద్దరి కొడుకులనూ దేశానికే అంకితం యిచ్చిందట. ఆమె పెద్ద కొడుకు రాజగోపాల్ 1962 చైనా యుద్ధంలో వీరమరణాన్ని పొందితే, రెండో కొడుకు సుందర రాజగోపాల్ యీ ఏడు పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందాడు. ఈ రెండు విషయాలు చెప్తూ, 'నాకు మూడో కొడుకు వుండివుంటే ఎంత ఆనందించుదును' అన్నదటా తల్లి.



రహదారి హత్య

అనంతపురం ఉండబండ గ్రామానికి చెందిన తోట వెంకటస్వామి అనే ఆయన గుత్తి వెళ్లే బస్సు ఎక్కబోతుండగా వో అయిదుగురు వ్యక్తులు ఆయన్ని ఆపి, నరికి చంపి వేశారట.

మాయమైన త్రిమూర్తులు

బెంగుళూరుకు చెందిన యస్. ఏ. నూర్ అనే ఆయన చేత కారుకొనిపిస్తామని వో ముగ్గురు పెద్దమనుష్యులు ఆయన్ని వుత్సాహపరచి రంగంలోకి దింపారట. దాంతో ఆయనో యాభై వేల రూపాయలు తీసుకుని వో కారులో వారితో బయలు దేరారట. ఆలోగా టెలిఫోను మ్రోగే సరికి 'జస్టెమినిట్' అని ఆ పెద్దమనుష్యులతో చెప్పి ఇంటి లోపలకు వెళ్లి ఫోనుపని చూసుకు వచ్చేసరికి అక్కడ కారూ లేదట, ఆ పెద్దమనుష్యులు లేరట. ఆయాభై వేలూ తీసుకున్నా త్రిమూర్తులు బహుశా అంతర్ధానమై పోయుంటారని పోలీసు అనుమానించి జరిపిన పరిశోధనలలో మద్రాసులో ఆ త్రిమూర్తులలో ఒకరైన పి. నారాయణ రావు అనే అతను పట్టు బడ్డాడట.

నగ్న నృత్య ప్రదర్శన— ముగ్గురమ్మాయిల అరెస్టు

రాబర్ట్సన్‌పేట కింగ్‌జార్జి మందిరంలో శాంతి, విజయ, మాల అనే ముగ్గురమ్మాయిలు నాట్యం పేర హాయిగా యిష్టారాజ్యంగా నగ్న నృత్యాలను ప్రేక్షకులకు టోకున కానుకలుగా సమర్పిస్తున్న సందర్భంలో పోలీసులు కలుగజేసుకుని ఆ ముగ్గుర్ని నిర్భంధంలోకి తీసుకున్నారట.

రోడ్డు ప్రమాదాలు

హోసూరు హనుమంతుని గుడి ప్రాంతంలో ఎల్లగాడు అనే 65 ఏళ్ళ వృద్ధుడూ, నారాయణ రెడ్డి అనే 20 ఏళ్ళకుర్రాడు రోడ్డు మీద నడుస్తుండగా కృష్ణ గిరికి పోయే బస్సు గతి తప్పి వీరిద్దర్నీ గుద్ది చంపిందట. మైసూరురోడ్డులో సిర్సి సర్కిలువద్ద వో క్లీనరు కుర్రాడు సరదాపడి లారీని నడిపి, వో గుర్రబ్బండిని గుద్దించి అంతతో ఆగక రోడ్డునపోయే తొమ్మండుగుర్ని గాయపరచి స్థిమిత పడ్డాడట. గుర్రం చనిపోయిందట.

ఇద్దరమ్మాయిల ఆత్మహత్య


నంది హిల్స్ చూడ్డానికి వెళ్ళిన వో యిద్దరు (22 ఏళ్ళ— 20 ఏళ్ల) అమ్మాయిలు చటుక్కున అక్కడి కొండమీదించి దూకి ఆత్మహత్య చేసుకున్నారట. పోలీసులు వారి శవాలకోసం వెతుకు తున్నారట. అమీ,గాదటే కదా కథంతా తెలిసేది— కదిలేది.

కడుపునెప్పి భరించలేక ఆత్మహత్య

బెంగళూరు స్టేట్‌బ్యాంకు ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్న అహమ్మద్‌ఖాన్ అనే యువకుడు తన కడుపునొప్పి భరించలేక, నల్లులమందు త్రాగి జీవితాన్ని అంతం చేసుకున్నాడట. ఈతని శవం కబ్బన్ పార్కులో దొరికిందట.

4 పౌన్ల గొలుసుని మింగినదొంగ!

క్రిష్ణగిరికి చెందిన రామచంద్రశెట్టియారు కూతురు 22 ఏళ్ళ సులోచన నీళ్ళ భావి నుంచి నీళ్ళు తెస్తుండగా జయచంద్రన్ అనే వో యువకుడు ఆమెకు ఎదురువెళ్ళి, టక్కున ఆమె మెడలోని జెర్రిపోతంత (4 పౌనులు) బంగారం గొలుసు లాగేసుకున్నాడట. వెంటనే సులోచన పెద్దపెట్టున కేకలు వేసేసరికి ఆతడా గొలుసును గుటుక్కున మింగేసి, గుట్టు వప్పుడుకాకుండా సులోచన కేకలు విని వచ్చిన వారికి పట్టుబడిపోయాడట. నగ ఆతని వద్ద లేకపోయేసరికి వారు అతన్ని ఆసుపత్రికి తీసుకువెళ్ళి ఎక్సరే తీయించారట. జెర్రిపోతంత గొలుసూ ఆతని పొట్టలో చూసి, ఆనక వా రాతన్ని పోలీసులకు వప్పచెపితే వారు జయచంద్రన్‌కి విరేచనాల మందిచ్చి గొలుసు రాబట్టారట— హత్తెరీ .. పోలీసు వారెంతకయినా తగుదురమ్మా!!



[illegible] ... ంగటు

కొన్ని నెలలుగా ఢిల్లీ నగరంలో కారులో వీర విహారం చేస్తూ, ఇష్టారాజ్యంగా ఘరానా దొంగతనాలు చేస్తున్న ఐదుగురు గ్యాంగులో మొన్న వో ముగ్గుర్ని పోలీసు పట్టుకున్నారట. వో రైల్వే వుద్యోగి కూతుర్ని ఎత్తుకుపోయే ప్రయత్నంలో ఆ ముగ్గురూ వుండగా పోలీసు పట్టుకున్నదట.

తీగె తాకితే...!

తన తోటలో చీకటి పడింది మొదలు తెల్లారే వరకూ దొంగలు స్వైర విహారం చేస్తున్నారని విసుగు చెందిన అధికారపట్టి గ్రామ వాస్తవ్యుడు ఆర్ముగంచెట్టియారు తన తోటకు చుట్టూవున్న తీగ కంచెకు కరెంటు తగిలించాడట్ రాత్రి. ఈ విషయం తెలీక వో అయిదుగురు దొంగతనానికి వచ్చారట. వారిలో లక్ష్మణ గవుండర్ అనే అతను



ముందస్తుగా ఆ తీగ పట్టుకునేవరికి షాకు తగిలి కెవ్వున కేకవేసి చనిపోయాడట మిగతావారు పారిపోయారట. ఆర్ముగం చెట్టియారు తాపీగా వచ్చి ఆ లక్ష్మణ గవుండరు శవాన్ని వో గోనెలో మూటకట్టి, దగ్గరలో వున్న ఏరులో పారేశాడు శవం మూట తేలి, పోలీసులకు చిక్కి, డొంకంతా కదిలి, ఆర్ముగంశెట్టియారు అరెస్టు అయ్యాడట

అలస పల్లికి చెందిన శక్కారలప్ప అనే అతనికి మూణ్నెల్ల క్రితం వివాహమయ్యిందట 12వ తేదీ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన శక్కారలప్ప తలుపు ఎంతసేపు బాదినా లోపల్నించి సమాధానం లేకపోయేసరికి విసుగెత్తి యింటి కప్పెక్కి పెంకులు పత్తిగిల్చించి చూశాడట. లోపల అతని భార్య

[illegible] ప్రతాడు తొంటాడు. [illegible] యను టెలిఫోనులు వున్నాయట. ఈ లెక్కలు 1970 నాటికి తేలినవట. ●

* * *

కె. [illegible]

దేవుడు వున్నాడని మీకు నమ్మకం ఉందా ?

ఏమిటి? లేదని మీకు కచ్చితంగా తెలుసా?!

జి. డి. ఆర్, కాకినాడ

విరసంలో ముసలం పుట్టింది తెలుసా?

మీ కిప్పుడా తెలిసిందీ?! ఆ అతిసరసం విరసం కోసమేనని నా కప్పుడే తెలిసింది స్వామీ!

ఇ. వి. ఆర్, ప్రాతకోట

మీ వ్యక్తిత్వం మీద మీకంత నమ్మకం ముందేమండి? ఆరుద్ర చేయూత లేకపోతే మీకింత పేరు ప్రఖ్యాతులు వచ్చేవా?

ఇంతకంటే పేరు ఖ్యాతి ఉన్నప్పుడే కదుటండీ వెన్ను ఆరుద్ర చేయూత!

ప్రశ్నోత్తరాలు

...కె. రామలక్ష్మి...

పి. ఎస్. ఆర్, కాకినాడ

ఈ రోజుల్లో పెళ్ళి చూపులకు వెళితే పిల్ల ముఖ్యమా ? డబ్బు ముఖ్యమా ? చదువు ముఖ్యమా ?

కొంచెం రోజులు వోపికపట్టు, చిట్టితండ్రీ. అమ్మాయిలే మిమ్మల్ని చూడవచ్చి యీ సంగతులు తేల్చుకుంటారు!

ఎన్. [illegible]ర్. ఆర్, బరంపురం

మీకు కోపం ఎప్పుడు వస్తుంది ?

అసలు సంగతి తెలుసుకోకుండా తోచినవన్నీ అనే వాళ్లను చూస్తే— అప్పుడు వస్తుంది కోపం— తపీమని ఒకటో అరో నిజం చెప్పి— నోరుమూయిస్తాను!

ఎమ్, ఢిల్లీ

మరీ అంత మినీ జవాబులిస్తే ఎలాగండి?...చక్కగా పెద్ద పెద్ద వ్యాసాలు రాయండి...

కొన్ని ప్రశ్నలకి— నా దృష్టిలో చాలా ప్రశ్నలకి మినీ జవాబులు చాలు. ఇక పెద్ద పెద్ద వ్యాసాలంటారా? పెద్ద వ్యాసం అయితేనేగాని చెప్పాలిన్నది చెప్పలేరా?! పది పేజీల్లో చెప్పేది నా పేజీలో సులభంగా చెప్పవచ్చునండి

జి. ఎమ్. కె, పిఠాపురం

కొత్త వస్తువులంటే ఎందుకండీ అంత మోజు అందరికీ ?

కొత్త వస్తువులు ఎవరేనా కొనవచ్చు కాని పాతవి పారేయడం ఎంతో కష్టం. అది తెలియక ఆమోజు!

ఎమ్. వి. ఆర్, సూళ్లూరుపేట

మీ పత్రికను పొగుడుతూ రాసిన వాటికే సమాధానం యిస్తారని వినికిడి ..

పొరపాటున మా చిరునామాకి పంపారండీ యీ ఉత్తరాన్ని అలాంటి పత్రికలు వేరే ఉన్నాయి—

పి. ఆర్. ఎస్, కంభం

ఈ కాలపు ఆడపిల్లలపై మీ అభిప్రాయం ఏమిటి ?

[illegible]

విషయానికీ బెదిరిపోతూ అబల్లాగా తయారవుతున్నారు. అదే నా బెంగ.

కె. ఎస్. పి, గుంటకల్

విద్యార్థులకు మీరిచ్చే సలహా ఏమిటి ?

చదువుకునే రోజుల్లో— చదువుకోమని!

యస్. ఎన్. ఎల్, విజయవాడ

మీరు ఎంతవరకు చదువుకున్నారు ?

మీరు చదువుని దేంతో కొలుస్తారో చెప్తే— చెప్పాలనుకున్నాను!

పి. పి. డి, తిరుపతి

పిల్లలపట్ల ఎలా జాగ్రత్త పడాలి రామలక్ష్మిగారూ ?

కొంపలో విన్నవి పిల్లలు నడిరోడ్డుమీద వల్లె వేస్తారన్న సంగతి గుర్తుంచుకోండి—చాలు!

వి. ఎన్. [illegible]ర్, గుంటకల్

ఆడదానికి దేవుడిచ్చిన వరం కన్నీరు. మరి మగవారికి దేవుడిచ్చిన ఒకేఒక వరం ఏమిటి ?

ఆ కన్నీరు తుడిచే భాగ్యం!

ఎస్. కె. వి, కాజీపేట

నాకు తెలియక అడుగుతాను. మనిషికి మనస్సుకి తేడా ఏమిటి ?

తెలిసే అడిగి ఉంటారు— మనిషికి శరీరం ఉంది. మనస్సుకి లేదు! మీరేమనుకున్నారే మరి.

ఆర్. ఎస్. పి. సునాబేడ

'నవిద్య బుధ సోమయు' ఎంతవరకు నిజం ?

'కుర్వీత బుధసోమయోత్' అనే విన్నాను గాని యీ నవిద్య వినలేదుసార్. క్షమించాలి.

సి. హెచ్. డి. ఎల్, సూరంపల్లి

మీరు ఏదైనా కొత్తపని చేయాలంటే మీ ఆయనగారు సమ్మతించక పోతే ఏమిటి చేస్తారు ?

చేయడానికి ముందు చెప్పను.

భర్తలు దుర్ వ్యసనాలకు పాల్పడ్డప్పుడు భార్యలు ఏమిచేయమంటారు

ఆ దుర్వ్యసనాలన్నవి యింటిలో తన వాటాదులో లభ్యం అయ్యేలా చెయ్యండి— కనీసం యింటిపట్టునైనా ఉంటారు పోషించు కంటే యిది మంచి మందు.

బి. ఎన్. ఎమ్, తుని

పత్రికల్లో మీ పేరేగాని ఫోటో వెయ్యరెందువలన ?

పెరుగుతున్న జ్ఞానదు ఫిగరుకు లేక పోవడం వల్ల!



పురుషుడు—
మహోన్నతము,
సమ్మోహనము.
శక్తిశాలి అయినా
చలనశీలి.
పురుషుల
హావభావాలే
'ఎస్టర్‌కాట్'కు
ప్రేరేపకాలు!

ఎస్టర్‌కాట్®

'ఎస్టర్‌కాట్' ధరించిన పురుషుడు ఒక మహారాజు.
'ఎస్టర్‌కాట్' పాలిఎస్టరు కలిపిన కాటన్ సూటింగులు.
ఝంకా, గిలిగింతలు పెట్టే రకాలలో, ముదురు రంగులలో, ముచ్చటైన ప్రింట్లలో 'మెఫ్రిన్' 100% పాలిఎస్టరు చీరలు మరియు పాలిఎస్టరు కలిపిన కాటన్ చీరలు;
'మెఫ్రిన్' పాలిఎస్టరు కలిపిన డ్రెస్ మెటీరియల్సు—తేలికైన లాన్సు, వేసవి కాంబ్రిక్సు మరియు సొగసైన మనోహరమైన పాప్లిన్సు;
ఆధునికమైన, అద్భుతమైన రంగులలో మరియు ప్రింట్లలో 'టెరాసెల్' పాలిఎస్టరు కలిపిన కాటన్ షర్టింగులు.

మఫత్‌లాల్ గ్రూప్

రెడీమేడ్ షర్టులు
కొనేటప్పుడు మఫత్‌లాల్
దుస్తుల నాణ్యతకు
చిహ్నమైన
'...'
చూడండి!

FAIYARS-MM72 TE

దేశం కోసం....

—జమున



'నా దేశం కోసం నేనేం చెయ్య గలను?' యుద్ధం జరుగుతుందని తెలిసిన రోజు నాలో ఉదయించిన ప్రశ్న ఇది. ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. ఏవేవో విచిత్రమైన ఆలోచనలు! భారత పాకిస్తాన్‌ల మధ్య పోరాటం. యుద్ధరంగంలో మన భారత వీరులు ఎంతోమంది వీరస్వర్గం అలంకరించినట్లు, మరి కొంతమంది దెబ్బలతో బాధపడుతున్నట్లు కనిపించసాగారు. ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. మన రక్షణ కోసం వారంతా ప్రాణాలకు తెగించి పోరాడుతూంటే మనం మన ఇళ్ళలో నిశ్చింతగా పడుకుని నిద్ర పోవడమా? ఏదో బాధ! ఏదో తెలియని ఆవేశం సన్నాహించి నాకు తెలియకుండానే కళ్ళనీళ్ళు తెప్పించాయి. అయితే భారత వనితగా నా దేశం కోసం నేనెంతవరకు సహాయపడ గలను?

హాయిగా డాక్టరు చదువుకొని ఉంటే మన వీర సోదరులకు నేనెంత సేవచేసి ఉండేదాన్నో? పోనీ కనీసం నర్సు ట్రెయినింగు అయినా అయి ఉంటే ఎంత బాగుండేది? అనిపించింది. వెంటనే గబగబా యుద్ధరంగానికి వెళ్ళి తుపాకీ చేతపట్టి కనీసం ఒక పదిమంది పాక్ సైనికుల్ని తుదముట్టించి వీర స్వర్గమలంకరిస్తే!

అమ్మో! నా బిడ్డ! నా భర్త! ఏమిటీ వెర్రి ఆలోచన? ఈ రోజు దేశరక్షణ కోసం పోరాడుతున్న మన సైనిక వీరులందరూ కూడా ఇలా అనుకుని ఉంటే ఈనాడు మనమింత నిశ్చింతగా నిద్రపోయి ఉండేవారమా? మనిషికి ఎంత స్వార్థం?

వెనువెంటనే దేశంకోసం నిస్వార్థమైన త్యాగం చేసి మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన పూజ్య బాపూజీ, పండిత జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూరు శాస్త్రి—అనేకమంది గుర్తుకు వచ్చారు. కలత నిద్రతో తెల్లవారింది.

రేడియోలో ప్రముఖుల ప్రసంగాలు, శ్రీమతి ఇందిరాగాంధి యొక్క పలుకులూ వింటే ప్రతివారికీ ముఖ్యంగా స్త్రీలకు ఎంతో ఉత్సాహం ఆవేశం పుట్టుకు వస్తాయి. భారత దేశం గర్వించదగ్గ స్త్రీమూర్తి ఆమె. చరిత్రలో ప్రసిద్ధి కెక్కిన ఝాన్సీ రాణి, రుద్రమాంబ మొదలైన స్త్రీలను గురించి చదవడమే కాని ఇంకా అలాంటి స్త్రీలు ఉన్నారా అని పిస్తున్న ఈరోజుల్లో ఆ అంశలతో కూడిన ఇందిగాంధిని చూచి స్త్రీలమైన మన మందరం ఎంతో గర్వించాలి! స్త్రీ జాతికే గర్వకారణమైన ఇందిరాగాంధిని ఆ భగవంతుడు ఇంకా దేశరక్షణకు తగిన అద్భుతశక్తు లిచ్చి ఆమెను కాపాడమని తోటి స్త్రీగా ప్రార్థిస్తున్నాను.

కళాకారిణిగా నేనేం చెయ్యాలి? అని ఆలోచించి — మేమెంతో ఆర్భాటంగా చెయ్యాలనుకున్న మా గృహప్రవేశం నిరాడంబరంగా చేసి ఆ ధనాన్ని రక్షణ నిధికి విరాళంగా సమర్పించుకున్నాను!

ప్రతి భారత స్త్రీ కూడ వారి శక్త్యనుసారం రక్షణ నిధికి తోడ్పడా లని ప్రార్థిస్తున్నాను. ఒక స్త్రీకి ఒక చీర కొనుక్కోవాలనిపించిందనుకోండి. అది కొనబోయే ముందు ఒక్కసారి మనదేశ పరిస్థితి మనకోసం ప్రాణా లర్పిస్తున్న వీరజవానులను తలచుకుంటే ఆ చీర కొనాలనిపించదు. అదే విధంగా సంసారంలో కొన్ని అదనపు ఖర్చులు తగ్గించి, పొదుపుచేసి ఆ డబ్బు రక్షణ నిధికి ఇస్తే బాగుంటుంది.

ప్రస్తుతం యుద్ధం ముగిసింది. మనం విజయాన్ని సాధించాం. కాని, ఈ విజయానికి కారణభూతులైన వీర జవాన్ల కుటుంబాలకు మనం కృతజ్ఞత తెలుపుకోవాలి! ఏ విధంగా అంటే—ముఖ్యమయింది ఆర్థిక సహాయమే కనుక, ఎవరికివారు ఉన్నగలిగినంతమేరకు, రక్షణనిధికి విరాళాలు యిచ్చి, వారి కుటుంబాలకి సహాయపడడం ఎంతైనా అవసరం!



ఆషాఢమాసం

ప్రియమైన శ్రీవారికి—

నేను క్షేమంగా మా యింటికి చేరాను. వెంటనే వుత్తరం వ్రాయాలనుకున్నాను గాని—వీలు చిక్కిందికాదు. వారం రోజులకి వుత్తరం వ్రాస్తున్నానని కోపం తెచ్చుకోవద్దు. నా కిక్కడ ఆనందంగా రోజులు గడచిపోతున్నాయి, నా చిన్నప్పటి స్నేహితులంతా నన్ను విడచిపెట్టకుండా కబుర్లతో కాలాన్ని కరగించేస్తున్నారు. మొన్న మా ఫ్రెండ్సుతో కలసి సినిమాకి వెళ్లాను యిప్పుడు వస్తున్న ఆదివారంనాడు పిక్నిక్ ప్రోగ్రాం వేసారు మా ఫ్రెండ్సంతా. అంతా బాగానే వుంది కాని మా అమ్మతో బాధపడటం తప్పటంలేదు. నేను చిక్కిపోయానట. ఈ మాటను ప్రతిరోజూ అంటుంది. అలా అనేసి వూరుకున్నా బాగుణ్ను. రకరకాల పిండివంటలుచేసి తినమని — పీకమొయ్యదాకా కుక్కుతుంది. వద్దన్నా వినిపించుకోదు. అటువంటి సమయంలో మీరు నా స్థానంలో వుంటే ఎంతో బాగుండేదనిపిస్తుంది నాకు భోజన ప్రియులు కాబట్టి మీకు రోజూ—చక్కని విందు భోజనం దొరికేది. యిలా వ్రాస్తున్నందులకు కోపం వచ్చిందా ? కొద్ది రోజులు వోపిక పట్టి కూర్చుంటే—ఆ తరువాత నేను వచ్చి మీ కోపం చిటికెలో పోగొడతాను. బైదిబై నా కొక్కటే దిగులుగా వుంది. పాపం ! మీరు ఎలా వండుకుని తింటున్నారో అని. హోటల్ మీల్స్ మీకు పడదు. ఆ నెల్లాళ్లు కాస్తంత మీరు కష్టపడాలి. ఏం చేస్తాం మరి ? వంటింటి అలమారులో కందిపొడుం డబ్బా వుంది. అది అన్నంలో కలుపుకుని తినండి. మన ఆవకాయ జాడీని నేను వచ్చేలోపల ఖాళీచేసే బాధ్యత మీది. అది మీ కోసమని నేను ప్రత్యేకంగా తయారుచేసి వుంచాను.

'ఏమండోయ్ శ్రీవారు! నేను యింట్లో లేను కదా అని మీ మిత్రులందరిని పిల్చుకొచ్చి మనింటిని పేకాట కేంద్రంగా మార్చకండి. వాళ్ళు యిల్లంతా సిగరెట్టుపీకల్తో నానా అసహ్యంగా మారుస్తారు.

నేను అక్కడకు వచ్చేవరకూ మనింటిని తుడవడానికి మన పనిపిల్ల అమ్మను రమ్మనమని చెప్పాను. అది వస్తుందా ? లేక పనిపిల్లే వస్తుందా ? ? సాయంత్రం ఆఫీసు వదలగానే మీరు తిన్నగా యింటికే వచ్చేయండి. క్లబ్బుకు వెళ్ళవద్దు. యిక్కడ నేను చాలా ఆనందంగానే వున్నాను—కాబట్టి నా గురించి మీరేమీ గాభరా చెందకండి. యిల్లు జాగ్రత్త. వెంటనే వుత్తరం వ్రాయడాన్ని మరచిపోకండి. యిక వుంటాను.

ఇట్లు

మీ ప్రియమైన భార్య

లలిత.

ఆషాఢమాసం

ప్రియమైన లలితకి—

నువ్వు వ్రాసిన వుత్తరం అందినది. పుట్టింటికి వెళ్ళిన వారం రోజులగ్గాని నాకు వుత్తరం వ్రాయడానికి తీరిక చిక్కలేదా? మీ ఆడవాళ్ళంతా యింతే. పుట్టింటికి వెళ్తే మొగుడి మాట మరచిపోతారు. ఈ మాటను నువ్వు అక్షరాలా రుజువుచేశావు. అక్కడ నువ్వు పిండివంటలతో భోజనం చేస్తుంటే—యిక్కడ నేను హోటల్ మెతుకుల్ని తింటూ రోజూ ఛస్తున్నాను! నువ్వు వూరుకెళ్ళిన మర్నాడు వంట చేద్దాం కదా అని బియ్యం ఎసరు పెట్టాను. అన్నం వండి వార్చేసరికల్లా అది పేస్టులాగ తయారయింది. నాకు వంట చేతకాదు. కనుక అస్మదీయ క్షుధార్తిని నివారించుటకుగాను —మా ఆవిడను ఆశ్రయించక తప్పలేదు. [హతోస్మి! ముక్కుపుటాలు ఎగరవెయ్యకు. మా ఆవిడనగా యిక్కడ హోటలు అయ్యరు అని అర్థం. తెల్సిందా? శాంతించు.]

నా కిక్కడ యింట్లో ఏం వూసు పోవడంలేదు. రాత్రుళ్ళు అసలే నిద్ర పట్టడంలేదు. మాటి మాటికి నువ్వే గుర్తొస్తున్నావు నీకు అక్కడ హాయిగా వున్నా నాకిక్కడ బోర్ కొడ్తుంది. క్లబ్బుకి వెళ్ళవద్దన్నావు గాని—యింట్లో ఏం తోచక క్లబ్బుకు వెళ్తున్నాను. నువ్వు వెంటనే వచ్చేయి. ఆషాఢం లేదు—గీషాడం లేదు. అవన్నీ ముసలివాళ్ళకి వదిలేయి. నీ రాక కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. వెంటనే వచ్చేస్తావు కదూ!

నీ రాకకోసం ఎదురు చూస్తూ
'రాఘవేంద్ర.'

* * *

ప్రియమైన శ్రీవారికి—

మీ వుత్తరం అంది రెండువారాలయింది. యిదివరకటి కారణాలవల్లనే ఈసారి కూడా వుత్తరం వ్రాయడంలో కొంత ఆలస్యం జరిగింది. ఏమనుకోవద్దు. ఈ రోజుతో ఆషాఢం ముగుస్తుంది. కాని యింకో వారం రోజులు యిక్కడే వుండమని అమ్మ బలవంతం చేస్తుంది. కాబట్టి యిక్కడ వుండక తప్పడంలేదు. పాపం! మీరు హోటల్ భోజనం పడక ఎంత బాధ పడుతున్నారో.

యింకో విషయం. రేపు మా వదిన పుట్టింటినుండి యిక్కడికి వస్తారట. మా వదినకి నేనంటే ఎంతో ప్రేమ. నన్ను చూడగానే యింకో పదిరోజులపాటు యిక్కడి నుండి కదలనేయ్యదు. నేను రావడంలో యింత ఆలస్యం జరుగుతున్నందులకు మీరు కోపం తెచ్చుకోవద్దు మీ ఆరోగ్యం జాగ్రత్త! హోటల్ భోజనంకు బదులు మరొకసారి వంట ప్రయత్నం చేసి చూడండి. వీలయినంత త్వరలో రావడానికి ప్రయత్నిస్తాను.

ఇట్లు
మీ ప్రియమైన భార్య
'లలిత.'

* * *

ప్రియమైన శ్రీమతికి,

నేను క్షేమంగానే యున్నాను. నీ వుత్తరం చూడగానే నాకు బోల్డంత కోపం వచ్చింది. చదివింతరువాత మరింత కోపం ఎక్కువయింది. నా భోజనం గురించి నువ్వేమీ బెంగపెట్టుకో నక్కర్లేదులే. నేనిప్పుడు హోటల్‌లో భోజనం మానేసాను. నాకు హోటల్‌మీల్సు పడదన్న సంగతిని ఎలా తెల్సుకుందో ఏమిటో మన పక్కింటి లేడీ టైపిస్టు నువ్వు వచ్చేవరకూ తనింట్లో భోజనం చెయ్యమని ఎంతో బతిమిలాడి నన్ను వొప్పించింది. ఆవిడ వంట బాగానే వుంది. కనుక నువ్వు నా భోజనం విషయంలో ఏమాత్రం ఆందోళన చెందనవసరంలేదు. మీ వదిన ఈపాటికి వచ్చేయవచ్చును. నీ యిష్టం వచ్చినన్ని రోజులు మీ వూర్లో వుండు. నాకిక్కడ ఏం ఫర్వాలేదు నాకు కూడా హాయిగా వుంది. తాపీగానే రా. వుత్తరాలు మాత్రం మరచిపోకుండా వ్రాయి.

ఇట్లు,
'రాఘవేంద్ర'

భర్త వ్రాసిన వుత్తరాన్ని చదవగానే—చిటపటలాడుతూ తన బట్టల నన్నింటిని లలిత సూటుకేసులో సర్దసాగింది. ఇంకో పదిరోజులపాటు వుంటుందనుకున్న లలిత యిలా అకస్మాత్తుగా ప్రయాణ సన్నాహం గావించడం చూసి విస్తుపోయింది లలిత వదిన.

బట్టలు సర్దుకున్న తరువాత లలిత రామారావు దగ్గరకువెళ్ళి 'అన్నయ్యా! నేను సాయంత్రం మెయిలుకి బయల్దేరుతున్నట్లుగా మా వారికి టెలిగ్రాం యివ్వరా!' అంది. చెల్లెలు ముఖంలోకి విచిత్రంగా చూసాడు రామారావు. ●




విరహ తాపాన్ని తెచ్చింది దుర్వాసన!
COLGATE DENTAL CREAM
కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో నోటి దుర్వాసనను ఆపండి... రోజంతా దంతక్షయాన్ని నివారించండి!
కాల్గేట్ 10 మందిలో 7 గురికి వెంటనే నోటి దుర్వాసనను నివారించినదని, భోజనము అయిన వెంటనే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొంటే ఎక్కువ దంత క్షయమును, ఎక్కువ మందికి అరికట్టినదని దంతశాస్త్ర చరిత్రలో పూర్వము ఎప్పుడూ ప్రకటింపబడనట్లు శాస్త్ర పరీక్షలు నిరూపించేయి ఎందుకంటే: కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో ఒకసారి పళ్ళు తోముకొంటేనే 85% వరకు నోటి దుర్వాసన మరియు దంతక్షయమును కలిగించే సూక్ష్మ క్రిములు పోతాయి ఎంత చక్కని పెప్పర్‌మెంట్ రుచి కూడ ఉంది—కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో రోజూ పళ్ళు తోముకొనుటకు పిల్లలు యిష్టపడతారు!
పూర్తి దంత రక్షణకు
కాల్గేట్ టూత్ బ్రష్
వాడండి
15 రకములలో-ప్రతివారికి అనువైనది లభించును.
శుభ్రమైన, తాజా శ్వాసకు మరియు తెల్లగా మెరిసే పళ్లకు...
ఎక్కువ మంది జనులు ప్రపంచములో ఏ యితర టూత్‌పేస్ట్‌కంటే కాల్గేట్‌నే కొంటారు!

నీశత్రువు నీవే సుమా!

కె. రామలక్ష్మి



నా చిన్నతనంలో మా తాతయ్య అంటూండేవాడు 'తోడ బుట్టిన వాళ్ళంటే వేరే శత్రువులక్కరలే'దని. సర్వత్రా నిజమవునో కాదో గాని, చాలా మటుకు — నిజమే అనిపిస్తుంది. మనకి శత్రువులం మనమేనని. మనకై మనం కొని తెచ్చుకొనే హాని ఎవరూ మనకి తలపెట్టరనీ అనిపిస్తుంది. అనుమానమైతే — తీరికగా కూర్చుని గతైదారు వారాల మీదైనందిన జీవిత క్రమం నెమరు వేసుకు చూడండి! గుండె మీద చేయివేసుకుని 'నేనెవరి మనస్సు నొప్పించే మాట అనలేదు. చేత చేయలేదు' అని చెప్పకలరా? ... ఎవరితోనైనా ఏదేదో మాట్లాడేస్తూ — మన మాట మధ్యలోనే వారి ముఖ కవళికలు మారడం గమనించారా? కళ్ళు చిట్లించి, పెదవులు బిగించి బిగుసుకు పోతారెందుకని ఊహించారా? లేక అది ఎదుటివారి తత్వం అనుకున్నారా? ఆ తీరు చూస్తేనే గ్రహించి ఉండాలి. మనమాటలు విపరీతంగా తోస్తున్నాయి ఎదుటి వారికి అని. నేనుమటుకు ఒప్పేసుకుంటాను సుమండీ. ఒచ్చిన చిక్కేమిటంటే 'అహా! ఏం అనుకోకండి, పొరపాటై పోయింది, క్షమించండి' అంటూ క్షమార్పణలు కురిపించిన కొద్దీ—ఎదుటివారు మరీ బిగుసుకుపోయి, మనం చేసిన నేరం వికృతంగా పెంచేస్తారు !


అందరితో స్నేహంగా సరదాగా మాట్లాడుతూ, ఎవరి మనస్సూ నొప్పించకుండా ఉండకల్గడం కష్టమే. ఒకొక్కప్పుడు మనం ఏమన్నా బదులుండదు మహా ఉంటే అహా అనో ఒహో అనో తలూపుతూనో సమాధానం ఉంటుంది. మనం చెప్తున్న విషయంతో ఏకీభవిస్తున్నారో లేదో కూడా అర్థమై చావదు. కాని కొంతకాలానికి ఏ మూడో మనిషి ద్వారానో మనం వారినెంత అవమానించినదీ వినడం సంభవిస్తుంది. 'ఏం మాట్లాడాం చెప్మా ఆవిడగారంత యుద్దై పోవడానికి' అని మనం బుర్రలు బద్దలు కొట్టుకోవాలి. అయినా, ఏమాత్రం సూచనైనా కల్గించని ఆ వ్యక్తి బహుశా మరిచిపోవడానికి కూడా ఒప్పుకోనిరకం అయివుంటుం దనిపించుతుంది. అందుకే నేను అంటాను — మాట్లాడేముందే కొంచెం ఆలోచించాలని. అప్పుడిలాంటి గొడవలు రావు. మనం మాట్లాడేది ఎదుటివారెలా అర్థం చేసుకుంటారో అని ఆలోచించుతే మాటలో తొందరపాటు ఉండదు. అనవసరంగా అపార్థాలు చేసుకోడాలు, అర్థంలేకుండా శత్రువులని తయారు చేసుకోడాలు ఉండవు నిజమైన సానుభూతి స్నేహభావం ఎదుటివారిపై ఉంటే. అంతేకాదు మననికూడా రాంగ్‌గా అంచనా వేయడం జరుగదు.

'ఇంత జాగ్రత్తగా ఉండడం ఎలాగ బాబూ, నోరిప్పితే తప్పయితే ఎలా?' అంటుంది నా స్నేహితురాలు. 'నేనేదైనా కొత్తపని తలపెడితే సవాలక్ష సలహాలిస్తారే యింట్లోవాళ్ళే. మనం మనకి తోచింది అంటే తప్పా?' అంటుంది 'వాళ్ళేదో తీరికూచుని సలహాలిచ్చారనుకోవడం దేనికి? నీ సౌకర్యం దృష్టిలో పెట్టుకునే అలా చెప్పారేమో అనుకుంటే పోయేదానికి పెద్ద రాద్ధాంతం దేనికి? అయినా సలహా యిచ్చినంత మాత్రాన నాకేం తెలియదని ఎదుటివాళ్ళు అంచనా వేస్తున్నారనుకోవడం—నిన్ను నువ్వే కించపరుచుకోవడం కాదా! ఏదో విమర్శిస్తున్నారనుకుని, వేళాకోళం చేస్తున్నారనుకుని బాధపడిపోయి విరుచుకుపడ్డం హాస్యాస్పదంగా తోచదా? లేక చెప్పారు కనుక అసలే వినకూడదనుకోవడం సిల్లీ కాదా!

ముఖపరిచయం లేనివాళ్ళు ఏదేదో అంటే—దానితో నేను ఏకీభవించక పోవచ్చు. పరిచయస్తులు ఏదో అంటే నేను ఏకీభవించక పోవచ్చు. వారి మాటలు నన్ను యిరకాటాన పెట్టవచ్చు. బాధా పెట్టవచ్చు. కాని వో క్షణంలో విరుచుకుపడి ఏం ప్రయోజనం అని ఆలోచిస్తాను. ఆ తరవాత అనుకుంటాను—వీరికీ నాలాగే—పిరికితనం కబోలు' అని. అంతేకదా మరి. పిరికివారే కొత్తగా ఫీలయి అతిగా సదుద్దేశ్యం కల్గిద్దామనుకుని అఫెండ్ చేస్తారు! పిల్లలు చూడండి — మన మెప్పుకోసం అల్లరిచేసి తిట్లు తింటారు !!

మానసిక దారుఢ్యం లేకపోవడంతో నీశత్రువు నీవే అయి— కాంప్లెక్సు—తక్కువతనం—నిన్ను పట్టి పీడిస్తాయి. నీకంటె అందమైనవాళ్ళు, తెలివైనవాళ్ళు చదువుకున్నవాళ్ళు ఉండచ్చు. వారి జీవితాల్లో పైకిరాని తెలియని ఏ బాధో,

ఫీలోటో—వారి ఆలోచనలకి రంగుటద్దాలు వేస్తుంది అంచేత వారు లోకాన్ని నిన్ను కూడా ఉన్నది ఉన్నట్లు చూడలేక పోవచ్చు. అందుకే అతిజాగ్రత్తకుపోయి శత్రువులని కొనితెచ్చుకుంటారు అతితెలివి ప్రదర్శించి చేతకానివాళ్ళనిపించుకుంటారు తమ బలహీనతలని కప్పిపుచ్చుకుందుకు తమకి తామే శత్రువులవుతారు. తప్పదు. అందుకే ఎవరేనా నన్నోమాట అన్నా— బెనిఫిట్ ఆఫ్ డౌట్ యిస్తాను. దానివల్ల లాభం — అన్నవాడికీ ఒకభాగ్యుంటుంది. నాకూ ఉంటుంది. ఏమంటారు ? ●



వివిధ ప్రాంతాలలో సంక్రాంతి పండుగలు

ప్రతి సంవత్సరం జనవరి 13, 14 తేదీలలో వచ్చే సంక్రాంతినే మనం పండగగా చేసుకొంటున్నాం. అసలైతే సంవత్సరానికి పన్నెండు సంక్రాంతులు వస్తాయి. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం సూర్యుడు ప్రతి మాసం క్రమంగా మేష వృషభాది పన్నెండు నక్షత్ర రాశులలో ప్రవేశిస్తాడు.

'తత్ర మేషాదిషు ద్వాదశరాశిషు క్రమేణ సంచరితః
సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరరాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః'

(సూర్యుడు ఒక రాశినుండి మరో రాశి లోనికి ప్రవేశించడమే సంక్రాంతి)

—కనుక సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినపుడు మకర సంక్రాంతి అవుతుంది.

ప్రతి పండగనూ జరుపుకునే విధానం దేశ కాలమాన పరిసర పరిస్థితులనుబట్టి, వారి వారి నమ్మకాలనుబట్టి వేరు వేరుగా ఉంటుంది. ఇలా ఆచరణలో వైవిధ్యమున్నా సూత్రం మాత్రం పూసలలోపు దారానికివలె ఒకటే తమిళులు 'పొంగల్' అన్నా మాళవదేశీయులు 'తిల్ సంక్రాంతి' అన్నా తెలంగాణా ప్రాంతంవాళ్లు 'పెద్ద పండుగ' అన్నా, ఆంధ్రులు 'సంక్రాంతి' అన్నా అసలు పండగకి మాత్రం మూల సూత్రం సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడమే. పండిన పంటలన్నీ ఇంటికిచేరి, రైతు ఇల్లూ, పొలమూ, గ్రామమూ అన్నీ కళ కళలాడుతూ లక్ష్మీ నిలయంగా మారుతాయి గనుక అన్ని ప్రాంతాలలోనూ మకర సంక్రాంతిని అనేక రకాల వేడుకలతో జరుపుకోవడం ఆచారమైపోయింది.

వివిధ ప్రదేశాలలో సంక్రాంతి పండుగను జరుపుకునే విధానాలు ఆసక్తికరంగా ఉంటాయి.

మన తెనుగునాట ధనుర్మాస ప్రారంభం నుండే అంటే ఇంకా సంక్రాంతి పండగ నెలరోజులుండనగానే తెనుగు పడతులు గొబ్బిళ్ళు అనే వేడుక ప్రారంభిస్తారు. ప్రాతఃకాలాన్నే గోమయంతో కళ్ళాపుచల్లి రంగు రంగుల పిండితో ముగ్గులు పెట్టి ఆ ముగ్గుల్లో గోమయపు ముద్దల్ని పెట్టి పసుపూ కుంకుమలతో అలంకరించి వాటి చుట్టూ తిరుగుతారు. తెలంగాణా ప్రాంతంలో విజయదశమికి ముందున్న అమావాస్యనుండీ 'బతకమ్మ' అనే వేడుక చేస్తారు. ఇక్కడ 'గౌరమ్మ'ను చేసి పూలు దట్టంగా పేర్చి ఎత్తుగా పళ్ళాలల్లో అమర్చి అందరూ అలా తయారుచేసిన 'బతకమ్మ'లను ఒకచోట ముగ్గులువేసి పెట్టి, పాటలు పాడుతూ చుట్టూ తిరుగుతారు. ఈ 'గొబ్బిళ్ల' వేడుక ఆ 'బతకమ్మ' సంబరాల్ని గుర్తుకు తెస్తుంది ఆంధ్రలో 'బతకమ్మ' లేదు. తెలంగాణాలో ఈ 'గొబ్బిళ్ళు' లేవు! ఒకే రాష్ట్రంలోనే ఇలా వేడుకల్లో వైవిధ్యమున్నది మరి! ఆంధ్ర ప్రాంతంలో ఇలా గొబ్బిళ్ళను చేసి వాటి చుట్టూ తిరుగుతూ—

'సుబ్బీ గొబ్బీ శుభము నీయవే,
తామరపువ్వంటి తమ్ముడ్నీయవే,
చేమంతిపువ్వంటి చెల్లెల్నీయవే,
బంతిపువ్వంటి బావనీయవే,
మొగిలిపువ్వంటి మొగుడినీయవే.'

—అంటూ పాటలు పాడుతూ పూజ చేస్తారు ఈ పాటలు తెలంగాణాలోని— 'బతకమ్మ, బతకమ్మ ఉయ్యాలో, బంగారు గౌరవమ్మ ఉయ్యాలో' అనే వివిధరకాల పాటల్ని గుర్తుకు తెస్తాయి.

ఇలా పూజ పూర్తయింతర్వాత పచ్చి శనగలూ, కొబ్బరి ముక్కలూ ఉపహారంగా వచ్చిన అతివలందరికీ పంచిపెడతారు. ఆ తర్వాత గోమయం ముద్దల్ని పిడకలు చేస్తారు ఇలా రోజులపాటుచేసిన గొబ్బిళ్ళ పిడకలన్నీ దండలుగా గుచ్చి భోగిపండగ నాడు ఆ కన్నెపిల్లలే భోగిమంటల్లో వేస్తారు. ఈ భోగిమంటలుకూడా. తెలంగాణాలో లేవు. ఈ వేడుక 'కాముని పున్నమి' సందర్భంగా పిడకలతో మంటవేసే విషయాన్ని గుర్తుచేస్తుంది.

మన తెలుగుదేశంలో సంక్రాంతి పండుగ మూడురోజులు చేసే ఆచారం ఉంది.

భోగిరోజున అలా మంటవేయడం కొన్ని ప్రాంతాలలో ఆచారమైపోయింది. తర్వాత ఉదయాన్నే వేడినీళ్ళతో మంగళస్నానాలాచరించి 'భోగిపీడ వదిలింది' అని సంతోషిస్తారు. అంటే ఆనాటిమంగళస్నానంతో అమంగళమంతా పోయి మరునాటినుంచీ అన్నీ శుభాలే జరుగుతాయనే తృప్తితో సంతోషిస్తారు. సంక్రాంతి ఉత్తరాయణపు పుణ్యదినం. కనుక సంక్రాంతినాడు తెలక పిండితో, నూనె రాసుకుని స్నానంచేసి బెల్లం, నువ్వులు, గుమ్మడికాయలు మొదలైనవి బ్రాహ్మణులకు దానం చేస్తారు. పితరులకు తర్పణలొసర్చురారు మూడవ రోజున కనుముపండగ పశువుల నందంగా అలంకరించి, పూజలుకూడాచేసి పొలాల్లో 'పొంగలి'ని పొంగించుతారు. ఆ రోజే స్త్రీలు గౌరీవ్రతాన్నాచరిస్తారు.

మహారాష్ట్రలో :

ఉదయాన్నే మేల్కొని సముద్రస్నానం— మంత్రజపంచేస్తూ నువ్వులపిండి రుద్దుకుని చేస్తారు. స్నానం పూర్తయింతర్వాత ఇంటికివచ్చి పురోహితుల్ని పిలచి వారికి నువ్వులతో నిండిన పాత్రల్ని దానం చేస్తారు ఆ పాత్రల్ని 'తిల్‌పాత్ర' లంటారు. 'తిల్' అంటే నువ్వులని అర్ధం.

సంక్రాంతినాడు సాయంకాలం బెల్లంతోగాని పంచదారతోగాని కలిపిన నువ్వులను దంచి 'చిమ్మిలి' చేసి బంధువులకూ, స్నేహితులకూ, ఇరుగుపొరుగు వాళ్ళందరికీ పంచుతారు. ఈ తియ్యని పదార్ధం వలెనే సంవత్సరం పొడుగునా మధుర భాషితులై

మిత్రులుగా ఉండిపోవాలని అలా పంచడం లోని పరమార్థం.

మధ్యప్రదేశ్ లో :

ప్రాతఃకాలాన్నే లేచి అభ్యంగన స్నాన మాచరించి ముత్తయిదువులంతా చక్కగా అలంకరించుకొని, అందంగా అలంకరించిన పిడతలనూ, చెంబులనూ తీసుకుని తమకు తెలిసిన వాళ్లందరి ఇళ్ళకూ వెళ్తారు. ఆ పిడతల్లో బియ్యము, చెరకు ముక్కలు, పప్పుదినుసులు వేసి మూకుడు మీద నువ్వుల ఉండల్ని ఉంచుతారు

ప్రతి ఇంటికీ ఒక పిడతనిచ్చి, అలాగే వాళ్లింట్లో నుండి పుచ్చుకుంటారు. ఇలా ఇచ్చి పుచ్చుకోవడాలు పూర్తయిం తర్వాత ఇంటికి వచ్చేస్తారు. ఆ రోజున భోజనంలో పాటు నువ్వులతో చేసిన లడ్డూలకు ప్రాముఖ్యత ఎక్కువ.

ఇక సాయంత్రం పేరంటాలకు ముత్తయిదువులను పిలిచి వాళ్ళకి పసుపూ కుంకుమలతో బాటు గాజులూ, కుంకుమ భరిణలే గాక ఇంకా నువ్వుపప్పు కూడా వాయిన మిస్తారు!

ప్రతి ఇంట్లోనూ మగవాళ్ళంతా తమ కంటే పెద్దవాళ్ళ దగ్గిర్నుండి నువ్వు పప్పును పొంది దానిని చిన్నవాళ్ళకి పంచి పెడతారు

బెంగాల్ లో :

మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు వలె బెంగాల్లో నువ్వులకు ఎక్కువ ప్రాధాన్యత ఉన్నట్టు తోచదు పంట కోతకు వచ్చే సమయంలో వచ్చే పండుగ సంక్రాంతి గనుక—బియ్యపు పిండిలో ముఖ్యం ఫలహారాల్ని రకరకాలుగా చేసుకుని భుజిస్తారు. చెక్కలతో చక్రాలు చేసి వాటిని దండలు తయారుచేసి పిల్లల మెడలో వేయడం ఇక్కడి ఆచారం. ఈ ఆచారం తెలంగాణాలో హోలీ పండుగ సమయంలో కనిపిస్తుంది అయితే దండల్ని కోళ్ళకు వేయడం (ఆహారంగా) బెంగాల్లో ఆచారం! ఇలా కోళ్ళకు వేయడం చూడ్డం విచిత్రంగా అనిపిస్తుంది మనకి!

ఉత్తర ప్రదేశ్ లో:

త్రివేణి సంగమం దగ్గిర స్నానం చేసి నువ్వు దానికి సంప్రదాయ సిద్ధ స్నాన సమర్పణలు చేయడం, నెయ్యితో రొట్టెలు చేసుకుని భుజించడం ఇక్కడి ఆచారం. నువ్వులు, బెల్లం, ఇంటింటికి పంచడం ఇక్కడ కూడా ఉంది అయితే గొంగళ్ళను దానం చేయడం ఒక ప్రత్యేకమైన విశేషం! నువ్వుల నూనెతో శివునికి దీపారాధన చెయ్యడం సంక్రాంతినాడు తప్పనిసరి. పిల్లలు, చిన్నవాళ్ళు అంతా పెద్దవాళ్ళకు దండం పెట్టి ఆశీర్వాదాలు పొందుతారు గనుక ఈ పండగని వాళ్ళ 'మొక్కు పండగ' అని కూడా వ్యవహరిస్తారు. కొన్ని ప్రాంతాలలో వస్త్రదానం, గోదానం చేయడం ఆచారంగా ఉన్నది.


తమిళదేశంలో ఈ పండగనే 'పొంగల్' అని వ్యవహరిస్తారు. 'పొంగల్' అనే పదానికి 'వెలుగు దేవత' అని అర్థం. పొంగలిని వండి సూర్యునికి నివేదించి అందరికీ పంచడం ఈరోజున ముఖ్యంగా వీళ్లు చేసే పనుల్లో ఒకటి

ఆర్కిటిక్ మండలంలో ఆర్యులు నివసించేటప్పుడు వారు ఆరునెలలు చీకటి ఆరునెలలు వెలుతురులో నివసించాల్సి వచ్చేది. సూర్యుడు మకర రాశికి ప్రవేశించిన రోజున చీకటి తొలగిపోయి వాళ్ళంతా వెలుగును చూడగలిగే వాళ్ళు. వాళ్ళ జీవితంలో ఆరోజు కాంతి ప్రవేశించింది కనుక వాళ్ళంతా ఆనందంగా వేడుకలు జరుపుకునేవారు. నాటి నుండే సంక్రాంతి పండగ ఆచరణలోనికి వచ్చిందని కొందరి అభిప్రాయం!


శివరాత్రి మహాత్మ్యంలో శ్రీనాథుడు వివరించిన సంక్రాంతి బాంధవ్యాలను ఒక్కసారి మననం చేసుకోడం ఇట అప్రస్తుతం కాదనుకుంటాను.

'ఇండ్ల మొదలను నీరెండ నేడి కలను
ననుగు దమ్ముడు నన్నయు నాటలాడు
అత్తయును కోడలును గుమ్ము
లాడు కుమ్ము
గాచు చోటికి మకర సంక్రాంతి వేళ!'

—'మూర్తి శ్రీ జయసౌజన్య'



సంక్రాంతిముగ్గు 'సూర్యరథం' (ఫోటో: ఎ. వి. ఎస్. నారాయణ్)



జరిగిన కథ

లక్షాధికారి గారాల ముద్దుబిడ్డ శశిరేఖ. తండ్రి ఆదరంతో తనతోపాటే మెడిసిన్ చదువుతున్న ప్రసాదును ప్రేమిస్తుంది. యుద్ధరంగంలో సైనికుల చికిత్సకోసం ప్రసాదు వెళ్ళాడు. విరహంతో తల్లడిల్లుతున్న శశిరేఖను స్నేహితురాలు వాణి అనునయిస్తుంది. వాణికి శశిరేఖ రహస్యమంతా తెలుసు. అందుకే ఆమెని ఎగతాళి పట్టించింది. రేఖ గురించి ఆలోచించుకుంటూంటే ఆమె పెళ్లిచూపుల తతంగం జ్ఞాపకం వచ్చింది. తలుచుకుని బాధపడ్డాడు ప్రసాద్.

5

అనుకోని విధంగా మరొక ఘోరమైన సంఘటన జరిగింది. రేఖాదేవి వాణి యింటికి వెళ్ళివస్తూ ఉండగా ఒక లారీతో ఆమె వస్తూన్న కారు ఢీకొని పెద్ద యాక్సిడెంటు జరిగింది. డ్రైవరు ప్రమాదాన్ని గుర్తించి కారులోనుండి దూకడం వలన అతనికి మామూలు గాయాలు తగిలాయి. కాని రేఖాదేవికి మాత్రం చాలా ప్రమాదకరమైన గయాలు తగిలి చాలా రక్తం కారిపోయింది. వెంటనే నేను, పెదబాబుగారూ ఆమె గాయాలకు తగిన చికిత్స జరిపాము. ఈ విషయం సుధాకర్‌గారికి కబురు చేశాము ఆమెకు ప్రమాద పరిస్థితి దాటిపోలేదు. రక్తం బాగా కారిపోవడంవలన పరిస్థితి క్రమంగా దిగజారిపోవడమారంభించింది. డా సుధాకర్ వచ్చి రేఖాదేవిని చూసి వెంటనే వెళ్ళిపోయాడు. నాకు ఏమి తోచలేదు. వేరే ఎవరికైనా ధైర్యం చెప్పాలంటే మొదట నా పేరే చెప్పకోవాలి కాని యిప్పుడు నా పరిస్థితి అయోమయంలో పడిపోయింది కాళ్ళు చేతులు ఆడక వెంటనే వాణికీ, రవికి ఫోన్ చేసి విషయమంతా చెప్పాను. వారిద్దరూ వెంటనే బయలుదేర తున్నామని చెప్పారు. హాస్పిటలులో ఉన్న బ్లడ్‌గ్రూప్పు రేఖాదేవి బ్లడ్‌తో కలవలేదు. వరుసగా నర్సింగ్‌హోం స్టాఫు బ్లడ్‌ను పరీక్ష చేశాను. అదీ లాభం లేకపోయింది డాక్టరు బాబుగారి పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. జనరల్ హాస్పిటలులో నాకు తెలిసిన డాక్టరుకు ఫోనుచేసి బ్లడ్ బ్యాంకులో మాకు పనికివచ్చే గ్రూపుగల రక్తం ఉన్నదీ లేనిదీ తెలుసుకోవలసిందిగా చెప్పాను. చాలా అర్జంటని చెప్పడం వల్ల ఐదునిముషాలలో సమాధానం వచ్చింది. ఆ గ్రూపు రక్తం లేదని. హతాశుణ్ణయ్యాను. ఆ విషయం తెలియగానే పెదబాబుగారు మెంటల్ షాక్‌వల్ల స్పృహ కోల్పోయారు. ఒకరికి తోడుగా మరొకరు. ఇంతలో నాకు ఒక ఆలోచన తట్టింది. నా రక్తం పరీక్ష చేశాను గ్రూపు కలిసిపోయింది. సంతోషంతో నర్స్ రాధను పిలిపించాను. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్‌కు ఏర్పాట్లు చేయవలసిందిగా ఆమెకు చెప్పాను. ఇంతలో రవి, వాణి యిద్దరూ ఒకేసారి వచ్చారు. కొండంత ధైర్యం కలిగింది నాకు. చేయవలసినవన్నీ వివరంగా చెప్పి నేను బ్లడ్ యివ్వడానికై బెడ్‌పై పడుకున్నాను. రవి నా వద్ద ఉండి బ్లడ్ తీస్తున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. వాణి పెదబాబుగారికి స్పృహ తెప్పించే ప్రయత్నంలో ఉంది.

రవీ...! రేఖాదేవి పరిస్థితి ప్రమాదంగా ఉంది. అవసరమున్నంత బ్లడ్ వెనుకముందులు ఆలోచించకుండా తీసుకో ... ఇది వారి ఉప్పుతిని పెరిగిన శరీరం. ఏమాత్రం ఆలోచించవద్దు. నీవు అలా చేయకపోతే నీ మిత్రునికి ద్రోహం చేసినవాడవౌతావ్...' ఈ విషయం రవికి నొక్కి చెప్పాను.

'అలాగే!'అని రెండు, మూడు, నాలుగు పింట్లు రక్తాన్ని తీశాడు. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు.

నాకు తెలివి వచ్చిన తర్వాత సంగతులు తెలుసుకొని హాయిగా ఊపిరి పీల్చాను. అమ్మాయిగారి ప్రమాద స్థితి దాటిపోయిన సంగతి తెలిసి హాయిగా నిట్టూర్చాను... లేచి కూర్చోబోయాను. రేఖాదేవి పరిస్థితి ప్రమాదస్థితిని దాటిపోయిందని ఎవరో అనుకుంటూ ఉండగా వినిపించింది.

'లేవకండి డాక్టర్! మీకు తెలివిరాగానే ఫోను చేయవలసిందిగా చెప్పి అరగంట క్రితమే పెదబాబుగారు యింటికి వెళ్ళిపోయారు. మీరు ఒక రాత్రి ఒక పగలు స్పృహ కోల్పోయారు. మీకు కూడా రక్తం యిచ్చారు.'

'దయచేసి మీరు ఏమీ మాట్లాడవద్దు. అమ్మాయిగారి ప్రమాద పరిస్థితి దాటిపోయింది కాని బెడ్‌పైనుండి లేవలేని పరి


స్థితిలో ఉన్నారు. పెదబాబుగారు ఈరెండు రోజులూ యిక్కడే మకాం వేశారు. నిద్ర, ఆహారం లేని కారణంగా ఈ రెండు రోజుల లోనే సగమయ్యారు. కళ్ళు గుంటలు పడి పోయాయి. అమ్మాయిగారు మాట్లాడడం ప్రారంభించిన తర్వాత కొద్దిగా కుదుట పడ్డారు. మీ పరిస్థితికి బాధ పడ్డారు ముందు వారికి ఫోను చెయ్యాలి. ఆ తర్వాత తీరికగా మీసందేహా లన్నింటినీ తీరుస్తాను.' అని లేచి పోబో తున్న రాధను ఆపుచేసి 'రాధా...! ఇంత రాత్రప్పుడు వారికి నిద్రాభంగం కలిగించ వద్దు. రేపు ఉదయం వారు ఎలాగూ వస్తారు.' నీరసంగా అని రాధను బెడ్ ప్రక్కగా ఉన్న స్టూలుపై కూర్చోవల సిందిగా సంజ్ఞచేశాను.

'రాధా .....'

'మీరేమీ మాట్లాడకండి...మీ ప్రశ్నలు నాకు తెలుసు ..అన్నీవివరంగా చెబుతాను. ఆరోజు సంఘటన గుర్తుకువస్తే నాకూ కన్నీరు ఆగడంలేదు పెదబాబుగారు... మీరు స్పృహకోల్పోయారు. నర్సింగ్ హోంలోని రోగులను కంటికి రెప్పలా అహర్నిశలూ కాపాడుతూ, మమ్మల్ని సందరినీ చిరునవ్వుతో మాట్లాడిస్తూ, రోగులకు ఎనలేని ధైర్యప్రోత్సాహాలను ప్రసాదించే మీ ముగ్గురూ అలా బెడ్‌లపై పడిఉండడం చూసి అందరమూ భయంతో వణికిపోయాము. రవిగారు మీ రక్తాన్ని అవసరమున్నంతతీసి మీకు గ్లూకోసు యివ్వడం ప్రారంభించి పల్సురీడింగు చూడ సాగారు. వాణిగారు పెదబాబుగారికి గ్లూకోసుతో బి ట్వెల్వ్ యిచ్చారు. వెంటనే వారికి స్పృహవచ్చింది. పదినిముషాలలో తేరుకున్నారు. వారికి ఆనందంవల్ల కళ్ళు చెమ్మగిల్లాయి. అమ్మాయిగారికి బ్లడ్ యివ్వడం పెదబాబుగారికి తెలివిరాకముందే ప్రారంభించాము. వారు ఒక్కసారి అమ్మాయిగారిని చూసి మీ బెడ్‌వద్దకు వచ్చారు. అమ్మాయిగారిని వాణి, మిమ్ము లను రవిగార్లు శ్రద్ధతో చూస్తూ ఉండడం చూసి వారు ఎంతో పొంగి పోయారు. రవి నుద్దేశించి 'మీరిద్దరూ కలిసి నాకు రెండుకళ్లు ప్రసాదించారు.' అని అన్నారు.

'ఇందులో మాదేమీ లేదండీ! ఈ ఘనతంతా ప్రసాదుకే చెందాలి. సమయానికి తన రక్తాన్ని పరీక్ష చేసుకొని ఆలస్యం జరుగకుండా అవసరమున్నంత రక్తాన్ని తీసుకోవలసిందిగా నాకు చెప్పి నిశ్చింతగా బెడ్‌పై పడుకున్నాడు. అటు వంటి వాళ్లు వేయికి ఒకరుంటారా...? నాకు అనుమానంగా ఉంది. ప్రసాదుకు కూడా రక్తం యివ్వాలి. ఇకమీరు జాగ్రత్తగా అన్ని విషయాలు చూసుకోండి. రేపు మళ్లీ యిద్దరమూ వచ్చి వెడతాం' అని ఆ యిద్దరూ వెళ్లిపోయారు.

వారు వెళ్లిపోయిన తర్వాత మీ యిద్దరినీ జాగ్రత్తగా పరీక్షచేసి ఏవో యింజక్షన్లు స్వయంగా వారే చేశారు. మీకు రక్తం యిచ్చారు గంటకొకసారి మీ పల్సు, రెస్పిరేషను చెక్‌చేస్తూ నోటు చేసుకున్నారు. ఆ విధంగా రాత్రంతా జాగరణ చేశారు రెండవరోజు అమ్మాయి గారికి క్రమంగా తెలివి వచ్చింది. నీరసంగా కళ్లుతెరచి అందరినీ గుర్తుపట్టి ఒకటి రెండు మాటలు మాట్లాడి మళ్లీ కళ్లు మూసుకున్నారు. ఆవిధంగా వారి ప్రమాద పరిస్థితి దాటిపోయింది. మళ్లీ గ్లూకోజు



గూడుచేరిన పక్షులు

స్పెండు అమ్మాయిగారికి అమర్చాము. ఆ తర్వాత మీ యిద్దరినీ తమ గదికి ప్రక్కగా ఉన్న స్పెషల్‌రూముల లోపలికి మార్పించారు. ఆ తర్వాత విశ్రాంతిగా ఒకటి రెండు గంటలు నిద్రపోయారు. ఆ పిమ్మట రవిగారు, వాణిగారు వచ్చి అంతా సవ్యంగా ఉన్నట్లు తెలుసుకొని పెదబాబుగారికి ధైర్యంచెబుతూ వెళ్లిపోయాడు. సాయంత్రం నాలుగున్నరకు మిమ్మలను పరీక్ష చేసి ధైర్యంగా నిట్టూర్చి తమగదికి వచ్చి వేరేపనులు చూసుకోవడం ప్రారంభించారు. మీవద్ద నన్ను, అమ్మాయిగారివద్ద సీతమ్మను ఉంచారు. ఆతర్వాత రాత్రి తొమ్మిది గంటలకు యింటికి వెళ్లిపోయారు. మీకు తెలివి రాగానే ఫోను చేయవలసిందని నన్ను ఒకటికి రెండు సార్లు హెచ్చరించి వెళ్లారు. మరి ! మీరేమో వద్దంటున్నారు. మీరిద్దరూ తేరుకున్నారు. నా మనసు కుదుటపడి హాయిగా ఉంది.'

కళ్ళుమూసుకొని అంతా విన్నాను. నాకు ఒక చిన్నసందేహం కలిగింది 'రాధా డా. సుధాకర్‌గారు మళ్లీరాలేదా ? 'పోనీ పెదబాబుగారు వారికేమైనా ఫోను చేశారా...?'

'లేదు. వారు రాలేదు. వీరు వారికి ఫోనుచేయలేదు.'

'మంచిది రాధా...! ఇక నీవు వెళ్ళి విశ్రాంతి తీసుకో...! నాకు నీరసం తప్ప వేరే బాధలేమీ లేవు.' కళ్ళుమూసుకొని పడుకొన్నాను.

'నాకు విశ్రాంతిగానే ఉంది. నేను మీగది వదిలి వెళ్లడానికి వీలులేదు. పెదబాబుగారు ఈ విషయం నాకు నొక్కి చెప్పారు.'

సమాధానమిచ్చే ఓపికలేక అలాగే పడుకున్నాను. ఆ విధంగా పడుకొన్న నేను ఉదయం తొమ్మిది. తొమ్మిదిన్నరవరకు నిద్ర లేవలేదు. రాధ కుర్చీలో కూర్చుని టేబుల్‌పై తల ఆనించి నిద్రపోతూ ఉంది.

'రాధా... ! రాధా... !'

ఉలికిపడిలేచింది రాధ... ఆవులిస్తూ... వో...ఎంత పొద్దుపోయింది...? మీరు నిద్రలేచి ఎంతసేపైంది...? నన్ను లేపలేదేం ?'

'ఇప్పుడే లేచాను. నిద్రపోతూ కనుపించావ్ ! నీవుమాత్రం ఏంచేయగలవు ? చూడు నీముఖం ఎలా పాలిపోయిందో?'

'నేనెలా ఉంటే ఏం డాక్టర్...? మీరిద్దరూ కులాసాగా ఉన్నారు. నాకంతే చాలు. శ్రమ...ప్రయాస నేనెప్పుడో మర్చిపోయాను. ఇక హాస్పిటలంతా మళ్లీ కళకలాడుతుంది. ఇప్పుడే ఐదునిమిషాలలో నిత్యకృత్యాలు తీర్చుకొని వస్తాను' వెళ్ళిపోయింది రాధ. రాధ నిత్యకృత్యాలు తీర్చుకొని వచ్చింది. నాతో ముఖం కడిగించి పొగలు గ్రక్కుతూన్న కాఫీని కప్పులోపోసి నాకు అందించింది. కాఫీ త్రాగాను. కొద్దిగా ఓపిక వచ్చింది. బెడ్‌పై ఏటవాలుగా ఆని రాధ అమర్చిన దిండ్లపై పడుకున్నాను. పెదబాబుగారు షుమారు పదిగంటలకు ఆస్పత్రికి వచ్చారు. వచ్చీరాగానే నా గది లోపలికి వచ్చారు నేను స్పృహకలిగి ఉండడం వారికి సంతోషాన్ని కలిగించింది.

'బాబూ ప్రసాద్ ! నీకు స్పృహ ఎప్పుడు వచ్చింది ..?'

'రాత్రి షుమారు పదకొండు గంటలకు.'

'అలాగా...! మరి...రాధ నాకు ఫోను చేయలేదేం...? నీకు తెలివి రాగానే ఫోను చేయవలసిందిగా చెప్పి వెళ్ళాను...ఏమమ్మా రాధా...ఎందుకు ఫోను చెయ్యలేదు?'

'వద్దన్నారండీ...' కాఫీ కప్పులు సర్దుతూ అంది రాధ.

'అదేమిటి బాబూ ... ఎందుకు వద్దన్నావ్? ఒకసారి వచ్చి చూసి వెళ్ళేవాడివి కద ..!'

'అప్పుడే వెళ్ళారని తెల్సి, విశ్రాంతి లేని మీకు శ్రమ కలిగించడం ఎందుకని వద్దన్నాను, అయినా నాకు కేవలం నీరసం తప్ప వేరే ఏ యిబ్బందులూ లేవు.'

'శ్రమేముంది బాబూ! నీవు చేసిన మేలులో యిది ఎన్నోవంతు? నా బిడ్డను రక్షించి, ఈ వయసులో నాకు శోకం తప్పించావు. అన్ని విషయాలూ నెమ్మదిగా మాట్లాడుకుందాం. నీవు మాత్రం ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకు. రాధా చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇప్పుడు చాలా బలహీనంగా ఉంటుంది. వారం రోజులు ఎంతో శ్రద్ధగా చూడాలి. ఆతర్వాత



CMVS-40-203 TEL

ఖర్వాలేదు. ప్రసాద్! నీకే అవసరముంటే రాధతో చెప్పు. రాధను పూర్తిగా నీ పరిచర్యల నిమిత్తం కేటాయించాను.'

వారు వెళ్ళిపోయారు—

'విన్నారుగా మీరు ఎంత పెద్ద డాక్టరు గారైనా ప్రస్తుతం నర్సు చెప్పినట్లు వినాలి ... ఏమనుకున్నారు...?' చిరునవ్వు చిందిస్తూ అంది రాధ.

'అలాగే ...నర్సుగారూ మీ ఆజ్ఞ పాటిస్తాను' అని కళ్ళు మూసుకొని పడుకొన్నాను. పగలంతా హాయిగా విశ్రాంతిగా నిద్రపోయాను. సాయంత్రం నాలుగు గంటలకు మెలుకువచ్చింది పళ్ళరసం... బ్రెడ్...బటర్ అన్నీ సిద్ధం చేసింది రాధ. అవన్నీ తీసుకున్నాను. మరొక గ్లాసు పండ్లరసం యివ్వబోతుంటే వారించాను బాగా పళ్ళరసం, పుష్టికరమైన ఆహారం యివ్వవలసిందిగా పెదబాబుగారు చెప్పారట! వారికి నాపైగల వాత్సల్యానికి నా మనస్సు వారిఎడల కృతజ్ఞ భావంతో నిండిపోయింది.

ఐదుగంటలకు రవి, వాణి వచ్చారు రవి వస్తూనే 'పేషెంటుగా మారిన డాక్టరుగారూ ఎలా ఉందండీ మీకు? రేఖాదేవిని పరామర్శించి యిటు వస్తూ ఉన్నాం; మీ యిద్దరినీ ఈ విధంగా చూడడం ఒకపక్క బాధగానే ఉంది. ఏం చేయగలుగుతాం? తప్పడం లేదు' పరిహాసంగా అన్నాడు రవి. ఆ పరిహాసం వెనుక బాధకూడా వ్యక్తమైంది

'థాంక్సు రవీ...! సమయానికి వచ్చి నన్ను రేఖాదేవిని రక్షించావ్...! వాణీ... ఆ థ్యాంక్స్ నీకు కూడా...!'

'చెప్పిన థ్యాంక్సు చాలుగానీ యికమేము వెడుతున్నాం. తమరికి చాలా నీరసంగా ఉంది. ఇప్పుడు డిస్టర్బు చేయకూడదు. ఒకవారం రోజుల తర్వాత వచ్చి ఆ రోజంతా యిక్కడే గడుపుతాము.

'అలాగే!

ఇద్దరూ వెళ్ళిపోయారు. ఆ విధంగా నాలుగు రోజులు గడిచిపోయాయి. రాధ రాత్రింబవళ్ళు చేసిన సేవకు కొద్దిగా తేరుకున్నాను. బెడ్‌పై లేచి కూర్చోగలుగుతున్నాను. పెదబాబుగారు నా ఆరోగ్యం నిమిత్తం...బలం చేకూరేనిమిత్తం యింజక్షన్లు, టానిక్కులు, పుష్టికరమైన ఆహారం తాము స్వయంగా ఉండి యిప్పిస్తున్నారు.

ఒకరోజు రాత్రి ఆహారం తీసుకున్నాను. రాధ కూడా తన భోజనం పూర్తి చేసుకొని గది లోపలికి వచ్చింది పగలంతా నిద్రపోవడం...పనేమీ లేకపోవడం ... కనీసం మెదడుకు కూడా ఎటువంటి అలసట లేకపోవడంతో ఆ రోజు నాకు అసలే నిద్ర రాలేదు. ఏమైనా చదువుకోవాలనిపించింది.

'రాధా! నా షెల్ఫునుండి ఏదైనా నవల తెచ్చిస్తావూ... ?'


'వీల్లేదు...అంతగా కావాలంటే నేనే, ఏదైనా తెలుగు నవల చదువుతాను. వినండి. మీరు మాత్రం చదవడానికి వీలులేదు... అలసట కలుగుతుంది...'

'మంచిది ... చదవను. రాధా. కొంత కాలంగా నన్నొక సందేహం బాధిస్తూంది. నీవేమీ అనుకోనంటే అడుగుతాను. నీవు ఒంటరిగా ఉన్న సమయాలలో ఏవో విషయాలను స్ఫురణకు తెచ్చుకొని బాధపడుతూ ఉండడం ఒకటికి నాలుగుసార్లు గమనించాను. అవకాశంలేక ఎప్పుడూ అడగలేదు. పోనీ నీ విషయాలే చెప్పకూడదూ ? ఒక కథగా వింటాను...'

'...............'

'ఏం రాధా...! నాకు చెప్పకూడనటువంటి విషయాలా... ?'

అదేమీ లేదు...తప్పకుండా చెబుతాను. మీతోకాక మరెవ్వరితో చెప్పుకోగలను ? నా పరిస్థితి కూడా మీ పరిస్థితి లాంటిదే ! ఇంతవరకు నా గత జీవిత విశేషాలను అమ్మాయిగారికి గాని, పెదబాబుగారికి గాని, ఎవరితోనూ చెప్పలేదు. ఒకటి రెండుసార్లు అమ్మాయిగారు అడిగితే మాట తప్పించాను. మరెప్పుడూ వారు అడగలేదు ఇక్కడికి దగ్గరలో ఉన్న ఒక పల్లెటూరు మాది. కలిగిన కుటుంబంలో జన్మించాను. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమార్తెను. ఆ ఊరిలో గల స్కూలుకు వెడుతూ తర్డుఫారం వరకు చదువుకున్నాను ఒక రోజు జరిగిన సంఘటన నా జీవితాన్నే మార్చివేసింది . స్కూలుకు శలవు కావడం వల్ల ఆ రోజు మా తోటకు వెళ్ళి పూలు తెచ్చుకుందామనే ఉద్దేశంతో బయలుదేరాను. అప్పటికి నేను యుక్తవయస్కురాలనై రెండు మాసాలైంది. అమ్మ, నాన్న ఆ సంవత్సరంతో చదువు మాన్పించాలని ఆలోచించారు. నాకేమో చదువుకోవాలని ఉంది. మా ఊరిలో హైస్కూలు లేనందువల్ల నేను పట్టుబట్టే అవకాశం లేకుండా పోయింది. ఈ ఆలోచనలతో తోటకు దగ్గరయ్యాను. తలవంచుకొని నడుస్తూన్న నాకు ముందుకు అడుగు పడలేదు, నాకు రెండుగజాల



దూరంలో ఒక నల్ల త్రాచు పడగవిప్పి ఆడుతూ కనుపించింది. భయంతో వణికి పోయాను. సెవ్వడివిని ఆటమాని నన్ను చూసి ముందుకు రాసాగింది. భయపడుతూ పరుగెత్తసాగాను. అది నన్ను వెంబడించింది. శక్తికొద్దీ పరుగెత్తాను. 'భయపడకు రాధా...! ఆ పామును నేను చంపేశాను.' చిరునవ్వుతో నన్ను వెనుకకు పిలిచాడు సూర్యం చచ్చినపాము కనుపించింది. ఆ సంఘటనతో నాకూ, సూర్యానికీ పరిచయం పెరిగింది... ఆ పరిచయం ప్రేమగా మారింది'

'ఆపావేం రాధా?... సూర్యం అని అంటున్నావు ... నాకుకూడా సూర్యం పేరుగల తమ్ముడొకడున్నాడు, సూర్యం అంటే రమణయ్యగారి రెండవ అబ్బాయేనా ?'

'అవును! వారబ్బాయే...! అయితే మీరు...?'

'నేను ఆ ప్రసాదునే...! నీవు చెబుతూన్న ఆ సూర్యం అన్నను...ఇంతకూ మావాళ్ళంతా కులాసాగా ఉన్నారా...? ఈమధ్య నీవెప్పుడైనా వెళ్ళావా ?'

'మీరు ..మీరు ..రమణయ్యగారి మొదటి సంబంధం కుమారులు ప్రసాద్... మిమ్మలను గురించి వినడమేకాని ఎప్పుడూ చూడలేదు. అయినా మీరు ఊరు వదిలేవరికి నేను చాలా చిన్నదాన్ని. మీ నాన్నగారు మిమ్మలను చిన్నప్పుడు యింటినుండి వెళ్ళగొట్టారనుకుంటాను ... దొంగతనం నేరంమోపి మిమ్మలను అన్యాయం చేసినందుకు ఆ సూర్యకాంతమ్మగారికి తగిన శాస్తే జరిగింది'

'ఏం జరిగింది ..? నీవు చెప్పిన సూర్యం మా తమ్ముడు సూర్యమేనా ? ఆ ఊరువిడిచి పదిపన్నెండు సంవత్సరాలైంది నేను ఆ ఊరు విడిచినతర్వాత జరిగిన సంగతులు క్లుప్తంగా చెప్పు. వినాలని ఆదుర్దాగా ఉంది,'

'ఏం చెప్పమంటారు ? అన్నీ విచారకరమైన సంగతులే! సూర్యంతో పరిచయాన్ని పెంచుకున్న నేను కాలుజారాను. ఫలితంగా నెల తప్పింది. ఆ సమయంలోనే జలజ అనే నాటకాల అమ్మాయి మోజులోపడి నన్ను పూర్తిగా తిరస్కరించాడు సూర్యం. ఆ అమ్మాయితో

పరిచయం ఏర్పడకముందు నన్ను ఎంతో ప్రేమతో చూసేవాడు మీ నాన్నగారు. మా నాన్నగారు మా వివాహానికి సమ్మతించారు. జలజతో పరిచయం సూర్యంలో ఎన్నోమార్పులను తెచ్చి పెట్టింది. త్రాగుడు ...జూదం...మనిషి నానాటికీ దిగజారనారంభించాడు. తల్లీ, తండ్రి మంచీ చెడూ ఏమీలేకుండా పోయింది. ఆ జలజను కొంతకాలం వేరే ఉంచాడు ఆతర్వాత నేరుగా యింటికే తీసుకువచ్చాడు సూర్యాన్ని కోపంలో కొట్టబోయిన మీ నాన్నగారు జారిపడి మంచమెక్కారు చివరకు మీ అమ్మ, నాన్న ఊరువిడిచి వెళ్ళిపోయారు ...ఎటు పోయారో...? ఒకరోజు నావిషయం తేల్చుకోవాలనే ఉద్దేశ్యంతో మీ యింటికి వెళ్ళాను. జలజ, సూర్యం ఇద్దరూ త్రాగిన మైకంలో ఉన్నారు, సూర్యం నాగోడు ఏ మాత్రం వినిపించుకోలేదు. నాకు ఈ ప్రపంచమే శూన్యంలా తోచింది. ఆలస్యం జరుగుతే ఊరంతా పొక్కుతుందనీ, మా కుటుంబ పరువు ప్రతిష్టలు నాశనమై పోతాయని ఊహించి ఆరోజు రాత్రే యిల్లు విడిచి హైదరాబాదు చేరాను ... ఇక్కడ నాకు పరిచయస్తులెవరున్నారని? ఎంతో మంది గృహస్తులను ఆశ్రయించాను యింటి చాకిరీ పని నిమిత్తం ఎవ్వరూ ఆ పని యివ్వలేదు. ఆ పరిస్థితిలో రెండురోజులు తిరిగాను . ఆహారం లేదు ... ఒంట్లో ఓపిక అంతకన్నా లేదు. కళ్ళు తిరగడం ప్రారంభించాయి ... నిలదొక్కుకున్నాను. లేని ఓపిక తెచ్చుకొని మరొక ఫర్లాంగు నడిచాను. ఎదురుగా 'రేఖా నర్సింగ్‌హోం' అన్న బోర్డు కనుపించింది. ఎలాగో నర్సింగ్ హోం గేటు వరకు వెళ్ళగలిగాను. ఇక ఆగలేక పడిపోయాను. కళ్ళు తెరిచి చూసే సరికి పెదబాబుగారు చిరునవ్వుతో పలకరించారు. వారి ముఖంలో కనుపించిన ఆప్యాయత ఆదరణ నాకు ధైర్యాన్నిచ్చింది. వారి ప్రశ్నలలో ఒకే ఒక ప్రశ్నకు నా పేరు చెప్పాను...మిగతా ప్రశ్నలకు సమాధానం యివ్వలేదు నేను ... తరచి, తరచి ప్రశ్నించలేదు వారు. మానసికంగా, శరీరకంగా దెబ్బతినడం వల్ల నాకు గర్భస్రావం జరిగింది...ఈ విషయంలో మాత్రం భగవంతుడు నాకు ఎంతో మేలు చేశాడు. నేను కోలుకొనేసరికి నెలరోజులు పట్టింది.

గూడుచేరిన పక్షులు

నర్సింగ్‌హోంలోనే ఉండి రోగులకు సేవచేస్తూ జీవిత శేషం వెళ్ళబుచ్చ తలచుకున్నట్టుగా పెదబాబుగారికి చెప్పాను ... వారు సరే నన్నారు అప్పటి నుండీ యిక్కడే ఉంటున్నాను...క్లుప్తంగా యిదీ... నా చరిత్ర...'

'మా నాన్నగారు...అమ్మ ఎక్కడికి వెళ్ళారో నీకేమైనా తెలుసా రాధా...? ఎక్కడ...ఏ పరిస్థితిలో ఉన్నారో...?'

'మీదెంత సహృదయం డాక్టర్? మిమ్ములను నిర్దాక్షిణ్యంగా వెళ్ళగొట్టారు మీ నానగారు దొంగతనాన్ని మీకు అంటగట్టారు సూర్యకాంతమ్మగారు .. సూర్యం...వారి విషయంలో మీరు ఎంతో కాఠిన్యం వహిస్తారనుకున్నాను. వారు మీకు చేసిన అన్యాయాన్ని బొత్తిగా మరిచి పోయినట్లున్నారు... పైగా వారిని గురించి బెంగపడుతున్నారు.'

'అదేమిటి రాధా...ఎంతైనా వారు నా కన్నతండ్రి...దండించే అధికారం...దండింపబడే బాధ్యత మా యిద్దరికీ ఉన్నాయి. ఆ విషయాల నింకా నేను మనసులో ఉంచుకున్నానా? ఇక సూర్యం వాడొట్టి అమాయకుడు. నేనంటే ఎంతో ఆపేక్ష వాడికి తల్లి మాటలు విని చెడిపోయాడు. తన వ్రేలితో తన కన్నే పొడుచుకున్నట్లైంది ఆమె పరిస్థితి ఆమె కూడా ఈపాటికి పశ్చాత్తాప పడుతూనే ఉండి ఉండాలి...'

'మీరెన్నైనా చెప్పండి. మంచితనం...ఓర్పు...శాంతభావం.. తోటి మనుష్యులపై సానుభూతి యివన్నీ మీరలవరచుకున్న ఉత్తమ లక్షణాలు మీ నుండి నేను కూడా ఎంతో నేర్చుకున్నాను. ప్రథమంలో సూర్యాన్ని నేను విపరీతంగా ద్వేషించేదాన్ని...క్రమంగా ఆ ద్వేషం జాలిగా మారిపోయింది. అందులో అతని తప్పేముంది ? నాతో తొలి పరిచయం జరిగినప్పుడు మీ మంచితనాన్ని గురించి ఎంతో చెప్పేవాడు...కాని చిన్నతనం కావడంవల్ల తల్లిని ఎదిరించలేక మీకు దూరమయ్యానని ఎంతగానో వాపోయేవాడు. మీరు గుర్తుకు వచ్చినప్పుడల్లా మీలాంటి వారెవ్వరైనా అతనికి తోడుగా ఉన్నట్లయితే ఆ విధంగా మారిపోయి ఉండేవాడు కాదని యిప్పుడనిపిస్తూ ఉంది. ఆ కుటుంబానికి మీరు దూరమయ్యాక అతను ఒక్కడే కావడంవల్ల ఎంతో గారాబంగా చూశారు. ఆడింది ఆట...పాడింది పాటగా సాగింది అతనికి .'

'ఎక్కడున్నా అంతా సుఖంగా ఉండడమే కావాలి నాకు. నాన్నగారికింకా నాపై ద్వేషం ఉందేమోనన్న అనుమానం యింకా నన్ను పీడిస్తూనే ఉంది ఏం చెయ్యను ? తల్లిదండ్రుల ప్రేమను పంచుకోవడానికి నోచుకోలేని దురదృష్టవంతుణ్ణి. ఒక విధంగా అది అదృష్టం కూడా కావచ్చు. వారివద్దనే ఉన్నట్లయితే యింత పట్టుదలతో చదివేవాడిని కాదేమో...విధి నెవరు తప్పించగలరు...?'


'చాలా ప్రొద్దుపోయింది ... ఇక నిద్రపోండి. మీ ఆరోగ్యం చెడుతుంది. పెదబాబుగారికీ విషయం తెలుస్తే నన్ను కోప్పడుతారు.'

రాధ చేసిన హెచ్చరికతో నిద్ర కుపక్రమించాను. ఆ విధంగా బెడ్‌పై పదిరోజులు గడిపాను. రాధ చరిత్ర తెలిసిన తర్వాత ఆమెను మా కుటుంబంలోని ఒక వ్యక్తిగా తలచాను. మరొక వారం రోజులలో నాకు పూర్తి ఆరోగ్యం చేకూరింది. క్రమంగా నా పనులు నేను చూసుకోవడ మారంభించాను. పెదబాబుగారు నన్ను మరొక రెండు వారాలు విశ్రాంతి తీసుకోవలసిందిగా హెచ్చరించారు. నాకు ఆరోగ్యంగా ఉండడంవల్ల ఊరికే పని లేకుండా కూర్చోవడం యిష్టం లేకపోయింది.

రేఖాదేవికి కూడా పూర్తి ఆరోగ్యం కలిగింది. యాక్సిడెంటులో ముఖానికి బలమైన గాయాలు తగలడంవల్ల ముఖం నిండా మచ్చలు ఏర్పడ్డాయి. పెదబాబుగారికి ఈ విషయం ఎంతో బాధను కలిగించింది. సుధాకర్‌గారు యాక్సిడెంటు జరిగిన తర్వాత ఒక్కసారి మాత్రమే వచ్చి చూసి వెళ్ళారు రేఖాదేవిని; అదీ స్పృహకోల్పోయి ఉన్నప్పుడు. ఆ తర్వాత మళ్ళీ రాలేదు.

(ఇంకా ఉంది)

కలిసి ప్రయాణించటం లాభదాయకం!



మీరు ఒక గుంపుగా ప్రయాణం చేస్తే ఎయిర్-ఇండియా వారి ఎఫినిటీ గ్రూప్ స్కీము క్రింద తక్కువ. చాలా తక్కువ ఛార్జీలు చెల్లించవలసి ఉండును.

ఎటువంటి గుంపులు ఇందుకు అర్హులు ?

మీ గుంపులో కనీసం 15 మంది సభ్యులైనా ఉండాలి. మీరంతా కనీసం 6 మాసాల పాటైనా ఒకే స్కూలు/కాలేజి. ఇన్‌స్టిట్యూట్. ఫర్మ్. క్లబ్. సొసైటీ. కార్పొరేషన్. అసోసియేషన్ లేక సమాఖ్యకు చెందినవారై ఉండాలి.

ఎటువంటి ప్రయోజనానికి ?

ఒక కాన్ఫరెన్స్ లేక కన్వెన్షన్‌కు హాజరవ్వటానికి గాని లేక కులాసా కోసం గాని మీరు ప్రయాణం చెయ్యదలచినట్లైతే మీకా తగ్గింపు సదుపాయం లభించగలదు. ఎయిర్—ఇండియా మీ గుంపులో భాగముగా మీ భార్య/భర్త మరియు పిల్లలను గూడా చేర్చటానికి అంగీకరించగలదు. నిజంగా మీరు ఎంతో డబ్బు—కొన్ని సెక్టర్లలో ఒక్కొక్క ఛార్జీ మీద రు. 2000 లకు పైగా—ఆదా చేసుకోగల్గుతారు.

జిఐటిని గురించి మీ ట్రావెల్ ఏజెంటును సంప్రదించండి. గ్రూప్ ఇంక్లూజివ్ టూర్ స్కీము క్రింద కలిసి ప్రయాణం చేసే 10 మంది గల గుంపుకు విమాన ఛార్జీలలో, హోటల్ బుక్కింగులలో. వివిధ ప్రదేశాలను చూడటానికి ఏర్పాటుచేసిన టూర్లలో తక్కువ రేట్ల ప్రయోజనం మీకు లభిస్తుంది. మీ ట్రావెల్ ఏజెంటు 21-రోజుల యూరపు పర్యటనను కేవలం రు. 5,600లకు మాత్రమే ఏర్పాటుచేయగలరు.

మీ స్థానిక ఎయిర్-ఇండియా ఆఫీసు లేక మీ ట్రావెల్ ఏజెంటును పూర్తి వివరాలకై సంప్రదించండి. కలిసి ప్రయాణం చేయటం ఎంతో లాభదాయకమని మీరు తెలుసుకోగల్గుతారు.

ఎయిర్-ఇండియా
మిమ్మల్ని ప్రేమించే ఎయిర్‌లైన్

AI-3005



పరీక్ష

లేడీస్‌క్లబ్ ఆవరణలో, వోమూలగా బొగడచెట్టుకింద కుర్చీలలో కూర్చుని, కబుర్లు చెప్పుకొంటున్నారు వాళ్లు నలుగురూ

ప్రెసిడెంటు లీలావతి, 'ఈ మగవాళ్లని నమ్మశక్యంకాదు! పెళ్ళాం పిల్లలంటే ఎదురుగా ఎంత ప్రేమ నటించినా, నిజస్వరూపాలు అప్పుడప్పుడు బయటపడ్తాయి.' అన్నది, నల్ల కళ్లజోడుని సెంటువాసనలు వెదజల్లే సిల్కుమాలుతో తుడుచుకుంటూ. సెక్రటరీ చంద్రకళా, మేనేజర్ సరోజాదేవీ లీలావతిని సమర్థించారు.

'అందరు మగవాళ్ళూ అంటే నేనొప్పుకోను. ఉదాహరణకి మా ఆయన్నే తీసుకోండి. ఆయనంత మంచివారూ, ప్రేమతో చూసేవారూ మనోహరుండరు!' శారద చాలా గర్వంగా అంది.

లీలావతి మొహంలో రంగులుమారాయి అయినా, లేనినవ్వు తెచ్చిపెట్టుకొంటూ.

'ఎవరి మొగుళ్లని గురించి వాళ్లు అలాగే చెప్పుకొంటారు. అయినా నేనన్నట్లుగా, వాళ్ల అసలు స్వరూపాల్ని కనుక్కోవడం చాలా కష్టం!' అంది.

'అదేమంత కష్టంకాదు. మీరు 'ఊఁ' అంటే మన నలుగురి. భర్తల్నీ ఇట్టే పరీక్షిద్దాం. అప్పుడే నేనోపథకం ఆలోచించాను' అంది చంద్రకళ.

'ఏ ప్రశ్నాపత్రం తయారుచేసి యివ్వడమేగా! ఈమధ్య పత్రికల్లో ఇటువంటి పరీక్షలు చాలా యిస్తున్నారు' అన్నది సరోజాదేవి, అదేమంత ఘనకార్యం అన్నట్లుగా.

'అటువంటిదేమీకాదు. ఇది చాలా కఠినమైన పరీక్ష. ఇందుకు మగసహాయం కూడా కావలిసి వస్తుంది. అందుకు





1972

JANUARY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
30	31					1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

FEBRUARY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29				

MARCH

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	31	

JULY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
30	31					1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

AUGUST

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30	31		

SEPTEMBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30



APRIL

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
30						1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

MAY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30	31			

JUNE

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	

OCTOBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31				

NOVEMBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30		

DECEMBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
31					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30



విజయలక్ష్మి మూవీస్ "అమ్మమాట"లో వాణిశ్రీ, లీలారాణి

ఏర్పాట్లు మా తమ్ముడిద్వారా చేయిస్తాను. ఇలా దగ్గరగా రండి. వివరాలు చెప్తాను.' చంద్రకళ ధీమాగా అనడంతో, మిగిలిన ముగ్గురూ కుర్చీలు దగ్గరగా జరుపుకొన్నారు.

* * *

'ఎందుకు నన్నిలా బంధించి తీసుకొచ్చారు? నేను మీకేం అపకారం చేశానని?' లీలావతి భర్త చలపతి, కుర్చీలో గింజుకొంటూ అడిగాడు ఎదురుగా ఉన్న ఇద్దరు ముసుగు మనుషుల్ని.

'మీదగ్గర దాపరిక మెందుకు? మేం పాకిస్తాన్ గూఢచారులం. మీ ఫ్యాక్టరీ తయారు చెయ్యబోయే కొత్త యంత్రం తాలూకు వివరాలన్నీ మాకు కావాలి' అన్నాడు ఇద్దరిలోనూ బలంగా ఉన్న నాయకుడు.

'అవి యిచ్చి నా యజమానులకీ, దేశానికీ ద్రోహం చెయ్యమంటారా!' చలపతి వీల్లేదన్నట్లు అన్నాడు

'మీరిలా అంటారని ఊహించాం. అయితే మీకు మరో దారిలేదు. ఎంచేనంటే, మీ భార్య లీలావతి మా బందీగా ఉంది. మీరు తిరస్కరిస్తే, ఆవిడ మీకు దక్కదు. ఆలోచించుకొండి'

'మీరు అబద్ధమాడుతున్నారు. మా ఆవిడ...' చలపతి యింకా ఏదో అనబోతుండగా, మరో యిద్దరు ముసుగు మనుషులు స్పృహ తప్పి పడున్న లీలావతిని స్ట్రెచర్ మీద మోసుకొచ్చారు. చలపతి కొయ్యబారి పోయాడు. నాయకుడికి చేతులు జోడించి, 'ఆమెకు మీరేమీ హాని చెయ్యవద్దు. మీరడిగిన వివరాలు అందజేస్తాను' అన్నాడు బలహీనంగా.

స్పృహ తప్పినట్లు నటించిన లీలావతి గర్వంతో పొంగిపోయింది. అయితే ఉత్సాహాన్ని బలవంతంగా ఆపుకొని, బిగపట్టుకొని పడుకొంది.

'మీరిక్కడే ఉండండి. మరో గంటలో మిమ్మల్ని వదిలేస్తాం. రేపు సాయంత్రానికల్లా మీరు వివరాలందించాలి. అప్పుడే మీ భార్య మీకు దక్కుతుంది' నాయకుడి మాటలని, బయటకు దారి తీశాడు. మిగిలిన వాళ్ళు లీలావతిని అక్కణ్ణించి మోసుకొని పోయారు.

* * *

'ఛస్తే మా శాఖకు సంబంధించిన పత్రాలు మీకు యివ్వను!' రామచంద్రం బింకంగానే అన్నాడు.

'మీరు ఆ కిటికీలోంచి పక్క గదిలోకి చూడండి. ఆ తర్వాత మీ యిష్టం' అన్నాడు నాయకుడు.

రామచంద్రం నీరసంగా నడుచుకొంటూ కిటికీ దగ్గరకు వెళ్ళాడు. మంచం మీద కాళ్ళూ చేతులూ కట్టబడి ఉన్న చంద్రకళనీ, పదేళ్ళ కొడుకునీ చూస్తూనే బావురు మన్నాడు. నాయకుడు ఓదార్పుగా రామచంద్రం భుజం మీద చెయ్యివేస్తూ దూరంగా తీసుకు పోయాడు. 'మీ పెళ్ళాం బిడ్డలు కావాలంటే, మేమన్న పని మీరు చేసి తీరాలి' అన్నాడు.

'మీరడిగిన వివరాలివ్వడానికి నాకు రెండురోజులు వ్యవధి కావాలి' రామచంద్రం నసుగుతూ అన్నాడు.

'నిరభ్యంతరంగా అందాకా వాళ్ళిద్దరూ మా అతిథులుగా ఉంటారు' అని, నాయకుడు గది బయటకు నడిచాడు.

సెక్రటరీ చంద్రకళ లీలావతి వైపు గర్వంగా చూసింది.

* * *

'ఏమండీ రాజారావుగారూ, యింతకీ మీరు లొంగనంటారు! అయితే మీ భార్య సరోజగారిమీద ఆశ వదులుకోండి' నాయకుడు కటువుగా అన్నాడు.

'సరోజనా! ఎలా తీసుకొచ్చారు?!' రాజారావు ఆశ్చర్యంగా అడిగాడు.

'మిమ్మల్ని తీసుకొచ్చిన విధంగానే — మోసగించి. వ్యర్థమైన ప్రసంగం అనవసరం. మీ కంపెనీ తయారుచేసిన ఆ మాయదారి ఇంకు ఫార్ములా మాకు కావాలి. మా మిలిటరీ ప్రెసిడెంటు మళ్ళా ఎలక్షన్లు జరిపిస్తున్నాడు. ఆ ఇంకు అవసరం మా కెంతైనా ఉంది. మీరు ఫార్ములా యిచ్చిన గంటకల్లా, మీ సరోజ మీ వద్దకు చేర్చబడుతుంది.'

'దుర్మార్గులారా! మీరు కట్టిన కట్లతో కాళ్ళు చేతులూ మండుతున్నాయి. నన్ను కూడా మా ఆయనదగ్గరే పడేయండి.' పక్కగదిలోంచి వినవచ్చాయి సరోజాదేవి

సంక్రాంతి మహాలక్ష్మి

అలుగు అగ్నివోలె చలిపయ్యెరలు వీవ
జల్లులై చేమంతు లిళ్ళనిండ
కొలువుతీర్చిన బొమ్మల్ చెలువముల్ నింపగా
భోగిమంటల కాంతి ముదమొసంగ
వరుసలౌ ముగ్గుల వనరొందు గొబ్బిళ్ళు
చెంగటన్ కన్నియల్ సిగ్గు వడగ
ఘంటికల్ మెడలోన ఖంగుఖంగని మ్రోయ
బసవన్న వాకిళ్ళ పరువులిడగ
అరుదెంచి బత్తిమై చిరుతలన్ మీటుచు
అంగణమ్మున 'జియ్య' పాడిపాడ

బ్రతుకు అందున నవకాంతి పర్వికొనగ
భువులు బాసి విజ్ఞాన సంపదలు నిండ
వచ్చె నింటింట సంతోసమెచ్చి పడగ
వెలుగు సంక్రాంతి మహాలక్ష్మి తెలుగునాట.

—ఎ. లీలావతి

మాటలు. రాజారావు చేతుల్తో మొహం దాచుకొంటూ, కుర్చీలో కూలబడ్డాడు. 'సరోజ నేమీ చెయ్యకండి. మీరేం చెయ్య మంటే అది చేస్తాను.' గట్టిగా అరచేసు రాజారావు.

తన భర్తేమీ తక్కువ కాదన్నట్టుగా మిగిలినవారివైపు చూసింది సరోజాదేవి.


* * *

'ఇంతకీ తూర్పు పాకిస్తాన్లో అకాల వర్షాలు మా భారతదేశం కురిపించిన విధానం మీకు కావాలంటారు; అవునా? మా మెటీరియాలజీ డిపార్టుమెంట్ ఎన్నో సంవత్సరాలు కష్టపడి సాధించిన ఫలితాన్ని, మీకు వొలిచిన అరటిపండులా చేతిలో పెట్టడమనేది అసంభవం!' శారద మొగుడు వరదరాజా అన్నాడు కోపంగా.

'మీరిచ్చితీరుతారు! దానికి తగ్గ సాధనం

పరీక్ష

మా దగ్గర ఉంది' అంటూ నాయకుడు తన అనుచరులకి సంజ్ఞ చేశాడు. వాళ్ళు, చేతులు వెనక్కివిరిచి కట్టబడిఉన్న శారదనీ, భయంగా తల్లి కాళ్ళను చుట్టుకొని నడుస్తున్న నాలుగేళ్ళ పాపనీ తీసుకొచ్చారు. వరదరాజా బలంగా గింజుకొన్నాడు. కుర్చీకి గట్టిగా కట్టేయడం వల్ల, కుర్చీతోసహా కిందకు పడ్డాడు. శారద గొల్లుమంటూ ఏడుపు మొదలెట్టింది ముసుగు మనుషులు కుర్చీతోసహా వరదరాజుని లేవనెత్తి కూర్చోపెట్టారు. 'వాళ్ళ ప్రాణాల మీద మీకేమాత్రం ఆశ ఉన్నా, మేం అడిగినది మీరు తప్పకుండా చెప్పాలి.' నాయకుడు వికటంగా నవ్వుతూ అన్నాడు.



వరదరాజా ముసుగుమనిషి మొహం మీద ఉమ్మేస్తూ అన్నాడు. 'నన్నూ నా కుటుంబాన్నీ సర్వనాశనం చేసినా లొంగేది లేదు. నా దేశం ముందర నా పెళ్ళాం బిడ్డల ప్రాణాలొక లెక్క కాదు.'

'మీకు మరో గంట వ్యవధి యిస్తున్నాం. ఆలోచించుకోండి' అంటూ నాయకుడు శారదనీ పాపనీ బలవంతంగా బయటకు పంపేసి, వరదరాజుని గదిలోపెట్టి గడియవేశాడు. 'మీరు గంట కాదు—వెయ్యి సంవత్సరాలు గడువిచ్చినా నా నిర్ణయం మారదం'టూ, వరదరాజా కేకలు వెయ్యసాగాడు మూసిపెట్టిన గదిలోంచి.

శారదకు ఈమాటు నిజంగా ఏడుపొచ్చింది. ఉడుకుమోతుతనంతో, మొగుడిమీద కోపంలో మొహం ఎర్రబడిపోయింది. లీలావతీ, చంద్రకళా, సరోజాదేవీ—శారదవైపు నవ్వుతూ విజయగర్వంతో చూసినా, మీ మొగుళ్ళందరూ దేశద్రోహులని శారద ఎక్కడంటుందేమోనని లోపల కొద్దిగా భయపడ్డారు.

నాలుగు మూలల్నించీ పోలీసులు వచ్చి ముసుగుమనుషుల్ని పట్టేసి అందర్నీ విడిపించేశారు. 'మాకు సకాలంలో సమాచారం అందడంవల్ల మిమ్మల్ని రక్షించకలిగాం. అయితే ఈ విషయం గురించి మీరు ఎవరితోనూ చర్చించకూడదు. ఎవరికీ తెలియనీయకూడదు. ఇది మన ప్రభుత్వం ఆజ్ఞ. ఈ విషయం ఏ మాత్రం బయటకు పొక్కినా, మిగిలిన మురాలు జాగ్రత్తపడిపోతాయి మీరిక వెళ్ళవచ్చు' అంటూ ఇనస్పెక్టరు అందర్నీ పంపించేశాడు.

లీలావతీ, చంద్రకళా, సరోజాదేవీవాళ్ళు ఎక్కిన టాక్సీల్లో డ్రైవర్నున్నారన్న ధ్యాసే లేకుండా భర్తల్ని కావిలించేసుకొన్నారు పెళ్ళాం భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వెయ్యబోయిన వరదరాజుని విసిరికొట్టి, దూరంగా జరిగింది శారద.

ఇది జరిగిన కొన్ని రోజులకే—

ఓ సాయంత్రం లీలావతి మేడ మెట్ల మీదనుంచి జారిపడి కాలి ఎముక విరక్కొట్టుకొంది. పనిమనిషి క్లబ్‌లో ఉన్న చలపతికి ఫోను చేసింది. 'నువ్వు డాక్టరుకు

ఇక యువతులకు ఫిలిప్స్ సైకిల్



'టిఐ' వారి మరో మోడలు అతి లలితం, లావణ్యం. తేలిక,
మృదువూ కూడా. ఏా సుకుమారమైన చేతులకు,
భుజాలకు శ్రమను తగ్గించే ఖచ్చితమైన
బాలెన్స్. తొక్కండి ఫిలిప్స్

PHILLIPS® TI PHILLIPS

తయారీ. టిఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు, మద్రాసు 53
ప్రొప్రైటర్లు: ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు 1

TIC/PH/6857

పరీక్ష

ఫోను చెయ్యి. నేనిప్పుడే వస్తున్నాను' అని చెప్పిన చలపతి, పేకాట తాపీగా ఆడి రాత్రి పన్నెండింటికి ఇల్లు చేరాడు. పెళ్లాం నర్సింగ్ హోంలో కట్టులో పడుందని తెలుసుకొని, రాత్రంతా శుభ్రంగా నిద్రపోయి ఉదయం చూడ్డానికి వెళ్లాడు లీలావతి ఈ సంగతి ఎవరితోనూ చెప్పుకోలేదు.


చంద్రకళ కొడుకు బంతి ఆడుతూ పక్కింటివాళ్ల కిటికి అద్దాల్ని బద్దలు కొట్టేశాడు. ఆ యింటి మీనాక్షమ్మ చంద్రకళమీదకు దెబ్బలాటకు వచ్చింది. చంద్రకళ కొడుకుని సమర్థించుకొంటూ, నేరాన్ని మీనాక్షమ్మ కొడుకుమీదకే నెట్టి, ఆవిడ నోరుమూయించి పంపింది విజయగర్వంతో. అయితే ఆఫీసునుంచి తిరిగి వచ్చిన రామచంద్రానికి మీనాక్షమ్మ మొగుడు మళ్లీ ఫిర్యాదు చేశాడు రామచంద్రం పెళ్లాన్నీ, కొడుకుని సక్కించే ఆయన ముందరే నాలుగుతిట్టి వాళ్లకిటికి బాగుచేయించేశాడు. చంద్రకళ ఈ విషయాన్ని ఎవరికీ తెలియనీయలేదు.

స్నేహితురాళ్లదగ్గర గొప్పకోసం, మొగుడి కోటులోంచి వందరూపాయలు తీసి విరాళంగా యిచ్చేసింది సరోజాదేవి. ఆరోజు రాత్రి రాజారావుచే గంటన్నరసేపు మొహం వాచేటట్టు తిన్నతిట్లు (దవడమీద వో రెండు అట్లుకూడా), సరోజాదేవి తనలోనే పదిలంగా, రహస్యంగా దాచేసుకొంది.

శారదా, పాపా—యిద్దరూ విషజ్వరంలో ఒకేసారి మంచాన పడ్డారు. వాళ్లకి జ్వరం తగ్గేవరకూ వరదరాజు దగ్గరుండి సేవ చేశాడు వారం రోజులకి వాళ్లిద్దరూ తేరుకొన్నారు. వరదరాజు ఇద్దర్నీ వెంటబెట్టుకొని తిరుపతి వెళ్లివచ్చేశాడు. గుండుతో ఉన్న వరదరాజు ఎంతో అందంగా కనుపించాడు శారదకి. శారద ఈ విషయం అందరితోనూ గొప్పగా చెప్పుకొంది


క్లబ్‌లో వాళ్లు నలుగురూ బాగడ చెట్టుకింద మాట్లాడు కొంటున్నారు. 'ఈ మగవాళ్లని అర్థం చేసుకోవడం చాలా కష్టం!—' అంటోంది లీలావతి గుంభనగా. అవునన్నట్టుగా తలలూపారు మిగిలిన ముగ్గురూ. ●

ప్రొటీన్ | నికోటినమైడ్
లిపిడ్స్ | కేల్షియం
కార్బొహైడ్రేట్లు | పేంటోథెనేట్
కేల్షియం | కోలిన్
ఫాస్ఫరస్ | పైరిడాక్సిన్
సోడియం | విటమిన్ బి12
క్లోరైడ్ | ఫోలిక్ ఏసిడ్
పొటాషియం | విటమిన్ సి
ఐరన్ | విటమిన్ డి
ఐయోడిన్ | విటమిన్ ఇ
విటమిన్ ఎ | విటమిన్ కె
విటమిన్ బి1 | ట్రేస్ ఎలిమెంట్లు
రిబోఫ్లేవిన్



ASF/G/6-4

మీ శరీరానికి 23 "ఆహారాలు" ముఖ్యము



పాలలో 9 ఉన్నాయి





కాంప్లాన్‌లో మొత్తం 23 ఉన్నాయి

(ప్రోటీన్, విటమిన్, ఖనిజాలతో కలిసి)

కాంప్లాన్‌లో ఉన్న 23 పోషక పదార్థములు. అవి మీకు ఏవిధంగా సహాయపడతాయి

ప్రొటీన్	జీవాణువులను తయారుచేయుటకు మరమ్మతు చేయుటకు
లిపిడ్స్	శక్తికి ఏకాగ్ర మూలము
కార్బొహైడ్రేట్లు	శరీరము చురుకుగ పనిచేయు నిమిత్తము
కేల్షియం	ఆరోగ్యమైన పళ్లు ఎముకల వృద్ధికి
ఫాస్ఫరస్	శరీరములో ద్రవములకు, ఎముకలకు పళ్లకు అవసరము
సోడియమ్	సహజ రక్త ప్రక్రియ నిర్వహించుటకు
క్లోరైడ్	(ఎసిడ్ రూపములో) కండరములు, పనిచేయుటకు ముఖ్యము. తిమురులను అడగిస్తుంది
పొటాషియం	దీని లోపమువలన మానసిక ఉదాసీనత, కండరముల బలహీనత కలుగుతుంది
ఐరన్	(ఇనుము) ఆరోగ్యమైన రక్తము కొఱకు
ఐయోడిన్	థైరాయిడ్ సంతులితంగా పనిచేయుటకు అవసరము. దీని లోపమువలన బరువుకు సంబంధించిన సమస్యలు కలుగుతాయి. గొంతు మీద పెద్దకాయ లేస్తుంది (గాయిటర్.)
విటమిన్ ఏ	కళ్ళను ఇంకా పెదవులనుండి గర్భము వరకుగల అవయవములను కప్పిన పొరను ఆరోగ్యంగ ఉంచుతుంది
విటమిన్ బి1	పెరుగుదలకు బలమైన నరములకు బెరిబెరి రాకుండా అడ్డగిస్తుంది.
రిబోఫ్లేవిన్	నోరు, నాలుక, కళ్ళు ఈ అవయవములను ఆరోగ్యంగ ఉంచుతుంది.
నికోటినమైడ్	చర్మమును ఆరోగ్యంగ కళకళలాడుతూ ఉంచుతుంది
కేల్షియం పేంటోథెనేట్	నరములను, కండరములను ఆరోగ్యంగ బలంగా ఉంచుతాయి
కోలిన్	కార్యము ఆరోగ్యంగ పనిచేయుటకు ఇది అవసరము
పైరిడాక్సిన్ (B_6)	కండరములను సడలిస్తుంది
విటమిన్ బి12	అనీమియా (రక్తము లేమి)ను అడగిస్తుంది
ఫోలిక్ ఏసిడ్	కొత్త రక్త కణములను తయారుచేయుటలో ఉపయోగపడుతుంది
విటమిన్ సి	శరీరములో రోగ సంక్రమణను అడ్డగించు శక్తిని పెంపొందిస్తుంది స్కర్వి (లవణ రక్త వ్యాధి)ని అడ్డగిస్తుంది
విటమిన్ డి	బలమైన ఎముకలకు, పళ్ళకు
విటమిన్ ఇ	జనన సంబంధ కార్యములకు
విటమిన్ కె	మామూలుగా గడ్డలు కట్టుటకు తోడ్పడుతుంది
ట్రేస్ ఎలిమెంట్లు	శరీరము విటమిన్‌లను లోగొనుటకు గ్రంథులు ఆరోగ్యంగ పనిచేయుటకు ఇవి ముఖ్యము

ఆహార లోపములు మీకు హాని కలిగించవచ్చు. సంపూర్ణ ఆహారం కాంప్లాన్—మీ ఆహారానికి అది ఒక ఆదర్శవంతమైన సమర్థ పదార్థం మరియు భోజనానికి సరియైన ప్రత్యామ్నాయం

కాంప్లాన్ ఎలా తీసుకోవాలి

కాంప్లాన్ నీళ్లలో కలపండి మీరు కోరితే తప్ప పాలు కలపవలసిన అవసరంలేదు ఎందువలనంటే కాంప్లాన్‌లో ఇంతకు ముందే మీగడ తీయబడిన పాలు ఉన్నాయి. సాదా కాంప్లాన్‌కు మీ కోరిక ప్రకారం వాసన కల్పించండి—కాఫీ వనిల్లా, కేసిక్ వగైరాలతో (నారింజ లేక నిమ్మపండ్ల రసంతో కలుపవద్దు) కావాలంటే పంచదార వేసుకోండి

కాంప్లాన్ ఎవరు తీసుకోవాలి.

ప్రపంచమంతటా లక్షలాది సంతృప్తులైన కాంప్లాన్ వాడకందార్లలో, ఎదిగే పిల్లలు, పనితో సతమతమయ్యే పెద్దలు (ముఖ్యంగా గృహిణులు మరియు ఆఫీసుపనివారలు) గర్భిణి లేక పాలిచ్చు తల్లులు ముదుసలులు మరియు ఆటగాండ్రు ఉన్నారు.

కాంప్లాన్ సులభంగా జీర్ణమయ్యే, డాక్టరు సిఫారసు చేసే సుస్తీ సమయాలకు మరియు కోలుకొని

విశ్రాంతి తీసుకొనువారికి ద్రవాహారం

ముఖ్యంగా కడుపులో పుండ్లు విరేచనాలు, తగని విరేచనాలు లేక ఫ్లూతో బాధపడువారికి క్రొత్తగా పళ్ల వచ్చునపుడు పళ్లు లేక ఇగుళ్ల బాధలో మామూలు ఆహారం పనికిరానపుడు ఇది చాలా ప్రయోజనకరం

కాంప్లాన్ అలవాటు పొందండి. మీ శరీరాన్ని ఆహార లోపాల నుండి రక్షించండి



కాంప్లాన్®

అనగా సంపూర్ణ ఆహారము

ఆహార లోపములనుండి మిమ్ములను కాపాడుతుంది.

గ్లాక్సో
రిసెర్చి యొక్క
ప్రపంచ-వ్యాప్త ఉత్పత్తి

వారఫలం

14-1-1972 శుక్రవారం మొదలు
20-1-1972 గురువారం వరకు

మేషం: వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు. దైవకార్యాలు నెరవేరుతాయి.

వృషభం: అనవసరమైన శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిథునం: వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

కర్కాటకం: వృత్తిలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. సాటివారితో మాటపట్టింపులు తగవు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో ఆందోళన కలుగుతుంది. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

సింహం: వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. ఇతరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. ప్రయాణాలు వాయిదా పడతాయి. వారం ఆఖరులో ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య: మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందక పోవడం వలన శ్రమకు గురి కాగలరు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

తుల: వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు— దైవకార్యాలు నెరవేరతాయి. అనుకూల వార్తలను వింటారు.

వృశ్చికం: అన్ని వ్యవహారాల్లోనూ మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో ఆదాయం అధికంగా ఉంటుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

ధనుస్సు: వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మకరం: మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం: రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వారం మధ్యలో ఆకస్మికంగా శ్రమకు గురికాగలరు. వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు తిరిగి బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మీనం: అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో అధికవ్యయం జరుగుతుంది. ప్రయోజనం లేని శ్రమకు గురి కాగలరు.


స్త్రీలకు— దైవకార్యాలు నెరవేరతాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

—మహేష్


రోజు కొక చెంచా-
శక్తిని వృద్ధిచేస్తుంది
SYRUP
MINADEX
GLAXO
మంచి కను దృష్టి:
సిరప్ మినాడెక్స్‌లో విటమిన్ ఏ కలదు.
కంటి యొక్క దివ్యమైన దృష్టి కొరకై
రోజుకు 1 చిన్న చెంచాడు సిరప్
మినాడెక్స్ చాలును.
ఆరోగ్యకరమైన రక్తం:
సిరప్ మినాడెక్స్‌లో ఐరన్ కూడ గలదు.
భారతదేశంలో అత్యధికులు (80%) ఐరన్ లోపించిన
ఆహారం భుజిస్తున్నారు. కావున 1 చిన్న చెంచాడు సిరప్
మినాడెక్స్ అతి త్వరగా ఆ లోపాన్ని నింప గల్గుతుంది.
దృఢమైన ఎముకలు:
సిరప్ మినాడెక్స్‌లో విటమిన్ డి కూడ గలదు. ప్రతి రోజూ
1 చిన్న చెంచాడు సిరప్ మినాడెక్స్ తీసుకొన్నచో
ఎముకలకు మంచి దృఢత్వమును కలుగజేస్తుంది.
గుర్తుంచుకోండి. రోజూ 1 చిన్న చెంచాడు నారింజ సువాసనగల
మినాడెక్స్ బిడ్డకు మూడంతలు ఆరోగ్యరక్షణ నిస్తుంది.
సిరప్
మినాడెక్స్®
గ్లాక్సో
ఒకే చెంచాలో మూడు గుణములుగల టానిక్
CMGM-4.244 Tel

సీరియల్

పిల్లలతో ప్రేమయాత్ర



పరిమళా సోమేశ్వర్

జరిగిన కథ

కాంతారావు పెళ్ళయిన దగ్గర్నుంచి హనీమూన్‌కి వెళ్ళాలనుకుంటున్నాడు ఇద్దరు పిల్లలు కలిగినా అతని ఆశ తీరలేదు. అనుకోకుండా వచ్చిన డబ్బుతో పిల్లలతోసహా ప్రేమయాత్రకి బయల్దేరి తీరాలి అనుకున్నాడు. అతని కోరిక కళ్యాణిని మొదట్లో ఆశ్చర్యపరిచినా — ఆ ప్రయాణం ఆమెకి ఆనందమే. బయల్దేరదామంటే బయల్దేరదామనుకున్నారు వారి మొదటి మజిలీ తిరుపతి దైవదర్శనం అయ్యాక కాళహస్తి వెళ్ళారు. ఆ తర్వాత ప్రయాణం కంచికి మొత్తం మీద, కంచి చేరుకునే వరకు వారి యాత్ర ఆనంద భరితంగానే వుంది,

9

కంచిలో బస్సు దిగగానే కూలీలందరూ ప్రయాణీకులను చుట్టుముట్టేరు. అందులో అంతా అరవమే మాట్లాడుతున్నారు. ఏ ఒకరిద్దరో తెలుగు వాళ్ళలా కనిపిస్తున్న యాత్రికుల దగ్గరకు వెళ్ళి స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడుతుంటే కళ్యాణి వాళ్ళవంక ఆశ్చర్యంగా నోరు తెరచుకుని చూస్తూ నిల్చుంది. ఆమె యింకా ఆ ఆశ్చర్యంనుండి తేరుకోకముందే ఓ యిరవై సంవత్సరాల యువకుడు కాంతారావు దగ్గరకువచ్చి 'రండయ్యగారూ! రండి. రిక్షా ఎక్కుతారా? ఏ హోటల్కుకి తీసుకుపోవాలి?' అనడిగాడు స్వచ్ఛమైన తెలుగు ఉచ్చారణతో. 'మనం యాత్రికులమన్న విషయం మన మొహాలమీద వ్రాసినట్లే మాట్లాడుతున్నాడు వీడు. పైగా మనం తెలుగువాళ్ళ మనికూడా వీడు యిట్టే గ్రహించేడు. వృత్తిరీత్యా కలిగిన జీవితానుభవమే వీళ్ళకు మనుసులను చదివే శక్తిని అనాయాసంగా యిస్తుంది కాబోలు. సైకాలజీలో డాక్టరేట్ సంపాదించిన వ్యక్తుల విజ్ఞానం ఎందుకు పనికివస్తుంది వీళ్ళముందు?' అనుకున్నాడు కాంతారావు.

రిక్షా ఎక్కికూర్చుని హోటలు పేరు చెప్పేడు కాంతారావు.

రిక్షా కదలగానే రిక్షా తొక్కుతున్న అతను హుషారుగా రకరకాలు కబుర్లు చెప్పసాగేడు.

బస్సు ప్రయాణంలో అలసిపోయి ఉండటం వల్ల కాంతారావు, కళ్యాణికూడా ఆసక్తిగా విన్నారు అతని మాటలు. కంచిలో చూడవలసిన ప్రదేశాలను, ఆయా దేవాలయాల్లోని ప్రత్యేకతను ఎంతో చమత్కారంగా వర్ణించి చెప్పేడతను.

మధ్యలో ఉన్నట్టుండి 'అన్నట్టు మీరు చెప్పిన హోటలు పేరేమిటండీ?' అనడిగేడు.

కాంతారావు చెప్పేడు కొంచెం ఆశ్చర్యపోయి.

'ఎందుకండీ ఆ హొటలు? చాలా ఖరీదైనది. మీరు పిల్లలు గలవాళ్ళు. 'లక్ష్మి హొటలు' అని ఉందండి. అది 'మన' తెలుగువాళ్ళదే! చక్కని తెలుగు భోజనం సరసమైన ధరకు దొరుకుతుంది. మెత్తని పరుపులమీద మూడురూపాయిలకే హాయిగా పడుకోవచ్చు' అన్నాడు

దాంతో కాంతారావు మనసులో ఉన్న కాస్త అనుమానం దృఢపడి పోయింది ప్రతి రిక్షావాడికీ ఏదో ఒక హొటలు యజమానితో లాలోచీలుంటాయని, కనుక కమిషన్‌కోసం ఆ రిక్షావాళ్ళు యాత్రికులకు మాటలలో మంతంవేసి ఆ హొటలుకే తీసుకు పోతారనీ, కనుక రిక్షావాళ్ళ మాటలు నమ్మి ఏచెత్త హొటలుకో పోవద్దని, తాను చెప్పిన హొటలు చాలా మంచిదనీ, కాస్త ఖరీదెక్కువయినా వేణ్ణీళ్లతో సహా అన్ని సౌకర్యాలూ లభిస్తాయనీ బస్సులో కంచి ప్రయాణికుడు చెప్పిన వాక్యాలు గుర్తుకు వచ్చి కాంతారావు 'ఈ సన్నాసి నాకే టోకరా వేద్దామనుకున్నాడు. నేను మోసపోతా ననుకున్నాడు కాబోలు, పాపం!' అని స్వగతంలో అనుకుని సైకిమాత్రం కొంచెం కరుకుగా 'నేను చెప్పిన హొటలుకే తీసుకుపోవోయ్!' సుబ్బలక్ష్మి హొటలూ వద్దు. దబ్బలక్ష్మి హొటలు వద్దు మాకు' అన్నాడు.

దాంతో రిక్షావాడు టాపిక్ మార్చేసి మరో విషయాన్ని గురించి ఏంజరగనట్లే ఎంతో సహజంగా మాట్లాడసాగేడు,

'ఊఁకొడుతూ అతని మాటలు వింటున్న కాంతారావుకి మళ్ళీ రెండు అనుమానాలు కలిగిన్నయ్ ఒకటేమంటే బస్సుస్టాండుకు హొటలుదగ్గరే ఉందని తెలియటంవల్ల, హడావిడిలో రిక్షాకి డబ్బులెంత యివ్వాలో మాట్లాడనేలేదు. మహా అయితే అర్ధరూపాయికన్న ఎక్కువ అడుగుతాడా, ఏమన్నానా అని సరిపెట్టుకున్నాడు రెండో విషయం—బస్సులో కలసినతను హొటలుకి ఐదునిమిషాల్లో పోవచ్చు రిక్షాలోనైతేనని చెప్పేడు, ఇప్పటికి తాము రిక్షాలో కూర్చుని పది నిమిషాలు దాటుతోంది. అంటే తిప్పవలసిన సందులన్నీ తిప్పి ఎక్కువదూరం తొక్కినందుకు ఎక్కువడబ్బు వసూలు చెయ్యాలని కాబోలు వీడిప్పాను! అను

కున్నాడు. మళ్ళీ వెంటనే 'రూపాయి తీసుకున్నా పోయిందేమీలేదు కాని అసలే మనకీ ఊరు కొత్త. వాడీ సందులు గొందులన్నీ త్రిప్పి ఏ చీకటి సందులోకో తీసుకుపోయి రవుడీ ఫ్రెండ్సుచేత తమని చిత్తుగా తన్నించి, కళ్యాణి నగలను, తమ బాగ్ లోని డబ్బు, అన్నీ తీసుకుని మాయమైపోతే తమ గతేంకాను?' అన్న ఆలోచన వచ్చి, భయంతో ముచ్చెమటలు పోసి నరాలు బిగుసుకు పోకముందే రిక్షావచ్చి హోటలు ముందు ఆగింది.


'హమ్మయ్య!' అంటూ గాలిపీల్చుకున్నాడు కాంతారావు.

హోటలు యజమాని దగ్గర ఎడ్వాన్సు చెల్లించి, రూము మాట్లాడుకున్నాక రిక్షావాడు సామానంతా తెచ్చి రూములో పెట్టేడు. కాంతారావు తమ కుటుంబాన్ని సురక్షితంగా హోటలుకి చేర్చేడన్న సంతోషంతో రూపాయిన్నర యిద్దామని బాగ్ తెరుస్తుండగానే రిక్షా అతను రెండు చేతులతోనూ దణ్ణంపెట్టి 'ఉంచండి బాబూ! ఉంచండి. రేపు ఉదయం ఎటుపడీ మిమ్మల్ని గుళ్ళోకి తీసుకుపోవటానికి రిక్షా కావాలికదా. నేనే వస్తాను. మీకు ఊరంతా చూపిస్తాను. ఆ తరువాత మీ దయ ఉన్నంత యివ్వండి, రేపు ఏడు గంటలకల్లా రెడీగా ఉండండి బాబూ!' అని వెళ్ళిపోయేడు.

కాంతారావు బిత్తరపోయి నిల్చున్నాడు: 'టు బిలీవ్ ఆర్ నాట్ టు బిలీవ్?' అన్న డైలాగులో పడిపోయి.

తరువాత మామూలుగా అందరూ వేడి నీళ్ళ స్నానంతో వంటి మురికిని వదిలించుకుని, వేడి భోజనంతో (హోటలు వాళ్ళు పొద్దుటి పదార్థాలనే రాత్రిపూట వేడిచేసి పెడ్తారన్న దృఢమైన నమ్మకాన్ని సడలించుకోవటానికి నానా అవస్థా పడింది కళ్యాణి ఆ సమయంలో) కడుపులోని ఆకలిని చల్లార్చుకుని మంచాలమీద వాలేరు. వాలిన కొద్ది నిమిషాల్లోనే పిల్లలిద్దరూ గాఢనిద్రలో మునిగిపోయేరు.

కాంతారావు వెల్లకిలా పడుకుని ఒక



చేతిని తల క్రిందపెట్టుకొని, మరో చేత్తో కళ్ళు మూసుకుని కళ్యాణి తన దగ్గరకు వచ్చేక్షణంకోసం ఎదురు చూస్తూన్నాడు. అలా పడుకున్న కాంతారావుకి కాళ్ళమీద ఏదో మెత్తని స్పర్శ, తగిలేసరికి ఉలికిపడి ముఖంమీది చెయ్యితీసేసి చూసేడు.

కళ్యాణి మృదువుగా అతని పాదాలను వత్తుతోంది తల వంచుకుని.

అప్పటి ఆమె ఆకారం చూసేసరికి నవ్వొచ్చింది కాంతారావుకి 'తెలుగుసినిమా పతివ్రతలా ఏమిటీ వేషాలు ? ఇంక చాల్లేరా ! నాకు నిద్రవస్తోంది.' అంటూ కుడిచెయ్యి చాచేడు ఆమెకోసం.

కళ్యాణి కదలలేదు. తల వంచుకుని అలాగే అతని పాదాలనుండి కాళ్ళవరకు ప్రేమగా నిమరసాగింది మౌనంగా.

'ఏమిటివ్వాళ మొగుడిమీద అంతభక్తి పుట్టుకొచ్చింది అమ్మాయి గారికి !' అన్నాడు.

కళ్యాణి ఓసారి కాంతారావు వంక తలెత్తి చూసింది. కాని యేమీ మాట్లాడ లేదు.

ఆమె అతనివంక చూసింది ఒక్కక్షణం మాత్రమే ! కాని ఆ క్షణకాలంలోనే ఆమె చూపు అతని రెటీనాను దూసుకుపోయి, హృదయం లోతులను దాటుకుంటూ ఏదో ఒక అపూర్వమైన అతనిలోని ఆత్మ తాలూకు అలౌకికమైన భాగాలను స్పృశించి, అతనిని పరవశింప జేసింది.

పెళ్లికాక ముందుకూడా కాంతారావును ఆమెలో విపరీతంగా ఆకర్షింప జేసింది కళ్యాణి కళ్లే ! ఆమె కళ్ళలో అందం, ఆకర్షణ మాత్రమేకాక, మాటల కందని మరేదో మహత్తరమైన సౌందర్యం ఉంది. ఆ కళ్ళు ఒక సమయంలో పసిపాప కళ్ళలా అమాయికంగా కనపడతయ్. మరుక్షణం లోనే 'ఎక్స్‌రే' లాగా ఎదుటి మనిషి అంతర్యపు లోతులలోకి నిశితంగా దూసుకు పోగలవు. ఒక సమయంలో శృంగారాలను చిలికించే ఆ కళ్ళు మరో సమయంలో తపస్విని నేత్రాలలా ఏవో అలౌకికానందాల అన్వేషిస్తున్నట్లు వెలిగిపోతయ్. మరోసమయంలో అమాయకత్వమో, సిగ్గో, ప్రేమో, సుభావమో. వైరాగ్యమో, విరహమో ఏదో తెలియని విచిత్రమైన భావం కదలాడుతుంటుంది ఆమె కళ్ళల్లో. ఇప్పుడు అతని వంక చూసిన కళ్ళల్లో 'అదే' భావం ఉంది.

ఆ సమయంలో కళ్యాణి తనకంత దూరంగా, తనకంటె దూరంగా తనకంటె భిన్నమైన వ్యక్తిగా ఉండటం సహించలేక పోయేడు కాంతారావు. ఆమె శరీరాన్ని, మనసునీ, ఆత్మనీ అన్నిటినీ తనలో లీనం చేసుకుని, ఆమే తానుగా, తానే ఆమెగా మారిపోవాలనిపించిందతనికి.

'కళ్యాణి ! ఇలారా ! ఒక్కసారి నా గుండెమీద తలానించి పడుకో ! నేనీ దూరాన్ని భరించలేను.' అన్నాడు జీర వోయిన కంఠంతో కాంతారావు అలా అంటూ ఆమె ఒళ్ళోఉన్న తన పాదాలను యివతలకు లాక్కున్నాడు.

కళ్యాణి ఆ పాదాలను తన రెండుచేతుల తోనూ పట్టుకుని గుండెకు ఆనించుకుంది. తరువాత కాసేపు వెర్రిగా వాటిని ముద్దుపెట్టుకుంది. 'ఊహుం, తీయకండి. ఈ పాదాల నిక్కడే ఉండనివ్వండి. నాకిక్కడనుండి కదల బుద్ధికావటం కాలేదు ' అన్నది '

కాంతారావు ఏదో మాట్లాడ బోయేడు. కాని ఏదో విపరీతమైన ఉద్వేగంవల్ల అతని కంఠం పెగిలిరాలేదు.

కళ్యాణి అంది. 'ఇలా మీ పాదాల దగ్గర కూర్చుంటే నా మనసుకు ఎంత శాంతిగా ఉందో తెలుసా? నేను భగవంతుణ్ని నమ్మనని మీకు నామీద కోపం. కాని నిజానికి మిమ్మల్ని మించిన భగవంతుడు నాకెవ్వరున్నారు ? ఆ గుళ్ళల్లో పొందలేని మనశ్శాంతిని మీ హృదయంమీద వాలినపుడు పొందగలుగు తున్నాను.

ఏ దేవుని పాదాల స్పర్శకూడా యివ్వని అలౌకానందాన్ని మీ పాదస్పర్శ నాకు లభింపజేస్తోంది. ఇలా మాట్లాడుతుంటే మీకు 'సిల్లీ'గా అనిపిస్తోందా? ఔను మీకలాగే అనిపించవచ్చు. దైవం ఎక్కడో లేదు. మనుషుల్లోనే ఉన్నాడు. భార్య దైవాన్ని భర్తలోనే చూసుకుంటుంది. తల్లిగా తన పిల్లలలో చూసుకుంటుంది. చిన్నతనంలో తల్లిదండ్రులలో దైవాన్ని చూసుకుంటుంది. ఎక్కడ స్వార్థానికి అహానికి అతీతమైన అనుబంధం ఉందో అక్కడే దేవుడుంటాడు. ఈ క్షణంలో మీకంటె అధికంగా ప్రేమించేవ్యక్తి నాకెవ్వరూలేరు. అందుకే మీ పాదాల దగ్గర కూర్చోవాలనీ, మీ భక్తురాలిగా మీలో లీనమై పోవాలనీ నాకనిపిస్తోంది.' అంటూ కళ్లనీళ్ళు కార్చసాగింది కళ్యాణి.

కాంతారావు చటుక్కున లేచి కూర్చుని కళ్యాణిని తన ఒడిలోకి తీసుకున్నాడు. 'పిచ్చి కళ్యాణి ! ఎందుకలా ఏడుస్తావ్ ? నీ మనసు నా కర్థమయింది. మనిద్దరం ఒకరినొకరం ఎంతగా ప్రేమించుకుంటున్నామో, ఒకరికి మరొకరి అవసరం ఎంత ఉన్నదో యీ ప్రయాణంలో నాకర్థమయింది కళ్యాణి ! ఇంట్లో ఉన్నన్నాళ్ళూ మామూలు భార్యాభర్తల్లా మెలగుతున్న మనలోని ప్రేమ నివురుగప్పిన నిప్పులాగా ఉండిపోయింది. ఇలా బయటి ప్రపంచంలోకి వచ్చి, వ్యక్తులుగా ఒకరినొకరం పరిశీలించుకుంటుంటే మన మధ్య గల అనుబంధం ఎంత గాఢమైనదో ఎంత పవిత్రమైనదో మనకి తెలిసి వస్తోంది. ఏడవకు కళ్యాణి ! ఏడవకు. సరీగ్గా నా మనసులో నేనేమనుకుంటున్నానో అదేభావాన్ని మాటల రూపంలో వెల్లడించేవు నువ్వు' అంటూ ఆమెను గాఢంగ తన హృదయానికి హత్తుకున్నాడు

ఆ సమయంలో వారిరువురి ఆత్మలు శారీరకాకర్షణల కతీతమైన అనుబంధంతో ఒకదానినొకటి పెనవైచుకు పోయినయ్.

* * *

ఉదయం ఆరుగంటలకు లేచి, ఆదరా బాదరా కాలకృత్యాలన్నీ తీర్చుకుని ఏడు గంటలకు రెడీగా ఉందామను కుంటూండగానే రిక్షా అతను వచ్చి గుమ్మాని కెదురుగా నిల్చున్నాడు. అతనిని కాసేపు ఆగమని క్రిందికి వెళ్లి అదే హోటలులో టిఫిను, కాఫీ తాగేరు. అక్కడ పదినిమిషాలలో పూర్తవపలసిన పనికి పిల్లల హంగామా మూలంగా అరగంట పట్టింది.

మెత్తగా ఖరీదుగా ఉన్న ఆ సోఫాల మీద కుదురుగా కూర్చోమంటే బాబీ డు కూర్చోనేలేదు సోఫాలు పెద్దవిగా ఉండటం వల్ల కూర్చున్నపుడు క్రిందికి సగభాగం వ్రేలాడుతున్న కాళ్లు నొప్పులు పుట్టటం


తెలివైన వారే! A-1 డస్ట్-
ప్రశస్తమైన, పటుత్వమున్న టీ
మీరు కొన్నారే. మీ భార్య
సంతోషిస్తుంది
కాస్త ఆగి చూడండి
Brooke Bond Tea
Brooke Bond
A-1 Dust Tea
బ్రూక్ బాండ్ A-1 డస్ట్
ప్రతి ప్యాకెట్టుకు
హెచ్చు కప్పుల మంచి టీ

వల్ల వాడు సోఫామీదనే కాళ్ళు పెట్టుకుని కూర్చుంటానని అంటాడు. వోవక్క వాడి వాదన సమంజసమేనని తెలిసినా, సోఫామీద బూట్లకాళ్లతో కూర్చుంటే చుట్టూ ఉన్న మిగతావాళ్లంతా తమ అనాగరికతను చూసి ఎక్కడ అసహ్యించుకుంటారోనని కళ్యాణి భయం. అందువల్ల సరిగ్గా కూర్చోమని బాబిగాడిని నయానా భయానా నచ్చచెప్పి జూసి, వాడు మాట వినక పోయేసరికి ఆ కోపాన్ని పైకి కక్కలేక, లోపలికి మ్రింగలేక ఉక్కిరిబిక్కిరయ్యింది కళ్యాణి.

చివరకు వీళ్ళు ఫలహారాలు ముగించుకుని ఎయిర్‌కండిషన్డు 'డీలక్సు రెస్టారెంటు'లో నుండి బయట పడేసరికి కళ్యాణికీ, కాంతారావుకి ముచ్చెమటలు పోసినయ్. పిల్లలు తిని మూతి కడుక్కోవటంవల్ల ముఖంలోని క్రిందిభాగం నల్లగా పైభాగం పౌడరుపూతతో తెల్లగా ఉండేసరికి వాళ్ల అవతారాలు చూస్తూనే కళ్యాణికి తిక్కరేగింది. వాళ్లను మళ్లీ రూముకు తీసుకువెళ్లి పౌడరు వ్రాసి, వస్తానంటే కాంతారావు వద్దని వారించేడు.

'ఆ పైభాగంకూడా నీచేతి రుమాలుతో తుడిచెయ్యి దాంతో నీ పిల్లలు సహజ సౌందర్యం బయట పడుతుంది. అంతేకాని యిప్పుడు కనుక వాళ్లను మళ్లీ ముస్తాబు చెయ్యటం ప్రారంభించేవంటే మరో అరగంట పట్టవచ్చు. ఇప్పటికే రిక్షావాడికి ఎదురుచూసి చూసీ విసుగు పుట్టి ఉండవచ్చు' అన్నాడు

కళ్యాణి మాట్లాడకుండా అట్లాగే నడిచింది పిల్లలను వెండబెట్టుకుని. అంతా రిక్షాలో కూర్చున్నారు.

ఇద్దరు పిల్లలతో రిక్షాలో యిరుకుగా కూర్చోవటం ఆ దంపతులకు బాధనిపించక పోయినా బాబిగాడిని మాత్రం మహాచిరాకు వరిచింది. 'నాన్నా! యీ రిక్షా బాగా లేదు. టాక్సీలో పోదాం' అన్నాడు.

మొగుణ్ణి దెప్పటానికి మంచిసమయం దొరికిందనుకుని కళ్యాణి 'చూసేరా! చిన్న పిల్లడికున్నపాటి బుర్రన్నా లేక పోయింది మీకు' అన్నది

'బోడిసలహాలు నువ్వునూ పోవోయ్. ఆసంగతి నాకూ తెలుసులే! టాక్సీలోనైతె ఐదు నిమిషాల్లో తీసుకుపోతాడు. రిక్షాలో

పిల్లలతో ప్రేమయాత్ర

అయితే మెల్లగా వెళ్తూ ఊరంతా సావకాశంగా చూడవచ్చు' అన్నాడు తనని తాను సమర్ధించుకుంటూ.

వెంటనే రిక్షావాడు అందుకుని 'ఔను బాబూ! మీరన్నది కరెక్టు. మిమ్మల్ని ఊరంతా తిప్పి చూపిస్తున్నాను అన్నట్టు అమ్మగారు మరి పట్టుచీరేమయినా కొనుక్కుంటారా? కావాలంటే బట్టలు షాపుల్లోకి కూడా తీసుకుపోతాను. ఇంతదూరం వచ్చి, కంచిపట్టుచీర కొనుక్కోకపోతే ఎలా బాబూ?' అన్నాడు.

కళ్యాణి భర్తవంక ఆశగా చూసింది 'నాకోపట్టుచీర కొని పెట్టరూ?' అన్నట్టు.

'అలాగే — కొనిపెడ్తాలే!' అన్నట్టు తలూపేడు కాంతారావు.

దాంతో కళ్యాణి మనసు తాము ముందు దర్శించబోయే దేవుళ్లకన్న ఆతరువాత కొనబోయే కంచి పట్టుచీరని గురించే కలలు కనసాగింది.

'మా కాంతం చాలా మంచివాడు. నేనే మడిగినా కాదనడు' అనుకుంది గర్వంగా.

ముందు రిక్షా 'శివకంచిలో ఆగింది అక్కడ అమ్మవారిగుడి, పరమేశ్వరుని ఆలయం ముఖ్యంగా చూడదగినవి. అన్నిటికన్న శివకంచిలోని ప్రత్యేకత యేమంటే ఆ దేవాలయ ప్రాంగణంలో నున్న ఒక మామిడిచెట్టు వయస్సు రెండు వేల సంవత్సరాలపైగా ఉందిట, అలా అని ఆ చెట్టుమీద అరవంలో వ్రాసికూడా ఉంది.

'అది వ్రాసి ఎన్నివేల సంవత్సరా లయిందో!' అన్నది కళ్యాణి. కాంతారావు పకపక నవ్వేడు.

ఆలయం చాలా విశాలంగా, ఎత్తుగా ఉంది. అసలు దైవాన్ని దర్శించబోయే ముందు మరెన్నో దేవుళ్లు ఎదురైనారు. ఒక్కొక్క గుళ్లోను ఒకపూజారి నిల్చుని భక్తులకు హారతి యిచ్చి పైసలకోసం వళ్ళెం జాపుతున్నాడు ఆ పూజారులలో చాలామంది అరవవాళ్ళే. అయినా తెలుగు వాళ్ళు కూడా తక్కువ మందేమీలేదు

అందులో ఒకాయిన వీళ్ళను చూస్తూనే తెలుగు వాళ్ళని గ్రహించి 'మీదే ఊరండీ?' అనడిగాడు. కాంతారావు చెప్పేడు.

ఆ పూజారి ముఖంలో ఏదో దీనత్వం ఉన్నట్టు కనిపించి, తనకు తెలియకుండానే తనకాళ్లు బంధించివేయగా, ఆగి 'మీదే ఊరండీ? మీరు తెలుగువాళ్లలా ఉన్నారు.' అన్నాడు.

'మాది కాకినాడ. ఎన్నో సంవత్సరాల క్రితం మా నాన్నగారు యిక్కడకు వచ్చి యీ గుళ్లో పూజారిగా ఉన్నారు ఆయన పోయిన తరువాత నేనుకూడా యిక్కడే చేరేను. తెలుగుదేశం చూసి ఎన్నాళ్ళయిందో! మన తెలుగువాళ్ళెవరయినా వస్తే మనసారా తెలుగులో మాట్లాడి మంచి, చెడ్డా అడగాలని పిస్తుందండీ!' అన్నాడు.

ఎందుకో అతని మాటలు వింటుంటే కళ్యాణి, కాంతారావుల గుండెలు కలుక్కు మన్నయ్ ఎక్కడున్నా, ఏం చేస్తున్నా మానవుడు జననినీ, జన్మభూమిని మర్చి పోలేడు గదా! అనిపించింది

ఇతనిలాటి మనుషులు చాలామంది ఉన్నారు. ఒక రాష్ట్రంవాడు మరో రాష్ట్రానికి, ఒకదేశంవాడు మరోదేశానికి పొట్టకూటికోసమో, వ్యాపారరీత్యానో ఎందుకో ఒకందుకు పోతారు అక్కడే స్థిరపడిపోయి పూర్తిగా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. కాని అప్పుడప్పుడు ఏ కొందరు వ్యక్తులో తారసపడినపుడు, ఏ సంఘటనో జరిగినపుడు, మనసు గతంలోకి పరుగిడుతుంది. పాతవాసనలు మనిషి నుక్కిరిబిక్కిరి చేస్తయ్. జ్ఞాపకాలు కన్నీళ్ళను కురిపిస్తయ్! వెంటనే తమాయించుకుని మరల మామూలు జీవితాన్ని ప్రారంభిస్తారు

కళ్యాణి, కాంతారావు తిరిగి వస్తుంటే కొంతసేపటివరకు, దీనంగా, ఆకలిగా, ఆర్తంగా ఉన్న ఆ పూజారి కళ్లు రెండూ వారిని వెన్నంటి వస్తున్నట్లే అనిపించింది.

తరువాత విష్ణుకంచికి తీసుకుపోయింది రిక్షా. శివకంచికంటె చాలా పెద్దది విష్ణు కంచి:

'శివుడు, విష్ణువు ఒకేఊళ్లో కొన్ని మైళ్ల దూరంలో ఉన్నారంటే, ఒకప్పుడు శైవులు, వైష్ణవులు అనబడేవాళ్ళ బుర్రలు ఎన్ని బ్రద్దలయి ఉంటాయో ఊహించుకోవచ్చు.' అన్నది కళ్యాణి.

మిక్కిలి సరసమైన ధర కలిగిన డిటర్జెంటు బిళ్ల



శ్రీమతిగారూ, ఇదిగో మీకోసం బోనస్

బోనస్ నిజమైన బోనసు. బోనస్‌లో ఉతుకుడు శక్తి బాగా నిండి ఉన్నది. అందు చేత తక్కువ బోనస్, తక్కువ శ్రమతో ఎక్కువ బట్టలను అత్యంత తెల్లగా, కాంతివంతముగా ఉండేటట్లు ఉతకవచ్చును. బోనస్ ఎటువంటి నీటిలోనైనా సరే అమితమైన నురుగు నిస్తుంది. ఎందువల్లనంటే బోనస్ ఉత్తమంగా ఉతికే డిటర్జెంటు—సబ్బు కాదు.

ఉత్తమ ఫలితాలకు, బట్టలను బాగా నాన బెట్టండి. ఉపయోగించిన తరువాత బోనసును పొడి ప్రదేశంలో ఉంచండి.

బట్టలను అత్యుత్తమంగా ఉతకటానికి నేడే వాడండి



టాటా ఉత్పత్తి

బోనస్

—ప్రశస్తమైన డిటర్జెంటు

CMTB-S-244 TEL

'ఇప్పుడు మాత్రం అలాటి సంఘటనలు జరగటంలేదని గ్యారంటీ యేమిటిలే!' అన్నాడు కాంతారావు

'జరగవని గ్యారంటీగా చెప్పగలను నేను. ఎందుకో తెలుసా ? ఇప్పుడు హిందూ భక్తులకు దైవంమీద భక్తి చచ్చిపోయి, డబ్బుమీద భక్తి జాస్తి అవుతోంది. ఎవడికివాడు యాత్రికుల దగ్గర ఎలా డబ్బులు గుంజకోవాలో చూస్తారే తప్ప ఏదేముడు గొప్పయితే మనకేం ఒరిగిందిలే అన్న మనస్తత్వం వారికి వచ్చేసింది పూజారిగా ఉండదలచుకున్న వాడికి విష్ణుకంచిలో ఉంటేనేం, శివకంచిలో ఉంటేనేం! రెండింట్లో ఉన్నవి రాతివిగ్రహాలే! అవి ఉలకవు పలకవు. కనీసం కనికరమన్నా చూపవు యాత్రికుల కనికరం ఉంటే చాలు వాళ్లకి' అన్నది కళ్యాణి.

'ఈ రోజుల్లో దేవుళ్లపార్టీలు పోయి రాజకీయ పార్టీలు, సినిమా హీరోల పార్టీలు ప్రారంభమై ప్రజలు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారులే!' అన్నాడు కాంతారావు.

విష్ణుకంచిలో వరదరాజస్వామి ఆలయం విశిష్టమైనది. ఎన్నో అడుగుల ఎత్తున విష్ణుమూర్తి విగ్రహాన్ని కర్పూరహారతి వెలుగులో చూసి చకితులయ్యారు భక్తులంతాను.

ఆ ఆలయం చాలా పెద్దది శివకంచిలో కంటేకూడా విష్ణుకంచిలోని దేవుళ్ల సంఖ్య చాలా ఎక్కువగానే ఉంది ముక్కోటి దేవతలూ అక్కడే వెలిసేరా అనిపిస్తోంది.

అందులో పౌరాణిక గాథలకు సంబంధించిన విగ్రహాలు చాలా ఉన్నయ్.

వాటిలో దూర్వాసముని విగ్రహం కూడా ఉంది. దాన్ని చూసి కళ్యాణి 'అదుగో మీ అన్నయ్య!' అంది మొగుణ్ణి మోచేత్తో పొడుస్తూ

'ఇంతమంది విగ్రహాలను ప్రతిష్ఠించేరు కాని, మీ చెల్లెలు విగ్రహాన్ని పెట్టటం మర్చిపోయే రెందుకనో!' అన్నాడు కాంతారావు.

'ఎవరేమిటి మా చెల్లెలు?' కొరగా, ఓరగా చూసింది కళ్యాణి.

'శూర్పణఖ!' అంటూ ఫక్కున నవ్వేడు కాంతారావు.

తామున్న ప్రదేశాన్ని కూడా మర్చిపోయి

పిల్లలతో ప్రేమయాత్ర

కళ్యాణి మొగుడి చెవి మెలేసి, వెంటనే నాలుక కొరుక్కుని చుట్టూ చూసింది. 'వెంకట సుబ్బలక్ష్మి టూరిస్టు సర్వీసు' భక్త బృందం బిలబిలమంటూ ఆలయం లోకి ప్రవేశిస్తుంటే 'అదుగో నండోయ్, మన ఫ్రెండ్సుకూడా వచ్చేసేరు' అంటూ కిలకిల నవ్వింది కళ్యాణి

'ఇంకేం మనకి మీచేతి జోరు రుచి చూసే భాగ్యం తప్పిపోయింది' అన్నాడు చెవిని సవరించుకుంటూ కాంతారావు.

అక్కడున్న గుళ్లన్నీ ఎంత చీకటిగా ఉన్నాయంటే ఒక్కొక్కప్పుడు పూజారి గర్భగుడిలోనుండి వచ్చి హారతి పళ్లెం కుంకుమ

సంక్రాంతి శోభ

వచ్చెను పువ్వుల సంక్రాంతి!
తెచ్చెను నవ్వుల నవకాంతి!

పూవుల తావులు, పొందిక పీరగ,
పైరుల సౌరులు, మురిపెము గూర్పగ,
పంటలు కంటికి, పండుగసేయగ,
ఇంపుగ నిండ్లకు సొంపులునింపగ—వచ్చెను.

నింగిని దాకెడి రంగులమంటలు
హేమంతమ్మున హారతులోయన,
బంగరు పంటల సింగారింపగ,
భోగి,కనుమతో,వేగమె యిండ్లకు—వచ్చెను.

తలపు తీవియలు అలరుల విరియగ,
వలపు వీచికలు వాంఛలరేపగ,
చల్లని గాలులు మెల్లగ వీవగ,
ఉల్లము లూయల లూగుచునుండగ—
వచ్చెను.

గుమ్మడి పువ్వులు గొబ్బియతలపై,
ముంగిట నవ్వుల మురియుచునుండగ,
రంగుల ముగ్గులు, తంగెడు నిగ్గులు,
బంతుల కాంతులు వింతగ వెలయగ—
వచ్చెను.

సస్యసమృద్ధిని సంపదలీయగ,
పల్లెలు, పురములు, పిల్లలు, పెద్దలు,
సంబరాలలో సంతసమొందగ,
నిచ్చలు గృహములు పచ్చగనుండగ—
వచ్చెను.

— సురభి నరసింహము

తీసుకుని బయటకు వచ్చేదాకా అక్కడ మనుషులున్న జాడే తెలియటం లేదు. 'పూర్ ఫెలోస్! ఎలా ఉండగలుగుతున్నారో ఈ గుహల్లో! ఇంకా ఆదిమానవుడి మనస్తత్వం పోలేదు భారతీయులకు. ఎంతసేపూ చీకటి గుహల్లో రాళ్ళ రప్పల మధ్య పడి ఉందామనుకుంటారే తప్ప వెలుగులోకి రావాలంటే చచ్చేభయం వీరికి' అనుకుంది కళ్యాణి మనసులో కాని ఆమాట పైకి మాత్రం భర్తతో అనలేదు.

కోట్లాది ప్రజలు ఒక పిచ్చి నమ్మకంలో, ప్రగాఢమైన విశ్వాసంలో పడి కొట్టుకుపోతుంటే తన హీనస్వరం ఎవరికి నచ్చచెప్పగలదు ? ఎవరిని మార్చగలదు ? అందుకే తన నమ్మకాలను అపనమ్మకాలను, అనుమానాలను, ఆవేదనలను అన్నిటినీ తనలోనే దాచుకుంటే అన్నివిధాలా శ్రేయస్కరం అనిపించింది కళ్యాణికి

ఒక్కొక్క స్తంభంమీద ఎన్నో పురాణ గాథలకు సంబంధించిన విగ్రహాలుంటే వాటిని గూర్చి వివరించసాగేడు గైడు. చివరకు ఆ బాలగోపాలానికీ అద్భుతమైన అనుభూతినిచ్చే బంగారు, వెండి బల్లుల దగ్గరకు వచ్చేరు టూరిస్టు సర్వీసు తాలూకు 'గుండు భక్తులు' చకచకా అన్నీ చూసేసి బల్లుల దగ్గరకు వచ్చేరు. వాళ్లంతా వాటిని ముట్టుకుని కళ్ల కద్దుకుని పోతున్నారు. పైన దేవాలయం కప్పు మీద బల్లులు. క్రింద చెక్కతో చెయ్యబడిన చిన్నసైజు బ్రిడ్జిలాటి ఎత్తయిన ప్రదేశం. మెట్లెక్కి బల్లులను ముట్టుకుని అలాగే రెండోవైపుగా మెట్లుదిగి క్రిందికి పోవాలి.

గుండ్లన్నీ దిగేదాకా కళ్యాణి ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడింది నోరు తెరచుకుని

కళ్యాణికి బల్లులంటే చచ్చే భయం, అసహ్యం ఈ సృష్టిలో కల్లా అతి జుగుప్సాకరమైన ప్రాణులేమయినా ఉన్నాయా అంటే అవి బల్లులేనని ఠకీమని జవాబిస్తుంది కళ్యాణి.

బల్లులంటే ఆమెకు ఎంత భయమంటే హైస్కూల్లో చదువుకునే రోజుల్లో సైన్సు పుస్తకంలో జంతుశాస్త్ర విభాగంలోని ఒక పాఠంలోని బల్లి బొమ్మను చూస్తూనే వళ్ళు జలదరించి ఆ పేజీని

వెంటనే తప్పేది. 'బల్లి గోడ మీద, యింటి కప్పుమీద అతుక్కుని ఉంటుంది. కాని క్రింద పడదు. కారణమేమి?' అన్న ప్రశ్నకు జవాబును చదవనేలేదామె. ఆ ప్రశ్న తప్పకుండా పరీక్ష పేపర్లో వస్తుందని సైన్సుమాస్టారు పదిసార్లు చెప్పినా, ససేమిరా ఆ పేజీ తెరిచి, బల్లి పాఠం చదవలేదు కళ్యాణి. మాస్టారు చెప్పినట్లే ఆ ప్రశ్న పరీక్షలో వచ్చింది. దానికి సమాధానం కళ్యాణి వ్రాయలేదు. పైగా ఆ ప్రశ్నను చూస్తూనే బల్లి గుర్తుకొచ్చి ఆ బల్లి తన శరీరం మీద ఆ క్షణంలో ప్రాకుతున్నట్లుగానే భావించి, నానా అవస్థలుపడి వో పదినిమిషాల టైమును వృథా చేసేసింది కూడా.

కళ్యాణికి బల్లులంటే అసహ్యమని కాంతారావుకు తెలుసు. కాని, ఆ అసహ్యం కంటె పదిరెట్లు భయం కూడా ఉన్నదన్న సంగతి మాత్రం అతనికి తెలియదు. అందువల్ల తమవంతు రాగానే 'ఇంక పద. త్వరగ వెళ్ళాలి మనం. ఇప్పటికే చాలా టైమయింది' అంటూ కళ్యాణిని తొందర పెట్టేడు.

కళ్యాణి కదలలేదు. కొయ్య బొమ్మలా నిల్చుండి పోయింది.

'కళ్యాణి! పదా!' అన్నాడు కాంతారావు.

'మీరు ముందు నడవండి' అంది హీన స్వరంతో—ఎలాగో గొంతు పెగల్చుకుని.

కాంతారావు ఆమె వంక చూడకుండా గబగబా ముందు నడచి వెళ్ళి బల్లులను ముట్టుకుని వెనక్కి తిరిగి చూసేడు. పాలిపోయిన కళ్యాణి ముఖం చూస్తూనే' అదేమిటి? అలా నిల్చున్నావ్?' అనడిగేడు ఆశ్చర్యంగా.

'బ్...బ్—బల్లి.. నాకు భయం. నేను ముట్టుకోను.' కళ్ళు నీళ్ళొక్కటే తక్కువ కళ్యాణికి.

ఆమె ముఖం చూస్తుంటే కాంతారావుకి నవ్వాగలేదు.

'వోసి పిచ్చిదానా! అవి మామూలు బల్లులు కాదుగా. బొమ్మలే! వాటిని ముట్టుకోవటానికి ఎందుకు భయం?' అన్నాడు ఎరగబడి నవ్వుతూ,

అతని నవ్వులో కొంత ధైర్యం కూడ దీసుకుంది కాని అప్పటికీ వాటిని ముట్టుకునేందుకు సాహసించ లేక పోయింది కళ్యాణి,

'అది కాదండీ! ఇంత పెద్ద సైజులో చూస్తుంటే ఆ బొమ్మలు నిజం బల్లుల కంటె భయంకరంగ ఉన్నాయండీ!' అంది బిక్క మొహం వేసి.

'ఆహాహా! ఏం నారీమణిరా యీవిడ. ఝాన్సీలక్ష్మి, మల్లమాంబ, నాగమ్మ వగైరా వీరనారీమణులుద్భవించిన భారత దేశంలో పుట్టిన స్త్రీయేనా యీమె? భర్తమీద కోపం వచ్చినప్పుడు భద్రకాళిలా, పిల్లల మీద కినుక వహిస్తే చిన్న సైజు సూర్యకాంతంలా మారే యీ మహిళా రత్నానికి బల్లంటే భయంట! ఇక్కడున్న భక్త బృందాన్నంతా పిల్చి యిదేమాట చెప్పమంటావా పిల్లా?' అన్నాడు కాంతారావు.

కళ్యాణిలో రోషం విజృంభించింది 'ఏం, నేను ముట్టుకోలే ననుకుంటున్నారా? పాపను మీరు తీసుకుని అవతల నిల్చోండి. ముట్టుకుంటాను' అంటూ పాపని అతని కందించింది.

కాంతారావు పిల్లలతో సహా మెట్లు దిగి అవతలకు వెళ్ళి నిల్చున్నాడు.

కళ్యాణి దడదడలాడుతున్న గుండెను చిక్కబట్టుకుని, పళ్ళు బిగపెట్టి, కళ్ళు మూసుకుని ఆ రెండు బల్లులనూ తాకి, మరుక్షణమే కెవ్వున కేకవేసి, ఒక్క అంగలో మెట్లన్నీ దాటుకుంటూ వచ్చి భర్త గుండెమీద వాలిపోయింది గజగజ వణుకుతూ.

కాంతారావు పకపక నవ్వుతూ; ఆమె బుజం మీద చరచేడు 'భేష్! భయపడ్డా, మొత్తానికి బల్లులనైతే ముట్టుకున్నావ్. నాక్కావలసిందదే!' అన్నాడు. కళ్యాణికి తల తీసేసినంత పనయింది. కాని ఏలాగైనా తన బలహీనతను కప్పిపుచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో 'మహా వీరాధివీరుడైన ఆ నెపోలియన్‌కి కూడా ఎలుక లంటే భయంట. దానికే మంటారు? ఒక్కొక్క మనిషిలో ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఎంత నిబ్బరంగల మనిషి గుండెలోనైనా ఎక్కడో ఒకచోట దుర్బలమైన భాగం ఉండక పోదు.' అంది

కాంతారావు ఆమె మాటలను వినిపించు కునే స్థితిలో లేనేలేడు. పొర్లిపొర్లి వస్తున్న నవ్వును ఆపుకుంటూనే ఉన్నాడింకా.

అది చూసేసరికి కళ్యాణికి ఒళ్ళుమండి పోయింది. అందువల్ల అతని చేతిలో నుండి పాపను లాక్కుని విస విస బయటకు నడవ సాగింది.


వాళ్ళు బయటకు వచ్చేసరికి 'గుండ్లన్నీ' అక్కడున్న ఒక పెద్ద ఏనుగు దగ్గర నిల్చు న్నారు. ఆ ఏనుగు భక్తు లిచ్చిన కానుక లన్నీ సాదర ప్రణామం చేసి స్వీకరిస్తోంది.

'ఆ ఏనుగు నెక్కుతావా?' వేళాకోళంగా అడిగేడు కాంతారావు.

కళ్యాణి నవ్వు రేఖలను పెదవులు దాటి బయటకు రాకుండా దాచేసి కళ్ళల్లో మాత్రం కోపరేఖలను కురిపిస్తూ చూసింది భర్త వంక,

అంతలోకే రిక్షావాడు వచ్చేడు వాళ్ళ దగ్గరికి.

(ఇంకా ఉంది)





✲ ఉదయం పది గంటలు కావస్తోంది.

రాజారావు భోజనం ముగించి వక్కపొడి నములుతూ వీధి అరుగు మీద నిలబడ్డాడు...ఆ తరువాత ఏం చెయ్యాలో తోచడంలేదు. ఆ వీధిలోనే కాపురం వున్న ఒకరిద్దరు ఉద్యోగులు తనుపని చేసే ఆఫీసులో పనిచేస్తున్నవారు. వారు ఆఫీసుకి గబగబా వెడుతూ అరుగుమీద నిలబడ్డ రాజారావుని చూసి ఒక్కక్షణం నిలబడి నమస్కారం చేశారు ... పలకరించారు.

రాజారావు మనసులో తెలియని వెలితి... అవమానం ..

ముఖం వెలవెలబోయింది.

తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ప్రతి నమస్కారం చేశాడు.

'వేళయినట్లుంది—త్వరగా వెళ్ళండి... మేనేజరు ఘటికుడు' అన్నాడు.

వాళ్ళు నవ్వుకుంటూ చక్కాపోయారు.

మామూలుగా అయితే తన యెదురుపడకుండా ముఖం తప్పించుకుని తిరిగేవాళ్ళు వారు. ఈ నాడు నిలబడి నమస్కరించి, పలకరించడం రాజారావుకి అవమానం భరించలేనంతగా అనిపించింది, తను పేరుకి గుమస్తాయేకాని ఆఫీసంతా ఏకచ్ఛత్రాధిపత్యంగా యేలాడు. తనకు తెలియకుండా అధికారి ఎవ్వరి విషయంలోను స్వతంత్రించి నిర్ణయించడం యెన్నడూ జరగలేదు. అలాగ జరిగిందో ... ఆ కాగితాలు ఆఫీసు దాటేవికావు. ఒక్కొక్కప్పుడు బుట్టదాఖలు అయిన ఘట్టాలుకూడా లేకపోలేదు.

అల్లాగని తను యెవరికీ ద్రోహం చెయ్యలేదు...ఎటొచ్చీ అవి తనద్వారా వెళ్ళవలసిందే. యెవరైనా ... అంతే. అలాగని లంచాలు పట్టిందీ లేదు. లోకంమాత్రం రెండు చేతులా లంచాలు పుచ్చుకున్నాడంటుంది...అదీ తన అంతరాత్మకు తెలుసు.

రాజారావు ఆలోచిస్తూ నిలబడిపోయాడు.

గత సాయంత్రంతో రాజారావు పాతిక సంవత్సరాలుగా ఏలిన గుమాస్తా వుద్యోగకాలం ముగిసి పదవీ విరమణ చేశాడు.

అలవాటు ప్రకారం పది గంటలకు భోజనంచేసిన రాజారావుకి ఆ పైన ఏం చెయ్యాలో తోచలేదు. మామూలుగా అయితే ఆఫీసు బట్టలు వేసుకుని, కాగితాల దస్త్రంచేత పట్టుకుని వెళ్ళిపోయేవాడు. ఆ వెళ్ళడం వెళ్ళడం సాయంత్రం ఆరు గంటలకో పైగా ఏమైనా పనులుంటే ఏ ఎనిమిదో అయేది యింటికి వచ్చేసరికి. అంతవరకు కుర్చీకి అతుక్కుపోయి పనిలో నిమగ్నమయేవాడు.

అరుగుమీద నిలబడి అరగంట పైగా అయింది.

అతని సర్వీసులో పనిలేని రోజులు లేకపోలేదు... సెలవలు వస్తూండేవి...అయితే అదొకరకం...అప్పుడు ఉద్యోగి...

మరి ఇప్పుడు?...నిరుద్యోగి...!!

ఆలోచించలేక అతని మనస్సుశూన్యంగా వుంది.

'పోస్ట్' అని కేకవేసి వో కార్డు రాజా

రావు చేతికిచ్చి వచ్చినంత వేగంగామా సైకిలెక్కి సందుమళ్లి పోయాడు పోస్టు వాడు. యాంత్రికంగా పుచ్చుకున్నాడు కార్డు... పెళ్లి శుభలేఖ...దూరపు బంధువుల తాలూకు వారిది...హాల్లోకివెళ్లి కుర్చీలో మేనువాల్చాడు శుభలేఖ కుర్చీ ప్రక్కన పడేసి.

ఎవరో తన చేతులు విరగ్గొట్టినట్లు, తన మనస్సంతా శూన్యమైనట్లు, తను ఒక అచేతనమైన పదార్థంగా అయిపోయినట్లు అనిపించింది రాజారావుకి.

కాలం స్తంభించినట్లుందతనికి.

సాయంత్రం గాలికి కాస్త పార్కువైపు వెడదామా అనిపించింది. అలవాటుగా కండువా భుజాన వేసుకుని బైలుదేరాడు. వీధి చివర సుబ్బారావు కనబడి పలకరించాడు.

సుబ్బారావు టైపిస్టుగా పనిచేసి రిటైరయి రెండేళ్లయింది. రాజారావు యింటికి నాలుగు యిళ్ల అవతలవున్న శ్యామలరావు గారు బజారునుండి కాబోలు వస్తున్నారు. చేతి సంచీ నిండుగా కనబడుతోంది. ఆయన రివెన్యూ డిపార్టుమెంటులో గుమాస్తాగా పనిచేసి పదవీ విరమణచేసి మూడు సంవత్సరాలయింది.

'మనం అంతా ఒక కోవకి చెందిన వాళ్లం అయాం' అన్నాడు పలకరింపుగా.

పార్కులో సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు రాజారావు. ఒక ప్రక్క చిన్న పిల్లలు ఆడుకుంటున్నారు. కొంచెం దూరంలో పెద్ద పిల్లలు నెట్‌కట్టి బ్యాట్మింటన్ ఆడుతున్నారు...అక్కడా అక్కడా జనం చిన్న చిన్న గుంపులుగా కూర్చుని వున్నారు...పార్కులోని లౌడ్‌స్పీకర్‌లోంచి వయొలిన్ వాయిద్యం వినవస్తోంది.

'ఏమోయ్ రాజారావూ!'

పిలుపు వినవచ్చిన దిక్కుగా చూశాడు రాజారావు. అక్కడ కూర్చున్న వారిలో ఒక గుంపులోంచి వో వ్యక్తి చేయెత్తి పిలుస్తున్నాడు.

'ఎవరు చెప్మా?' అనుకొన్నాడు రాజారావు. మర్యాదగా వుండదని అటు వెళ్లాడు.

పిలిచిన అతను తన చిన్ననాటి స్నేహితుడు సత్యం. 'ఒరే అంటే 'ఒరే' అనుకునేటంత సాన్నిహిత్యం వాళ్లది. పెద్దవాళయ్యాక ఎవరి దారి వారిదై విడి

వాన కురిసింది

పోయాడు. యాదృచ్ఛికంగా ఒకటి రెండు మార్లు రైల్లో కలుసుకొనడం జరిగింది యిలాగే.

ఆ కబురు యీ కబురు చెప్పకోడంలో ఆ మిత్రుడు ఉద్యోగ విరమణచేసి ఆరు మాసములైందిట.

'నీకింకా సర్వీసెంత వుంది?' అని అడిగాడు మిత్రుడు.

రాజారావు కంఠం రుద్ధమైంది. 'నిన్నటితో అయిపోయిం'దన్నాడు.

నలుగురిలోకీ రావడానికి ఏదో తప్పు చేసిన వానివలె జంకుగా, సిగ్గుగా వున్నట్లనుభూతి కలుగుతోంది.

'హారే! అదేమిట్రా? అలాగ అయిపోయావ్?' అన్నాడు వోదార్పు ధోరణితో మిత్రుడు.

'అబ్బే. ఏం లేదు ... ఆఁ ఎప్పుడు వచ్చావీవూరు....' అన్నాడు తమాయించుకుంటూ రాజారావు.

'ఏదీ ఇవ్వాళే వచ్చాను. అక్కా, బావ యిక్కడ వున్నారు. చూచి వెడదామని వచ్చాను— మవ్వీ వూళ్లో వున్నట్లు తెలియదు.' అన్నాడు సత్యం. ఇద్దరూ మాట్లాడు కుంటున్నారు ... మాట్లాడుకోడం యేమిటి!...సత్యం చెబుతున్నాడు. రాజారావు తల వూపుతున్నాడు...అంతే...

'మా యింటికి రా' పిలిచాడు మిత్రుణ్ణి రాజారావు'

'రేపు వస్తాలే వూళ్లోవుంటే...' అని యింటి ఎడ్రసు తీసుకొన్నాడు మిత్రుడు,

ఇంటికి వస్తున్న రాజారావుకి షికారు నుండి వస్తున్న యిద్దరు వ్యక్తులు కనబడ్డారు వారిద్దరూ మిత్రులు ... ఒకరు శంకరంగారు. తాసిల్దారుచేసి రిటైరయాడు ... రెండవ ఆయన గోపాలరావు గారు ... పోస్టుమాస్టరుచేసి పదవీ విరమణ చేశాడు. వాళ్లిద్దరూ కలిసేగాని విడిగా యెప్పుడూ కనబడరు బజారుకిగాని, షికారుకిగాని, మరెక్కడికిగాని యిద్దరూ కలిసే వెడతారు. ఆ వెళ్లడంలోనూ నడిచే వెడతారు కబుర్లు చెప్పకుంటూ కులాసాగా!

ఆనాడు గుమ్మం దిగింది మొదలు మళ్లీ గుమ్మంలో అడుగు పెట్టేవరకూ అడుగడుగునా రిటైరయిన వాళ్లే కనబడుతున్నారే! ... చిత్రం ... వీరంతా వూళ్లో వున్న వాళ్లే ... రోజూ తిరిగే వాళ్లే...ఇన్నాళ్లూ తను యెక్కడకు వెళ్లినా అంతా వుద్యోగస్థులే!. .వాళ వాళ్ల డ్యూటీలకు హడావిడిగా వెడుతూనో, డ్యూటీలనుండి వస్తూనే కనబడేవారు... బాగా తెలిసిన వారైతే తమ తమ ఉద్యోగాలలోని సాధక బాధకాలు...గొడవలు ఒకరితో ఒకరు కలబోసుకుంటూండేవారు! ఇదేమిటి! . ఈనాడూ ఒక్కరూ ఉద్యోగస్థులు కనబడరేం? ..అసలే మనశ్శాంతి లేక ..అడుగడుగునా ఏదో మరచిపోయినట్లనుభూతితో .బాధపడుతున్న తనకు రిటైరయిన వాళ్లే కనబడ్డం! ..కనబడిన ఆ వ్యక్తుల విషయం తన దృష్టి నెందుకాకర్షిస్తోంది...? ఆలోచనలతో రాజారావు

ఓం నమః శివాయ

కం॥ రమణీయ రజితగిరిని
రాజిల్లు రత్న రావణ దర్ప
విదారుడున్
రిక్త హస్త అసహాయుడను
రీతి, నీతి, రసజ్ఞ రాజ విరాజి
విశ్వున్॥

కం॥ రుద్రుడు భీకరుడు కాడు
రూపులేని లింగన్న నా వాడే
నా దేవుడున్
కృపిడు నిస్వార్థుడితడు
ర్వూపు మూపడు, చతురుడు,
గుప్త చిదంబరుడే॥

కం॥ రెవ్వరికి సాటిరాడే
రేయింబగులు రక్షణాదీక్ష
దక్షుడున్
వైతాగ్ని రసజ్ఞ రాజా
రౌసరాన ఖాడదు అసమాన
శూర శివుడు॥

కం॥ రోదన వేదన విందుడు
రౌద్రాకార విసర్జించి వినయు
దయోదిక్
రంకె కేక విన నొల్లడు
రఃవిహార, విలాస, వినీల
విచిత్రుడే॥

—రచయిత్రి: శ్రీమతి సరస్వతీగిరి.

మస్తిష్కం వేడెక్కిపోతోంది! గడవని కాలంతో రోజులు వెళ్లదీయడం కష్టమని పించింది. రిటైరయిన యిరవై నాలుగ్గంటలలో రాజారావుకి.

రోజూ యేదో నిర్దిష్టమైన కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలి. ఇన్నాళ్లూ ఒక్క క్షణం తీరికలేకుండా యింతకాలంవుండి, హటాత్తుగా ఏ పనీ లేకుండా అయిపోయే

వరకి స్తబ్ధ జీవితంగా తోచింది. ముందుకాలం ఎలా గడపాలో ఆలోచించుకోడం మంచిదనుకున్నాడు.

అయితే, అతనికి ఆ కష్టం అక్కర్లే

కుండా అతని కార్యక్రమం ఏర్పాటుచేసే వారు తనకు తటస్థపడ్డ రిటైర్డ్ వ్యక్తులు!

రాజారావు వీధినివున్న శ్యామలరావుగారు, ముందువీధిలోని సుబ్బారావుగారు తెల్లవారేసరికి షికారుకి రమ్మని పిలిచారు!...

బజారుకి వెడుతుంటే 'వస్తారా?' అని అడిగేవారు.

'అక్కడ భాగవతం చదువుతున్నారు'

'ఇక్కడ సాహిత్య సభ జరుగుతున్నాయి.

మరెక్కడో రాజకీయ సభ జరుగుతోంది అని పిలుచుకునిపోయేవారు రాజారావుని.

ఒకనాడు వూళ్ళోకి యెవరో ప్రముఖ వ్యక్తి వస్తారని తెలిసింది. ఆయన గౌరవార్థం పురజనులు ఒక సమావేశం యేర్పాటు చేశారు. శంకరంగారు అధ్యక్షత వహిస్తారట ఆ సభకు ఎక్కడ ఏ సమావేశం జరిగినా, వూళ్ళోకి పెద్ద లెవరు వచ్చినా ఆయన ప్రముఖపాత్ర వహిస్తాడు. తన ప్రాముఖ్యత కనబరచుకోడం అలవాటు. సూర్యుడు తూర్పున ఉదయించడం యెంత ఖాయమో ఆయన ఆయా సమావేశాలకు అధ్యక్షత వహించడం అంత ఖాయం! సమావేశాల విషయంలోనే కాదు. వూళ్ళో యెవరు యెక్కడ ఏ కమిటీ ఏర్పాటు చేసుకుంటున్నా అందులో శంకరంగారు పెద్దగా వున్నారన్నమాటే. ఆయన గవర్నమెంటులో తాసిల్దారుచేసి, యెన్నో గౌరవాధ్యక్ష పదవులను రిటైరయ్యాక నిర్వహించాడు. అదీ ఆయన గర్వం అంటుంది లోకం.

ఇవన్నీ వినడమే గాని శంకరంగారి వుపన్యాసం యెప్పుడూ వినలేదు రాజారావు. ఆనాడు వెళ్ళాడు.

అధ్యక్షులైన శంకరంగారు ముఖ్య అతిథిని సభ్యులకు పరిచయం చేశారు...'ఇక నేను చెప్పబోయేదేమంటే మన వూళ్ళోకి ఒక స్వాములవారు వచ్చారు. వారు చాలా విద్వాంసులు. వేదాంతమంతటినీ తన కరతలామలకము చేసుకున్న విశిష్ట వ్యక్తి ఆయన శ్రీకృష్ణపరమాత్మచేత అర్జునునకు బోధ చేసిన భగవద్గీతను వివరించి రేపటినుండి బోధ చేస్తారట. ఈ జీవితాలు శాశ్వతం కావు. మీరంతా వచ్చి వారి వాగమృతమును

వాన కురిసింది

సేవులవిందు చేసుకొని తరించండి. ఇటువంటి తరుణము లభించడం యీ పుర వాస్తవ్యుల పూర్వజన్మ సుకృతం. తప్పక మీరందరు రావాలని ప్రార్థిస్తున్నాను' అని కూర్చున్నారు శంకరంగారు.

'ఇదా అధ్యక్షుని ఉపన్యాసం!' ఆశ్చర్యపోయాడు రాజారావు. అతనికి క్రొత్తగాని శంకరంగారు అప్రస్తుత ప్రసంగం చేస్తాడని అందరికీ తెలుసు. అందుకే సభ్యులు ఆశ్చర్యపోలేదు.

రోడ్డు మీద నలుగురు చేరితే తనూ అక్కడికి వెళ్ళి తన వుద్యోగంలో అధికారం యెలాగ చెలాయించిందీ, తను చేసిన ఉత్తమమైన పనులు గొప్పగా చెబుతూంటాడట శంకరంగారు.

అతని పదవీకాలంలో క్రింది వుద్యోగులైన విద్యాధికులనెంతో వుసురుపెట్టేడట. లంచాలు విపరీతంగా పుచ్చుకునేవాడట. అక్కడి వుద్యోగులు చెబుతూంటారు.

తన ఉద్యోగకాలంలో వేసుకున్న బొవతు దుస్తులు వేసుకుని నెత్తిన టోపీ, చేతిలో బెత్తంతో విచిత్ర వేషధారిలాగ వెడతాడు. సభలకు శంకరంగారు.

'అదిగో టోపీ దాసు' అని అంతా నవ్వుకోడం రాజారాజావు విన్నాడు.

స్వామిజీ వుపన్యాసం యెల్గాగ వుంటుందో చూద్దామనిపించింది రాజారావుకి.

రాజారావు బృందం వెళ్ళేసరికి యింకా స్వామివారు రాలేదు. కాని, సభ్యులు చాలా మంది వచ్చారు. వారంతా పెద్దవాళ్ళే... మాజీ వుద్యోగస్థులే... వారంతా తలొక భగవద్గీత రక రకాల సైజులవి తెచ్చుకున్నారు

'అబ్బా! వీళ్ళంతా పాపం నాలాగే ఎంత క్షోభ పడ్డారో రిటైరయిన కొత్తలో' అనుకున్నాడు రాజారావు.

ఒక్కొక్కరినీ పరిశీలనగా చూశాడు.

ఒకరికి మూతి వంకరపోయి బుగ్గ మీద వుంది. మాట్లాడుతున్నా తెలియడంలేదు,

ఒకరికి పక్షవాతం కాబోలు. చేయ్యి, కాలు చచ్చుపడ్డాయి ... ఒకరికి కాలు వంగడు...ఒకపిల్ల వాడిని తోడు తెచ్చుకుని వచ్చాడొక వృద్ధు...కీళ్లవాతంట...పాపం ...ఆయన రిటైర్డ్ జడ్జీట

ఆయన న్యాయమూర్తి !

కాని భగవంతు డాయనపట్ల అన్యాయం చేస్తున్నా డనిపించింది రాజారావుకి

'అడుగుతీసి అడుగు పెడితె గిలగిల్లాడుతున్నవాడు రాకపోతేయేం?' అని తనప్రక్కనున్న ఒకరిని అడిగాడు రాజారావు.

'ఈ రెండు ఘడియలే ఆయన జీవితంలో ఆనందంగా గడిపేవి' ఆ కాస్సేపూ ఆయన బాధలు మరచిపోతాడు...బోలెడు పింఛను వస్తుంది...భార్యలేదు...ఆయన ఆలనా పాలనాయింట్లో ఎవరికి కావాలి?... జన్మేదుఃఖం...అందులో జరమరీదుఃఖం 'అంటూ ఆ రిటైర్డు జడ్జీగార్ని గురించిన విషయాలెన్నో చెప్పాడు ప్రక్కనున్న ఆయన.

వృద్ధాప్యంలో రకరకాల అంగవైకల్యాలతో వున్న రిటైరయిన వుద్యోగులను చూసి దిమ్మెరపోయాడు రాజారావు.

ఈనాడు తనకు కాలుచెయ్యి ఆడుతోంది. కొన్నాళ్లకు తనకీ యేవో బాధలు రావచ్చు. వచ్చేమిటి ... వచ్చితీరుతాయి ... తనూమానవ మాత్రుడే ... వాటి కతీతు డెట్లా అవుతాడు ?...

ఏడాదిక్రితమే తనకు భార్యావియోగం కలిగింది...నీడలాగ, చేదోడు వాదోడు , తన మనస్సులో వర్తించిన అనుకూలవతి లేక ఎన్నో యిడుములు పడుతున్నాడు తను. తన అన్నపూర్ణ, తన శరీరంలో సగంభాగం పోయింది. సగం భాగంతో తన జీవితం వెళ్లదీస్తున్నాడు.

'ఏమిటో ఈ పుట్టుక ... చావు... బాధలు!

ఇటువంటివారు తటస్థ పడితేనే జీవితమంటే యింతేననే విరక్తికలిగి సన్యసించాడు రాకుమారుడు గౌతముడు.

ఎన్ని బాధలకు గురి అయినా మానవుడు ప్రాణంమీద తీపిని, బంధాలనుండి విముక్తిని తనకుతానై త్యజించలేక పోతున్నాడు. అంధకార బంధురంలో జీవిస్తున్నాడు, వారి జీవితాలకు వెలుగెప్పటికి సాధ్యం ?...అనిపించింది రాజారావుకి.

స్వామిజీ వచ్చారు.

ఆయన సుమారు రెండుగంటలు చెప్పారు గీత గురించి.

రాజారావు కదేమీ అర్థంకాలేదు.

కళ్లకు కనిపించని మహాశక్తి కనిపించ నిది వున్నదనుకోవాలట. దానికై (ఆ పరమాత్మకై) భక్తిసాధన చేయాలట...

అదంతా అసందర్భంగా తోచింది రాజారావుకి.

తన భార్య పోయినప్పుడు లాంటి మాట లేవో వోదార్పుగా చెప్పేవారు !... నీవస్తువు కాదు. వెళ్లిపోయింది' అనేవారు.

ఎంత తేలికగా మాట్లాడారు,

తన భార్య అన్నపూర్ణ అస్తమయం తన జీవితానికి తీరని లోటు ... 'గృహం' అంటే యిల్లుకాదుట. 'గృహిణి గృహముచ్యతే' ఇల్లాలే యిల్లన్నారు విజ్ఞులు. అది ముమ్మాటికీ నిజం అనిపించింది రాజారావుకి.

అదేయింట్లో ... అదే పరిసరాల్లో వుంటున్నా ఏదో అపరిచిత ప్రదేశంలో వున్నట్లనిపిస్తోందతనికి . ఆమే వుంటే రిటైరయాక తనకింత గడ్డుగా గడిచేవా రోజులు ?...

ఆమె వున్నప్పుడు వచ్చిపోయె బంధువులతోను, పెద్దవాళ్లైన తమ సంతానం తరుచు వస్తూ వెడుతూ యెంతోసందడుగా వుండేది యిల్లు ..ఇప్పుడో !...బంధువులు రావడంలేదు...సంతానంకూడా. ఏమిటో... అమ్మలేని యింటిలో వుండలేం నాన్నా...' అంటున్నారు.. తమతో రమ్మన్నారు. కాని, అనుక్షణం ఆమెను జ్ఞాపకం తెచ్చే ఆయిల్లు విడిచి తను వెళ్లలేదు ... అక్కడేవుండి ఆమె గత స్మృతులతో బ్రతుకు వెళ్లదీయ నిశ్చయించాడు...

ఒకనాడు వో సభలో గోపాలరావుగారు కనబడలేదు.

ఆయన పోయాడని తెలిసింది.

ఎప్పుడో తనగురించి యిలాగే చెప్పుకుంటారు అనుకున్నాడు రాజారావు.

ఒకపుస్తకం తీసి చదవలేక పోతున్నాడు ఒక మనోహరమైన ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి ఆనందించలేక పోతున్నాడు నెరకటిలాగ మనస్సుకి నిలకడ లేదు. కాలక్షేపంలేదు.. శాంతి కరువైంది అనుక్షణం రెంగ అతనినరాలను వ్రుంగదీస్తోంది.

ఖిన్నుడైనాడు రాజారావు.

తనభార్య పోయాక యింట్లో పరాయి వ్యక్తిలాగ అనిపిస్తోం దతనికి తనకు ఏది కావలసినా అఖరికి దాహంవేస్తే గ్లాసు నీళ్లు వెళ్లితెచ్చుకుని తాగుతున్నాడు. అడగడానికి మొగమాటంచేత.

ఇక, రిటైరయిన మరుక్షణంనుండ ఏనాడో రిటైరయిన వృద్ధులమధ్య, అంగ వికలుల మధ్య జీవితం ... ఇక్కడా తన అభిప్రాయంతో పనిలేదు. వారి మధ్య తిరుగుతూండడంవల్ల తనూ వృద్ధుడైనట్లు...అవధ్యుడైనట్లు అనుభూతి పొందుతున్నాడు.

ఇంట్లో ఒంటరితనం అనుభవిస్తున్నాడు.

రాజారావు డీలాపడిపోయాడు.

స్వల్పంగా జ్వరం వచ్చింది రాజారావుకి.

రెండు రోజులైనా తగ్గలేదు. డాక్టరు వచ్చి చూశాడు. మందిచ్చాడు.

జ్వరం వచ్చింది మొదలు రాజారావు 'వాన రావాలి. వాన కురవాలి...' అంటున్నాడు.

జ్వరం తగ్గే లక్షణాలు లేకపోగా హెచ్చింది.

'డాక్టరుగారూ...ఏదో లోపల బాధ... తాపంగా వుంది. ఒళ్ళు మంట ... భరించలేను...వాన కురుస్తుందాండి ?'

అంటాడు రాజారావు.

'ఇప్పుడు వానలొస్తాయా రాజారావుగారూ ? జ్వర తీవ్రతవల్ల అలాగ వుంది మీకు. జ్వరం తగ్గితే బాధలూ తగ్గుతాయి. అలాగ బెంబేలు పడకండి' అన్నారు డాక్టరు.

'ఏమండి, వాన కురుస్తుందా డాక్టరుగారూ...నాన్నగారి బాధలు పోతాయేమో... అస్తమానం వాన రావాలంటారు' అడిగారు రాజారావు పిల్లలు డాక్టరుగారిని.

వాళ్ళ ముఖాలలో ఆవేదన, ఆత్రుత చూసిన డాక్టరు హృదయం ద్రవించి పోయింది.

'వాన వస్తుంది. తప్పకుండా వస్తుంది ...మీరు ధైర్యంగ వుండండి ... నాన్నగారికి తగ్గుతుంది ..అబ్బాయ్ గోపీ! నాన్నగారికి ఫేన్ వెయ్యి' అన్నారు డాక్టరు.

మందులు మార్చి యిస్తున్నారాయన.

పదిహేను రోజులైనా జ్వరం తగ్గుముఖం పట్టలేదు...తాపం తగ్గలేదు.

దుష్టగ్రహశాంతి చేస్తానని శాస్త్రుల్లుగారు వెళ్ళారు.


ఒత్తిగిలి పడుకున్నాడు రాజారావు...

గోడనున్న కాలెండరు గాలికి టప టప కొట్టుకుంటోంది.

రాజారావుకి ఏమాత్రం చల్లదనం సోకడంలేదు. అంతగాలి వీస్తున్నా.

ఒకమారు కళ్లుతెరచి మళ్లీ మూసుకున్నాడు.

'వాన వస్తోందా' అంటున్నాడు కళ్ళు మూసుకునే.



పుత్రుని చూచే విధం



బులుసు వెంకటరమణయ్య - ధర్మపథం

తక్కిన వారి తోడి సంబంధాల సంగతి అటుంచి చూస్తే తండ్రికీ, పుత్రుడికీ ఉండే సంబంధం ఎంతో విశిష్టమైనది. పుత్రుడు జన్మించగా పెంచి, పెద్దచేసి విద్యాబుద్ధులు కరిపే వరకూ తండ్రి బాధ్యత ఎక్కువయినది. తన సంగతి పుత్రుడు తాను గ్రహించే వరకూ—అంటే జ్ఞానం వచ్చేవరకూ తండ్రి గమనించవలసి ఉన్నది. ఈ గమనింపు పదిహేనేళ్ళు నిండే వరకు మాత్రమే! ఆ వయస్సు వచ్చేవరకూ ఆయా వయస్సుకు తగినట్లు మానుకోవాలి.

పుట్టిన దగ్గర్నుంచీ అయిదేండ్ల వరకూ పిల్లలకు జ్ఞానం ఉండడం చాలా అరుదు. ఏది మంచో, ఏదీ చెడ్డో తెలియదు. చెప్పినా గ్రహించలేరు. అనవసరంగా మలాం పడతారు. వాళ్ళని చూసి విసుక్కుంటే లాభంలేదు. ఆ వయస్సులోని వాళ్ళు ఏమి చేసినా చెయ్యవలసినదే! రాజాజ్ఞను పాలించేటట్లు నడుచుకోవాలి.

ఐదేండ్లు కాగా — కొంత జ్ఞానం కలుగుతుంది. ఏమి చెప్పినా గ్రహించ గలుగుతారు. అప్పుడు విద్యాభ్యాసం ప్రారంభమవుతుంది. జ్ఞానం ప్రారంభావస్థలో ఉంటుంది గాని ఏది మంచో, బాగా గ్రహించలేరు. పదేండ్లపాటు మంచి చెడ్డలను గురించి తండ్రే తెలియజేయాలి. తాను చెప్పినట్లు పుత్రుడు—తన సేవకుని వలె—నడుచుకోవాలి. 'ఎందుకు చెయ్యాలి?' అని కొడుకు తండ్రిని ప్రశ్నించలేడు. అంత ధైర్యం ఆ వయస్సులో కలగదనే చెప్పాలి. పదిహేనేళ్ళు నిండేవరకూ తండ్రి పుత్రుణ్ణి సేవకుని మాదిరిగానే చూడాలి.

పదహేనేళ్ళు నిండి పదహారవయేడు వచ్చేసరికి స్వయంగా ఆలోచించుకుని మంచిచెడ్డలు గ్రహించేశక్తి కలుగుతుంది. అందువల్ల బోధించవలసిన అవసరం వుండదు. బోధించ పూనుకుంటే 'నాకూ తెలుసునులే. వేరే చెప్పనక్కర్లేదు' అనే సమాధానం రావచ్చు అందువల్ల—అప్పటి నుంచీ తండ్రి పుత్రుణ్ణి మిత్రుడి మాదిరిగా భావించి— కోరితే సలహాలివ్వడం మాత్రం ఉచితం.

ఈ విషయాన్నే నీతిశాస్త్రులు ఇలా చెప్పారు—

'లాలయేత్ పంచ వర్షాణి,
దశ వర్షాణి దాసవత్,
ప్రాప్తే తు షోడశే వర్షే
పుత్రం మిత్రవ దాచరేత్.'

'కుమారుణ్ణి, తండ్రి అయిదేండ్ల వయస్సుదాకా రాజువలెను, తర్వాత పదేండ్లపాటు సేవకునివలెను చూడాలి. పదహారవ ఏడు వచ్చేక మిత్రుణ్ణి చూచినట్లు చూడాలి' అని దీని అభిప్రాయం. ●

వాన కురిసింది

'వాన మనం కావాలన్నప్పుడు వస్తుందా నాన్నా ..నువ్వలాగ బాధపడుతూంటే మాకెంత బెంగగా వుందో తెలుసా?... వాన రావడం మనచేతిలో పనా? చెప్పు .. దైవం నీ మొర ఆలించాలి.

అంటూ వాపోతున్నారు పిల్లలు.

డాక్టరు వచ్చి ఇంజక్షనిచ్చి వెళ్ళాడు.

'నాన్నా ఉత్తరాన మబ్బువేస్తోంది... ఉత్తరాన మబ్బు వూరికే పోదు అనేది అమ్మ...తప్పకుండా వాన వస్తుంది ..నీకు సుఖంగా వుంటుంది...' ఆనందంతో వచ్చి చెప్పారు పిల్లలు.

ఆ మాటలు వినిపించుకున్నట్లు లేదు రాజారావు.

మేఘాలు క్రమంగా వ్యాపించాయి దట్టంగా...ఈదురుగాలితో ఒకటే. ఉరుములు పడుతున్నాయి.

బిడ్డల హృదయం తేలికయింది.

'నాన్నా...వాన వస్తోంది ... కళ్ళుతెరు చూడు...ఎంత చల్లగాలి వేస్తోందో...' అంటున్నారు పిల్లలు.

వానజల్లు ప్రారంభమైంది.

'దేవుడు పలికాడు నాన్నా...నీ బాధ చూశాడు...నీ మొర విన్నాడు...వాన కురుస్తోంది...కళ్ళు తెరు...నీ బాధలు తగ్గిపోతాయింక ..దేవుడు పలికాడు, నాన్నా' తట్టి లేపుతున్నారు పిల్లలు.

దేవుడు పలికాడు. అమ్మదగ్గరకు తీసుకు పోయాడు నాన్నని అని వాళ్ళకు తెలియదు.'

తండ్రి పలక్కపోయేసరికి గొల్లుమన్నారు పిల్లలు.

'పాపం. తాపజ్వరం' అన్నారు అక్కడ చేరిన ఇరుగుపొరుగువాళ్ళు.

కురవకపోతగా కురుస్తున్న వాన రాజారావు అంత్యక్రియలకు ఆటంకంగా తయారైంది. ●

సినిమా బాలట్

ఎప్పటి మాదిరిగానే ఈ సంవత్సరంకూడా 'సినిమా బాలట్'ని నిర్వహిస్తున్నాము. 1971 లో విడుదలైన తెలుగుచిత్రాల పేర్లని, వాటికి సంబంధించిన వివరాలని మాకు తెలిసినంతవరకూ ఈ సంచిక లోనే మరొకచోట వేశాము. డబ్డ్ చిత్రాలని ఆ జాబితాలో చేర్చలేదు.

గమనిక

1. బాలట్ పత్రాలు జనవరి 31 వ తేదీనగానీ, అంతకి ముందుగానీ మా కార్యాలయానికి చేరాలి.

2. ఈ పేజీలో ఉన్న బాలట్ పత్రాన్నే వాడాలి. వేరే కాగితం మీద రాసినవి చెల్లవు.

3. తమకి నచ్చినవారి పేర్లని ఆయా గళ్లలో విడివిడిగా స్ఫుటంగా రాయాలి.

4. బాలట్ పత్రాన్ని సిరాతోనే రాసి నింపాలి.

5. పంపేవారి పూర్తిపేరు, చిరునామా వివరంగా రాయాలి.

6. బాలట్ ఫలితాలు ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఉగాది ప్రత్యేక సంచికలో ప్రచురించగలము.

7. బాలట్ పత్రాలని 'ఎడిటర్, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబు చెట్టిస్ట్రీట్, మదరాసు-1కి' పంపాలి.

8. కవరుమీద 'సినిమాబాలట్' అని స్పష్టంగా రాయాలి.

ముగింపు తేదీ : 31-1-1972

[పాఠకులందరూ మాతో సహకరించి ఈ బాలట్‌ని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము —సం॥]

ఆంధ్రసచిత్రవారపత్రిక

బాలట్ పత్రం

ఉత్తమ చిత్రం Nil	ఉత్తమ దర్శకుడు Nil
ఉత్తమ నటుడు Nil	ఉత్తమ నటి Nil
ఉత్తమ సహాయ నటుడు Nil	ఉత్తమ సహాయ నటి Nil
ఉత్తమ హాస్య నటుడు Nil	ఉత్తమ సంగీత దర్శకుడు Nil

పంపినవారి పూర్తిపేరు.........Name..........

చిరునామా...

....

....

అదృష్టం కలిసి వస్తేనే ప్రతిభ ప్రకాశిస్తుంది! -శారద



తెలుగు చిత్రరంగంలో ప్రవేశించి, మళయాళ భాషలో వుత్తమనటిగా గుర్తింపబడి, ఊర్వశి బిరుదాన్ని పొందిన శారద ప్రస్తుతం చతుర్భాషా చిత్ర నాయికగా విరాజిల్లుతూ వుంది శారద నటించిన చిత్రాలన్నీ ఒక ఎత్తు, 'మనుషులు మారాలి' చిత్రం ఒక ఎత్తు అనే చెప్పాలి మళయాళ, తమిళ, తెలుగు, హిందీ భాషల 'తులాభారం' నాయిక యీమే ఈమె నటనలో ఈజ్ వుంది వోవర్‌గా నటించడం రాదీమెకు స్వయంకృషితో పైకి వచ్చిన తార శారద

అన్ని బాధ్యతలను మోసేది నిర్మాతే

చిత్ర నిర్మాణంలో ఎక్కువగా బాధ్యతను వహించేది నిర్మాతే అని శారద అంటుంది 'సినిమాకి పెట్టుబడి పెట్టడం, టెక్నిషియన్సుకి, ఆర్టిస్టులకి డబ్బుతో సహా కావలసిన సౌకర్యాలను సమకూర్చడం, సెట్లు వేయించడం, అనుకున్న ప్రకారం షెడ్యూలు జరగకపోతే, మళ్ళీ ఆర్టిస్టులందరినీ తీసుకురావడానికి ప్రయత్నించడం, నిర్ణీత తేదీలో సినిమా విడుదలయ్యేందుకు కృషి చెయ్యడం, విడుదల కాగనే చిత్రం ఎలా ప్రదర్శింపబడుతుంది అని తెలుసుకోవడం' లాటి అన్ని విషయాలపై నిర్మాతకుండే శ్రద్ధ మరెవ్వరికీ వుండదు' అని శారద అభిప్రాయపడుతూంది

సమిష్టి కృషి అవసరం

నా నిర్మాతలెప్పుడూ నవ్వుతూవుంటేనే నాకు మనశ్శాంతి దైవకృపవల్ల నా నిర్మాతలందరూ చాలా మంచివాళ్ళుగా కుదిరారు నేను కూడా వారి యిష్టానుసారంగా ప్రవర్తిస్తాను సమిష్టి కృషి వుంటేనే ఫలితం బాగా వస్తుంది' అంది శారద.

ప్రేక్షకుల టేస్టుకి తగ్గ పాత్రలు

పాత్ర నచ్చితేనే నటించడానికి ఒప్పుకుంటాను. అన్నిపాత్రలకీ అంగీకరిస్తే, ఏ ఒక్కదానికీ సరయిన న్యాయం చెయ్యడం కుదరక పోవచ్చు, ప్రేక్షకులు యిస్తున్న గౌరవ, మర్యాదలని కాపాడుకోవాలంటే, వారి టేస్టుకు తగ్గ భూమికలనే ధరించాలి' అంది శారద.

'ఊర్వశి బిరుదు వచ్చిన తర్వాత బాధ్యత చాలా పెరిగింది. ఇంతలోనే నాకు యింత పెద్ద బిరుదు ఎందుకు వచ్చిందబ్బా అని కూడా భావిస్తూ వుంటాను ప్రతి వ్యక్తితో మర్యాదగా. గౌరవంగా మాట్లాడితేనే యీ రంగంలో రాణించగలము' అని శారద చెపుతూంది.

'సినిమాఫీల్డులో ఆర్జించిన డబ్బును యీ పరిశ్రమకు సంబంధించిన మరొక వ్యాపారసంస్థకి వెచ్చించాలనుకుంటున్నాను. ఒకసినిమా నిర్మించడానికి డైరెక్టరు దగ్గర్నుండి లైట్‌బాయ్‌వరకు సహకరించాలి. ఏ ఒక్కరి ప్రతిభవల్ల, యీ పరిశ్రమ వర్ధిల్లడంలేదు.'

నిత్యకళ్యాణం పచ్చతోరణం

'నిజజీవితంలో భార్యాభర్తలుగా వున్న నేను, చలంగారు సినిమాల్లో కూడా దంపతులుగానో, ప్రేయసీ ప్రియులుగానో (తరచుగా) నటించడం ప్రేక్షకులకు అంతగా రుచించక పోవచ్చు. నన్ను మావారు చాలా ఆప్యాయంగా, ఆదరంగా, అభిమానంగా, ప్రేమగా చూసుకుంటారు. మా దాంపత్య జీవితం నిత్యకళ్యాణం పచ్చతోరణం లాగా వుంది' అన్నది ఊర్వశి.

పరస్పరానురాగం

'నా వ్యాపార విషయాల్లోగాని, నా పాత్రల ఎన్నిక విషయాల్లోగాని మావారు జోక్యం కలిగించుకోరు, నన్ను తన అర్ధాంగిగా పరిగణించి, యిల్లాలికి కావలసిన సకల సుఖాలను కలిగిస్తారు; అలాగే నేను

[illegible] సొంతం [illegible] వారు సహాయకృతాలుగా [illegible] ప్రాం

ప్రదంగా చూసుకుంటాను. నేను ఎవరికయినా ఏదయినా సహాయం చెయ్యాలనుకుంటే, ఆయన ఏం, ఎందుకు? అని ప్రశ్నించరు'. అంది శారద.

'నేను యిప్పుడు తెలుగు, తమిళం, హిందీ, మళయాళ చిత్రాల్లో నిర్విరామంగా పనిచేస్తున్నాను అన్ని భాషల ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నందుకు నేను ఎంతో గర్విస్తున్నాను బతికినన్నాళ్లు అందరికీ మంచిగా వుంటూ, అందరి మంచిని పొందడమే నాకు కావలసింది. నేను ఎప్పుడూ చాలా సింపుల్‌గానే వుంటాను అనవసర ఆడంబరాలవల్ల కలిగే ప్రయోజనమేమిటి చెప్పండి?' అని ప్రశ్నించింది 'మానవుడు — దానవుడు' నాయిక.

సినిమా నటిగా గర్వపడుతున్నాను

'ఒకరు ఎంతటి ప్రతిభావంతు లయినప్పటికీ, అదృష్టం కలిసివస్తేనే, ప్రకాశవంత మవుతుంది ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయాన్ని యిస్తూ, ప్రజలకు విజ్ఞాన వినోదాలను అందిస్తూ, మాకు డబ్బును, హోదాను, మనశ్శాంతిని కలిగిస్తున్న సినిమా పరిశ్రమలో నేను ఒకర్తెగా వుండడానికి సంబర పడుతున్నాను.' అంది శారద.

—[illegible] : శ్రీనివాస్

విధిని నమ్ముతారా...?

వాణిశ్రీ



'నేను నమ్మను. విధి మనమీద ఆధారపడి వుంటుందని నేను ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను. ఎలా జరగాలని రాసి ఉంటే అలాజరుగుతుందని కొంతమంది అంటారు. కొన్నింటిలో అది నిజమైనా అన్నింటిలోనూకాదు. ఉదాహరణకి రోడ్ మీదవేగంగావస్తున్న ఒక కారుకిఅడ్డంగా నిలబడి మన విధి ప్రకారం జరుగుతుంది కాని, మనం ఛస్తామా అనుకుంటే అలా జరుగుతుందా? కారు మీదకి రాకుండా వుంటుందా? విధిని నమ్మకు కూచుంటే ఏ దేశమూ ప్రగతిని సాధించలేదు. ఏక్సిడెంటల్‌గా జరిగేదాన్ని 'విధి' అంటున్నాం. దృఢంగా జరిగేదాన్ని విధి అనటం లేదు. అజాగ్రత్తను, నిర్లక్ష్యాన్ని 'విధి' అంటున్నారు మనవాళ్ళు.'

కృష్ణ




'నమ్ముతాను. మనకు సంభవించే నష్టాలు, లాభాలు విధిని అనుసరించే జరుగుతూ ఉంటాయని నా నమ్మకం. ఇందుకు ఉదాహరణగా చెప్పాలంటే— నేను నూరురోజులు ఆడుతుందనుకున్నఒకచిత్రం ఫ్లాప్‌అయింది. ఫ్లాప్ అవుతుందనుకున్న ఒక చిత్రం బ్రహ్మాండమైన హిట్ అయింది. కారణం 'విధి'!'

సావిత్రి



'విధిలో లేదు కాని, కొన్ని మొహాలమీద — అంకెలమీద నమ్మకం వుంది నాకు. కొన్ని మొహాలు — ముఖ్యంగామాఅమ్మాయి మొహం—అంటే నేను కన్నకూతురు కాదు. నేను కనని కూతురు. ఎవరో చెప్పకోండి. మీ వల్లకాదు. ఎందుకు గొడవ, నేనే చెప్పేస్తున్నాను. నా పెద్ద కూతురు చంద్రకళ. నేను కనని ఆ కూతురు మొహమూ, నా కన్నకూతురు (విజయ చాముండేశ్వరి) మొహమూ అంటే నాకెంతో నమ్మకం. నాకు నమ్మకం వున్న అంకెలు: 6, 3, 9, 8.'

సత్యనారాయణ



'నేను ఖచ్చితంగా నమ్ముతాను. అది మీరు విధి అనండి, అదృష్టం అనండి, ఫ్లైవ్ అనండి ... ఒక మంచి జరగాలన్నా, చెడు జరగాలన్నా ఫేట్ ప్రకారమే జరుగుతుంది. ఉదాహరణకి ఒక ఆర్టిస్టును తీసుకోండి. కిందటి సంవత్సరం అతనికి ఏమీ పిక్చర్లు లేకపోవచ్చు. ఈ సంవత్సరం చేతినిండా పిక్చర్లు ఉన్నాయా అంటే— అది అతని గొప్పతనమని నేను అనుకోను. అది విధి! ఆర్టిస్ట్‌కి మంచి పాత్రలు లభించాలంటే విధి చల్లని చూపు చూడాలి. మంచివేషాలు వస్తే కృషి అంటారు కొందరు. ఆ కృషి చెయ్యటానికి కావలసింది ఫేట్!'

చంద్రకళ



'నాకు నమ్మకం లేదు. మనం సిన్సియర్‌గా కష్టపడి ఏపని చేసినా తప్పకుండా సక్సెస్ అవుతామని నా నమ్మకం. మన విధి బాగుంటే పరీక్షల్లో పాసవుతామని—ఏమీ చదవకుండా వెళ్తే పాసవుతామా? అది మన కృషిమీద ఆధారపడి వుంటుంది. ఎక్కడికయినా బయటికి వెళ్లేటపుడు రాహుకాలాలవీ చూడటం అలవాటు లేదు నాకు. ఫేట్‌లో నమ్మకంలేదు గాని, గాడ్‌మీద ఫెయిత్ ఉంది. నేను చేసే ఏపని అయినా సిన్సియర్‌గా చేస్తాను.'

చలం



'నమ్ముతాను. కొందరు ఏదైనా మంచిజరిగితే అది మన గొప్ప అనుకుంటారు. నమ్మమని చెబుతూనే కొందరు, లోలోపల నమ్ముతూ ఉంటారు. మన కృషికూడా విధిని లీడ్ చేస్తూ వుంటుంది. ఆ దృష్టితోనే, నమ్మకంతోనే నేను పనిచేస్తూ వుంటాను. పిక్చర్లు తియ్యటంవరకే మా బాధ్యత! విడుదల అయిం తర్వాత ఏమిటన్నది—'విధి' మీద ఆధారపడి వున్నది. మద్రాసు వస్తానని నాకు తెలీదు. సినిమాలలో చేరతాననీ అనుకోలేదు. అలాగే నాతోపాటు చాలా మంది ఉన్నారు. కారణం—విధి!'

(వచ్చేవారం మరికొందరు)

—మోహన్ కుమార్

కొత్త సంవత్సరానికి కొండంత బాధ్యత - రామకృష్ణ

ఇప్పుడిప్పుడే పైకొస్తున్న హీరో రామకృష్ణ. ఏరకం పాత్రనైనా బాగా పోషించగలడని నిరూపించుకొన్నారు. ప్రస్తుతం రామకృష్ణ బిజీ హీరోలలో ఒకరు. డిశంబరు 27న 'అరుణ స్టుడియోలో' శివజ్యోతి పిక్చర్సు సెట్‌లో కలిసినప్పుడు, 'క్రొత్త సంవత్సరానికి మీ సందేశమేమి'టని అడిగాను.

'క్రొత్త పెండ్లికూతురులాగా చిరునవ్వులు ఒలకబోస్తూ క్రొత్త సంవత్సరం రానే వచ్చింది. వస్తూ కొన్ని కుశల ప్రశ్నలు వేసింది. ఆ ప్రశ్నలేమిటో, వాటికి నా జవాబు లేమిటో చెబుతాను.' అంటూ ప్రారంభించారు రామకృష్ణ.

కొత్తకి ఆదర్శం పాతే

ప్ర- క్రొత్తొక వింత, పాతొకరోత' అన్నది చిత్రసీమకు అన్వయిస్తుందా?

జ. అన్వయించదు. క్రొత్త ఎంత వింతగానున్నా పాతను ఆదర్శప్రాయంగా, పూజనీయంగా, నేను పరిగణిస్తాను. పాత నీటి ప్రవాహం, క్రొత్త నీటి కెరటాన్ని తనలో ఇముడ్చుకోవడం మహోన్నతమైన నడవడికకు ఉదాహరణ.

ప్రశ్న తెలుగు చిత్రసీమ వర్ధిల్లడానికి సూచనలేమిటి?

జ సాంఘిక ప్రయోజనమైన కథల ఉన్నతమైన భావాలతో చక్కటి సాంకేతిక విలువలతో నిర్మించి మన చిత్రసీమయొక్క ప్రత్యేకతను నిరూపించాలి.

రూపాయికి
రూపాయి యిచ్చే చిత్రాలు

ప్ర జేమ్సుబాండ్ చిత్రాలవల్ల ప్రయోజనమేమిటి?

జ. ప్రపంచం నలుమూలలా కోటానుకోట్ల జేమ్సుబాండ్ నవలలు ప్రచురితమై కోట్ల రూపాయలను సంపాదిస్తున్న విషయం మనకందరికీ తెలిసినదే. చిత్ర వ్యాపారంలో రూపాయికి రూపాయి సంపాదించిపెట్టే జేమ్సుబాండ్ చిత్రాలు అనిశ్చిత వ్యాపారానికి రాచబాటగ వుంటూ, వింత విన్యాసాలతో ప్రజలను రంజింపచేస్తున్నాయి.

కొత్త ఆశ

ప్రశ్న: సాంఘిక చిత్రాలపట్ల మీ అభిప్రాయమేమిటి?

జ: దినదినాభివృద్ధి చెందు



తున్న నేటి ఆధునిక ప్రపంచంలో ప్రజలకు విజ్ఞానంతోబాటు నీతి ప్రబోధాన్ని చేసేసాంఘిక, సాంస్కృతిక చిత్రాల నిర్మాణం ఉధృతంగా జరగాలి. తెలుగు చిత్రాలు యావత్ప్రపంచంలో ప్రచారం పొందే విధంగా చక్కటి సందేశాత్మక భావాలతో సమ్మిళితమైన మన సంస్కృతిని చాటిచెప్పే రోజులు దగ్గర్లోనే వున్నాయని ఊహిస్తున్నాను. నా వూహ 1972 లో కొంతవఱకైనా నిజం కావాలని కళామతల్లిని ప్రార్థిస్తున్నాను.

—ఇంటర్వ్యూ: శ్రీనివాస్.

సినిమా

రూ. లక్షన్నర నిధి పోగుచేసిన నాయకుడు

'దేశం ఆపదలో వుంటే, చూస్తూ వూరుకోగలమా చెప్పండి?' అన్నారు నట సమ్రాట్ నాగేశ్వరరావు. 'మీరేమయినా నిధిని ప్రోగు చేసారా?' అని ప్రశ్నించాను.

పదివేలరూపాయలు తన విరాళంగా ప్రకటిస్తూ, తన మిత్రుల వద్దనుండి కూడా కొంత డబ్బును నాగేశ్వరరావు వసూలు చేసాడు. సుమారు లక్షన్నర ప్రోగు అయినట్లు తెలిసింది. ఎవరిచ్చిన చెక్కును వారే తమ చేతి మీదుగా సంక్రాంతి పర్వదినాన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అందచేయ్యగలరని అక్కినేని అన్నారు.

ప్రేమనగర్ 13 కేంద్రాలలో నూరు రోజుల పండుగ

1971లో ఘనవిజయాన్ని సాధించిన చిత్రాల్లో 'ప్రేమనగర్' కూడా ఒకటి. నేను చిత్రం యొక్క సమీక్షను, వాళ్ళ యిదు కేంద్రాలకు వెళ్ళి ప్రజల అభిప్రాయాన్ని విన్నాను. ప్రజలు ఆదరించినట్లే యీ చిత్రం 13 కేంద్రాల్లో శతదినోత్సవం జరుపుకుంటూంది. తెలుగు నవలలకి మంచి గిరాకీ వుంటుందని అది యీ చిత్రం ఋజువు చేసింది.

'ప్రేమనగర్' నిర్మాత రామానాయుడు శతదినోత్సవ సంరంభాన్ని మద్రాసులోని విజయానందనోద్యానంలో జనవరి 8న భారీ ఎత్తున చెయ్యడానికి సంకల్పించారు. ఈసభకి శివాజీగణేశన్ ముఖ్య అతిథిగానస్తారు. ఈ ఫంక్షన్ నవయుగ మరియు సురేష్ మూవీస్ వారిచే జరపబడుతుంది.

'ప్రేమనగర్' తమిళ చిత్రం షూటింగు జనవరి 10న ప్రారంభమవుతుంది. శివాజీ నాయకుడు; వాణిశ్రీ నాయిక. కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు; విన్సెంట్ ఛాయ; మహదేవన్ సంగీతానికి దర్శకుడు. హిందీ 'ప్రేమనగర్'కి దిలీప్ నాయకుడు.

డు తలపెట్టరు; అందరికీ సమాన గౌరవం యిస్తుంది, అనవసర ప్రసంగం లోకి దిగదు, చేతనున్న సహాయం చేస్తుంది ఎవ్వరి మెహర్బానిని ఆశించదు' —యివి జమునలోని విశేషాలు

మానవత్వం వున్న మహిళ గాబట్టే 'దేశ రక్షణ నిధి'కి 5వేల రూపాయలను యిస్తూ, తన చిత్ర ఆదాయంలో పదిశాతం విరాళంగా ప్రకటించింది. జమునలాగ మరికొందరు



'నీతి—నిజాయితీ'లో కాంచన, సతీష్ ఆరోరా.

యిలాటి మంచినిర్ణయాలు తీసుకుంటే పరిశ్రమయొక్క గౌరవం మరింతగా పెరుగుతుంది.

దసరాబుల్లోడు విరాళం

'దసరాబుల్లోడు' నిర్మాత దేశరక్షణ నిధికి 5 వేలు యిచ్చారు మరొక మంచి పనికూడా చేస్తున్నారు

'దసరాబుల్లోడు' చిత్రం హైదరాబాదులో ఒక - సంవత్సరం ప్రదర్శింప

ఇడింది (అంటే 52 వారాలు అన్న మాట.) సాంఘిక చిత్రాలకి యిది పెద్ద రికార్డ్గా. హైదరాబాదులో కాపీ నెం 38 ప్రదర్శింపబడుతూవుంది

ఈ చిత్రం సంవత్సరం పండుగకి వచ్చే డబ్బుని దేశరక్షణనిధికి యివ్వడానికి నిర్మాత రాజేంద్రప్రసాద్, లక్ష్మీ పంపిణీ దారులు నిశ్చయించారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధ్వర్యంలో జనవరి 14 న జరిగే 'దసరాబుల్లోడు' 52 వ వారో త్సవం ఎంతడబ్బుని వసూలు చేస్తుందో (గేటు కలెక్షన్) ఆ మొత్తమంతా దేశ రక్షణనిధికి యివ్వబడుతుంది అంతేగాక,

సినిమా

ఆర్టిస్టులకి యివ్వబడే పారితోషికాలు కూడా వేలంవేసి తద్వారా వచ్చే డబ్బుని కూడా దేశరక్షణనిధికి యివ్వడానికి నిర్ణ యించారు

హైదరాబాదులో జరిగే యీ ఫంక్షన్లో మీ అభిమాన నటీనటులు చాలమంది పాల్గొంటారు మేటి తారా గణం పాల్గొనే నాటకం, ప్రముఖ నేపధ్యగాయకులగానం ప్రత్యేక అంశాలుగా వుంటాయి ఈ సత్సంకల్పాన్ని కలగ చేసిందెవరో తెలుసా ? ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి వి నరసింహారావుగారే.



'కొరకొరాణి'లో రమాప్రభ, మద్రాసు వారి నిర్మాణ. పాటించింది జగపతి రాజేంద్రప్రసాద్, లక్ష్మీ ఫిలింస్ అధినేతలు అండ్ 'నటసామ్రాట్ నాగేశ్వరరావు.

సంవత్సరానికి రెండు చిత్రాలు

'తండ్రులు కొడుకులు' దగ్గర్నుంచి 'కథానాయకుడు' వరకు పరిశీలిస్తే హేమాంబధరరావు యొక్క ట్యాలెంటు అర్ధమవుతుంది గజిబిజి చెయ్యకుండా, చెప్పదలచిన విషయాన్ని సూటిగా చెప్పించి, కధకి సహజత్వాన్ని ఆపాదించి, ఆయా సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాల్లో హత్తుకునే విధంగా డైరెక్టు చెయ్యగల వ్యక్తి హేమాంబరధరరావు 'కొత్త సంవత్స రానికి మీ ప్రాజెక్టు ఏమిటి ?' అని ప్రశ్నించాను

'1972 లో రెండు చిత్రాలను నిర్మించదలిచాను ఒక చిత్రం ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది ఈ చిత్రానికి భమిడి పాటి కధకుడు' అని చెప్పారు హేమాంబర ధరరావు

మీకు తెలుసో, తెలియదో ? ఒకప్పుడు హేమాంబరధరరావు నాకు తెలిసి డజను కు పైచిలుకు నిరాకరించారు. (అస్పష్టత

కారణంగా). మనకున్న మంచి దర్శకుల్లో ఈయన ఒకరు.

పంచరంగుల్లో అయిదవ చిత్రం

రామవిజేత సంస్థ మూడు చిత్రాలను నిర్మించి, ప్రేక్షకులను మెప్పించి, పరిశ్రమలో పలుకుబడిన ఆర్జించి నేడు తనకొక ప్రత్యేక స్థానాన్ని యేర్పరచుకుంది. 'నిర్మాత దర్శకుడు చిన్నవాళ్లే అయినా, గట్టివాళ్లు' అని పదిమందీ అంటున్నారు.

'1972 లో మీ ఆశయం ఏమిటి ?' అని దర్శకుడు బాబురావుని, నిర్మాత ప్రభాకర్‌ని అడిగాను.

"'72లో రెండు చిత్రాలను ప్లాన్ చేస్తున్నాము. నాలగవ కానుకగా ఒక కుటుంబంలోని యిద్దరన్నదమ్ములు రాజకీయాలకి తమ జీవితాన్ని ఎలా ధారపోసారు అనెడి అంశంగొన్న కథను ఎన్నుకుని, భమిడిపాటిచే వ్రాయించాము' అన్నారు అన్నదమ్ములు.

కలర్‌లో లైలామజ్ను

'మా అయిదవ చిత్రం పంచరంగుల్లో నిర్మించబడుతుంది. అమర ప్రేమికులు 'లైలామజ్ను'ని భారీఎత్తున నిర్మించాలనుకుంటున్నాము. ప్రజలు మాపై కురిపించిన అభిమానానికి సర్వదా కృతజ్ఞులమై వుంటాము' అన్నారు రామవిజేత సోదరులు.

కొత్త సంవత్సరంలో కొత్త దర్శకుడు

ప్రతిభతో అదృష్టం అచ్చివస్తే, ఒక వ్యక్తి ఎంతయినా సాధించగలడన్న విషయాన్ని నిజం చేసారు—దాసరి నారాయణరావు. సహాయ రచయితగా పరిశ్రమకి వచ్చి, రచయితగా మారి, సహకార దర్శకుడిగా వుండి, దర్శకుడు అయ్యారు. ఈ వుదంతం అంతా రెండు సంవత్సరాల్లో జరగడమే ఆశ్చర్యం!

శివజ్యోతి పిక్చర్స్ నిర్మిస్తున్న సాంఘికానికి దాసరి నారాయణరావు రచన్ను, దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. తమిళంలో బహుళ ప్రజాదరణ పొందిన ఒక హాస్యరస ప్రధానమైన కథకి కొన్ని మార్పులు చేర్పులు చేసి తెలుగులో దాసరి వ్రాసి, డైరెక్ట్ చేస్తున్నారు.

శివజ్యోతి పిక్చర్స్ యొక్క మొదటి షెడ్యూలు డిశంబరు 27న అరుణా స్టూడియోలో ప్రారంభమైంది. నాయికా నాయకులుగా లక్ష్మి, రామకృష్ణ నటిస్తున్నారు. సహాయ భూమికలను సత్యనారాయణ, రావి కొండలరావు నిర్వహిస్తారు.

దేనికైనా కాలం కలిసిరావాలి - చంద్రకళ



చంద్రబింబంలాంటి ముఖం, నక్షత్రాలనంటి కళ్ళు, అయస్కాంతంలా ఆకర్షించే చూపులు, కాంతివంతమయిన శరీరం, ఇవన్నీ ఆమెకు భగవంతుడు ప్రసాదించినవరం. ఆవరప్రసాదినివరు? ఇంకెవరు, మన సినీతార చంద్రకళే.

'మాతృభాష కొంకణి; (ఆ భాషకి ఒక లిపి లేదు) మరాఠీ, కన్నడం, తెలుగు, హిందీ, తమిళం, ఆంగ్లభాషలపై ఆధిక్యతను సంపాదించింది. కూచిపూడి, భరతంలో ప్రావీణ్యతను పొందింది. నటిగా తనకొక ప్రత్యేక స్థానాన్ని యేర్పరచుకుంది' ఆమె ఎవరు? చంద్రకళే.

'ఆడపడుచు', 'దసరాబుల్లోడు' చిత్రాలను చూచినప్పుడు, చంద్రకళ శోకరసపోషణలో అందెవేసిన చేయి అనెడి భావం మనకు యేర్పడుతుంది. కాని 'తాసిల్దారుగారి అమ్మాయి' చూస్తే, చలాకీ చిలిపి పిల్లగా, హుషారుగా నటించి తను ఏపాత్రకయినా తగుదునమ్మా అనెడి భావాన్ని కలిగించింది. 'తాసిల్దారుగారి అమ్మాయి'లోని ఆమె నటన్ను మెచ్చుకుంటూ, అసంఖ్యాకమైన ఉత్తరాలు వచ్చినట్టు చెప్పింది.

'మీకు తెలుగు చదవడం వచ్చా?' అని అడిగాను. 'మొన్నమొన్నటివరకు ఎవరయినా చదివితే, అలాగే మనస్సులో ముద్రించుకుని, వప్పచెప్పేదాన్ని, ఇప్పుడు నేనే చదవగలుగుతున్నాను' అంది.

'తెలుగుభాషపై మీ అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించాను. 'అమృతతుల్యమైన భాష. నన్ను ఎక్కువగా ఆకర్షించిన భాష' అని చెప్పింది చంద్రకళ. 'మీకు ఎలాంటి పాత్రలంటే యిష్టం?' అన్న నా ప్రశ్నకు ఆమె నవ్వి 'ఎట్లాంటి పాత్రయిచ్చినా, నా శాయశక్తులా కృషిచేసి ఆ పాత్రకు న్యాయం చెయ్యాలనే పట్టుదల నాకుంది. నేను అన్నిరకాల పాత్రలను పోషించియున్నాను' అని జవాబిచ్చింది.

'అంటే సపోర్టింగు కారెక్టరు వున్నా ధరిస్తారన్నమాటేగా' అన్నాను. 'దసరా బుల్లోడు చిత్రంలో ధరించిన భూమికలాంటిది వస్తే, నిరాక్షేపణీయంగా నటిస్తాను ఇకపై చెల్లెళ్ళు, మరదళ్ళు పాత్రల జోలికి పోదలచుకోలేదు' అంది చంద్రకళ.

ప్రస్తుతం తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ హిందీభాషా చిత్రాల్లో నాయిక పాత్రలను పోషిస్తున్న చంద్రకళని 'మీకు నిర్మాత అయ్యే వుద్దేశ్యం లేదా' అని ప్రశ్నించాను.

'మా తండ్రిగారు 'స్త్రీ'ని తెలుగులో నిర్మించాలనుకుని, శోభన్‌బాబును హీరోగా కూడా బుక్ చేశారు. కాని శ్రీధర్‌గారు నిర్మించే 'తులసి' చిత్రకథ కూడా స్త్రీలాగే వుంది. అందుచేత మేము మానుకున్నాము' అంది చంద్రకళ.

'నట సామ్రాట్ నాగేశ్వరరావుతో రొమాంటిక్ పేర్‌గా నటించండి అంటూ అభిమానులు వుత్తరాలు వ్రాస్తుంటారు. దేనికయినా కాలం కలిసిరావాలిగా. మన చేతిలో ఏముంది' అన్నది చిరునవ్వులొలికిస్తూ చంద్రకళ.

– ఇంటర్‌వ్యూ: శ్రీనివాస్

సినిమా

భార్యా బిడ్డలు కంటిలో జిలుగు

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ నిర్మించిన సముజ్వల సాంఘికమే 'భార్యా బిడ్డలు' చిత్రం. ఒక పెండ్లయిన యువకుడు ఎమ్. ఎస్. సి. పట్టభద్రుడై వుద్యోగం దొరక్క, తన మిత్రుడి సాయంతో ఒక మిల్లు యజమానికి మేనేజరుగాచేరి, ఆయన ఏకైక కూతురిచే ప్రేమించబడి, కట్టుకున్న భార్యకు, ప్రేమించే యువతికి నడుమ నలిగిపోతాడు. చివరికి ఆ యువకుడు నిజంచెప్పి భార్యాబిడ్డలతో కాపురం చేసాడా? లేక అబద్ధం కొనసాగించి ప్రేమించిన యువతిని వివాహమాడాడా? అనెడి ప్రశ్నలకు సమాధానమే 'భార్యా బిడ్డలు' చలనచిత్రం.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ అధినేత శ్రీ ఏ. వి. సుబ్బారావు సదా సర్వదా నవ్వుతూ సాక్షాత్కరిస్తారు. మంచి చెయ్యడంతప్ప మరొకటి తెలియని వ్యక్తి ఆయన. అందుకే ఆయన నిర్మించిన చిత్రాలన్నీ ప్రజల మంచినే చవిచూసాయి. ఈ చిత్రంకూడా ప్రజానురంజకంగా నిర్మితమైంది.

'భార్యా బిడ్డలు' రచన్ను ఆచార్య ఆత్రేయ, సంగీతాన్ని మహదేవన్, ఛాయను వెంకటరత్నం నిర్వహించారు ఈ ముగ్గురు వారి శాఖల్లో హేమాహేమీలే. నటీనటులంటారా! నాగేశ్వరరావు. జగ్గయ్య, గుమ్మడి, రాజబాబు, జయలలిత, కృష్ణకుమారి, సూర్యకాంతం, సుమ, హేమలత వీళ్ళందరూ ఎంతటి ప్రతిభావంతులో మీకు తెలియనదికాదు. పంపిణీ దారులు నవయుగ. దర్శకుడు ఆదర్శ భావాలువున్న యువకుడు తాతినేని రామారావు.

–శ్రీనివాస్ ●


అవీ.. ఇవీ

రక్షణనిధికి అమృతాంజన్ లిమిటెడ్ రు. 20,000 లు విరాళం

జాతీయ రక్షణ నిధికి అమృతాంజన్ లిమిటెడ్ తరపున రు. 20,000 ల చెక్కుని డిసెంబరు 29 వ తేదీ ఉదయం తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ ఎం. కరుణానిధికి అందజేయడం జరిగింది. ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Steert, Madras-1; and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3

Chief Editor: S. Sambhu Prasad.


పత్రిక పాఠకులకు
సంక్రాంతి శుభాభినందనలు

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

